ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
ఖమ్మం

fb.com/vaartha Digital

Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

16-8-2026 ఆదివారం సంపుటి: 32 సంచిక: 197 పేజీలు: 8+16 వెల: 8.00



మారుపేర్లతో ఒకే వ్యక్తికి బహుళ పాస్‌పోర్టులు 3
ఎర్రకోటవద్ద తొలిసారి వందేమాతరం ఆలాపన 5


# వికసిత్ భారత్‌కు 'సప్తధార'



ఎర్రకోటలో వేడుకకు హాజరైన అశేష ప్రజానీకం

## ఏడు రంగాల వృద్ధితో దేశం సుసంపన్నం
## మావోయిజాన్ని అంతం చేయగలిగాం..
## డిజిటల్ యుగంలో చిప్‌లకు పెరిగిన ప్రాధాన్యం
## కరోనా, యుద్ధాలను దాటి ముందుకు వచ్చాం
## ఎర్రకోట స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రధాని మోడీ

ఎర్రకోట నుంచి ప్రసంగిస్తున్న ప్రధాని

**న్యూఢిల్లీ, ఆగస్టు 15:** సప్తధార శక్తి సామర్థ్యాలతో దేశాన్ని నూతన శిఖరాలకు తీసుకెళ్తామని భారతావనికి నూతన వేగం అందిస్తామని, సరికొత్త లక్ష్యాలను సాధించి, వాటిని అధిగమించేలా శక్తివంతం చేస్తామని ప్రధానిమోడీ అన్నారు. తయారీ రంగం, రైతాంగం, సాంకేతికత, గతి శక్తి, రక్ష శక్తి, గ్రీన్ ఎనర్జీ, సాఫ్ట్ పవర్ అనే ఏడు ధారల సాయంతో దేశాన్ని స్వయం సమృద్ధం చేస్తామన్నారు. నేడు ప్రతి హృదయం వందేమాతరం నినాదంతో మార్మోగుతోందని ప్రధాని పేర్కొన్నారు. 80వ భారత స్వాతంత్ర్య వేడుకల నేపథ్యంలో శనివారం ఉదయం ఎర్రకోటపై త్రివర్ణ పతాకాన్ని ఆయన ఎగురవేశారు.

>>2



## కృష్ణా, గోదావరి జలాల్లో చివరి బొట్టుదాకా సాధిస్తాం
### తుమ్మిడి హెట్టి నుంచి పాలమూరు దాకా పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేస్తాం
### త్వరలో ఖేలో ఇండియా యూత్ గేమ్స్
### గోల్కొండ కోటలో జాతీయ జెండాను ఆవిష్కరించి ప్రసంగించిన సిఎం రేవంత్

# నీటిపై రాజీలేదు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు15:** తెలంగాణ నీటిఇ హక్కుల విషయంలో రాజీ పడేది లేదని, పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసి రైతుల కళ్లలో ఆనందం చూస్తామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. కృష్ణా, గోదావరి జలాల్లో న్యాయమైన వాటాలో రాజీ పడేది లేదని, చివరి బొట్టు వరకు సాధిస్తామని చెప్పారు. తుమ్మిడిహెట్టి నుంచి పాలమూరు వరకు పెండింగ్ ప్రాజెక్టులను ప్రాధాన్యత

>>2

## లోక్‌భవన్‌లో గవర్నర్ తేనేటి విందు
### హాజరైన సిఎం, మంత్రులు, బిజెపి నేతలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు15:** స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం సాయంత్రం లోక్ భవన్‌లో గవర్నర్ శివ ప్రతాప్‌శుక్లా ఎట్ హోమ్ (తేనేటి విందు) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విచ్చేసిన అతిథులకు గవర్నర్ తేనీటి విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అపరేష్ కుమార్ సింగ్,

>>2




**సంగారెడ్డి బ్యూరో ఆగస్టు 15, ప్రభాతవార్త:** స్మార్ట్ రేషన్ కార్డు కేవలం ఒక కాగితం కాదని, పేదల ఆకలి తీర్చే ఆత్మగౌరవానికి ప్రతీక అని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు. శనివారం సంగారెడ్డి లోని అంబేద్కర్ స్టేడియం గ్రౌండ్స్ లో నిర్వహించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్

>>2

## పేదల ఆత్మగౌరవం రేషన్‌కార్డు
### తక్కువ ధరకే నాణ్యమైన సన్నబియ్యం
### రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తున్నాం
### సంగారెడ్డిలో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసిన సిఎం




# పేదల ఆత్మగౌరవం రేషన్‌కార్డు

>> రెడ్డి, మంత్రులు ఉత్తంకుమార్ రెడ్డి దామోదర్ రాజనర్సింహ వివేక్ వెంకటస్వామి టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్లతో కలిసి పాల్గొని లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు నిత్యావసర సరుకులు అందించేందుకు రేషన్ షాపులను ఏర్పాటు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని అన్నారు.ఇందిరమ్మ రాజ్యంలో ఏ ఒక్క పేదవాడు ఆకలితో అలమటించకూడదన్నదే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబానికి నాణ్యమైన సన్నబియ్యం అందిస్తున్నామని తెలిపారు. సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, ఆరోగ్యశ్రీ వంటి సంక్షేమ కార్యక్రమాలపై ప్రతిపక్షాలు మాట్లాడుతున్నాయని, అయితే పేదల సంక్షేమం కోసం గతంలో వారు ఏం చేశారో ప్రజలు ఆలోచించాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే కరెంటు ఉండదని గతంలో విమర్శలు చేసిన వారు ఇప్పుడు వాస్తవాలను చూడాలని అన్నారు. రాష్ట్రంలో రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని పేర్కొన్నారు. సన్నధాన్యం సాగును ప్రోత్సహించేందుకు క్వింటాల్‌కు రూ.500/ బోనస్ అందిస్తున్నామని తెలిపారు. రైతు భరోసా మొత్తాన్ని పెంచి ఏడాదికి రూ.12 వేల చొప్పున అందిస్తున్నామని, ఇప్పటివరకు రూ.36 వేల కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేశామని చెప్పారు.రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేసి దేశంలో ఎక్కడా లేని విధంగా రూ.21 వేల కోట్లు ఖర్చు చేశామని ముఖ్యమంత్రి తెలిపారు. గత ప్రభుత్వానికి సన్న బియ్యం పంపిణీ చేయాలని ఆలోచన ఎందుకు రాలేదని సీఎం ప్రశ్నించారు. బిజెపి, బిఆర్ఎస్ పార్టీలకు ఒక నాణానికి బొమ్మ బొరుసు లాంటివని అన్నారు. రైతుల సమస్యలపై చర్చించేందుకు అసెంబ్లీకి రావాలని సీఎం రేవంత్ రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్ కు సవాల్ విసిరారు. రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్లు లేని ఊరు లేదని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు.ఒంటరి మహిళలు, చేనేత, గీత కార్మికులకు పెన్షన్లు అందించే బాధ్యత ప్రభుత్వానిదేనని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని, అర్హత ఉన్న వారికి పెన్షన్లు అందిస్తామని చెప్పారు.రెండున్నరేళ్లలో 72 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామని, మరో 10 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు జారీ చేశామని ముఖ్యమంత్రి తెలిపారు. ప్రతి ఆరు నెలలకు ఉద్యోగ ఖాళీలను గుర్తించి భర్తీ చేసే విధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. నిరుద్యోగ యువత మాయమాటలకు లోనుకాకుండా పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు.ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని, విధ్వంసానికి గురైన రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమం వైపు నడిపిస్తూ ముందుకు సాగుతున్నామని ముఖ్యమంత్రి అన్నారు. ప్రజల ఆశీర్వాదం తమ ప్రభుత్వానికి కొనసాగాలని కోరారు.సంగారెడ్డిలో జగ్గారెడ్డి పోటీ చేయాలా వద్దా అన్నది ఆయన ఒక్కరి నిర్ణయం కాదని, కాంగ్రెస్ అగ్ర నాయకత్వం నిర్ణయిస్తుందని ముఖ్యమంత్రి అన్నారు. రాహుల్ గాంధీతో జగ్గారెడ్డికి ఉన్న అనుబంధాన్ని రాముడు-హనుమంతుడి సంబంధంతో పోల్చారు. ఎన్నికల్లో ఓడిపోయినప్పటికీ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల కోసం పనిచేస్తున్న జగ్గారెడ్డి వంటి నాయకుడు ప్రజా జీవితంలో ఉండాల్సిన అవసరం ఉందని, ఆయనకు ప్రజలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో మంత్రులు దామో ఉత్తంకుమార్ రెడ్డి దామోదర్ రాజనర్సింహ వివేక్ వెంకటస్వామి టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ప్రసంగించారు. కార్యక్రమంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి డిసిసి అధ్యక్షురాలు నిర్మల, కార్పొరేషన్ ఛైర్మన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## లోక్‌భవన్‌లో గవర్నర్ తేనేటి విందు

>> శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్, రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు, ఆ పార్టీ సీనియర్ నేతలు హాజరయ్యారు.అలాగే ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, ఉన్నతాధికారులు, ఇతర ఆహ్వానితులు పాల్గొన్నారు.

## హైకోర్ట్‌లో పతాకావిష్కరణ చేసిన సిజె

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు15:** దేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శనివారం తెలంగాణ హైకోర్ట్‌లో జాతీయ పతాకాన్ని హైకోర్టు ప్రదాన న్యాయమూర్తి అనరేష్ కుమార్ సింగ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హైకోర్టు జడ్జీలు,అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఇండొనేసియాలో భారీ భూకంపం
### 50 మంది మృతి, నేలకొరిగిన భవనాలు

**జకార్తా, ఆగస్టు 15:** ఇండొనేసియాలో భారీ భూకంపం సంభవించింది. తూర్పు ఇండొనేసియాలోని ఫ్లోరెస్ దీవి సమీపంలో శనివారం తెల్లవారుజామున 7.7 తీవ్రతతో భారీ భూకంపం తీవ్ర భయాందోళనకు గురిచేసింది. భూకంపం ధాటికి భవనాలు దెబ్బతినగా.. 50 మంది మృతి చెందినట్లు, డజన్ల కొద్దీ ప్రజలు గాయపడినట్లు అధికారులు ప్రాథమికంగా వెల్లడించారు. బలమైన ప్రకంపల నేపథ్యంలో కొద్దిసేపు సునామీ హెచ్చరిక జారీ చేయడంతో వందలాది మంది ప్రజలు ఎత్తయిన ప్రాంతాలకు పరుగులు తీశారు. అమెరికా జియోలాజికల్ సర్వే (యుఎస్‌జిఎస్) ప్రకారం.. ఫ్లోరెస్ దీవి ఉత్తర తీరానికి సమీపంలో భూకంప కేంద్రం నమోదైంది. ఎండె నగరానికి వాయువ్యంగా సుమారు 68 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రం ఉన్నట్లు గుర్తించారు. భూకంపం చాలా తక్కువ లోతులో సంభవించడంతో ప్రకంపనలు తీవ్రంగా కనిపించాయి. తర్వాత అదే ప్రాంతంలో 6.1 తీవ్రతతో సహా పలు ప్రకంపనలు నమోదయ్యాయి. భూకంపం కారణంగా పలు భవనాలు దెబ్బతిన్నాయి. ఆసుపత్రుల్లోని రోగులు సైతం భయంతో బయటకు పరుగులు తీశారు. కొన్ని భవనాల గోడలకు పగుళ్ల ఏర్పడినట్లు స్థానికులు తెలిపారు.

## యూరప్‌లో తీవ్ర ఉష్ణోగ్రతలకు 16 వేలకుపైగా అదనపు మరణాలు

**బ్రస్సెల్స్, ఆగస్టు 15:** యూరప్‌లో నెలకొన్న వేడిగాలులకు ప్రజలు తట్టుకోలేకపోతున్నారు. జూన్‌లో వారం రోజుల పాటు కొనసాగిన తీవ్ర ఉష్ణతరంగం కారణంగా యూరప్‌లో మరణాల సంఖ్య చారిత్రక స్థాయిలో పెరిగింది. సాధారణంగా నమోదయ్యే మరణాలతో పోలిస్తే సుమారు 16 వేల మంది అదనంగా మృతి చెందినట్లు యూరోపియన్ మోర్టాలిటీ మానిటరింగ్ నెట్‌వర్క్ వెల్లడించింది. ముఖ్యంగా అధిక ఉష్ణోగ్రతలకు అంతగా అలవాటు లేని ఉత్తర యూరప్ దేశాలైన ఫ్రాన్స్, బెల్జియం, జర్మనీలో మరణాలు గణనీయంగా పెరిగాయి. యూరప్‌లో ఉష్ణోగ్రతలు 37 డిగ్రీల సెల్సియస్‌ను దాటినప్పుడు, వాయవ్య యూరప్ దేశాల్లోనే మరణాలు ఒక్కసారిగా పెరిగినట్లు విశ్లేషణలో తేలింది. అధిక ఉష్ణోగ్రతలను ఎదుర్కొనేందుకు ఈ దేశాలు తగినంతగా సిద్ధంగా లేకపోవడం ఇందుకు ప్రధాన కారణంగా పేర్కొంటున్నారు. ఉత్తర యూరప్‌లో ఎయిర్ కండిషనింగ్ వినియోగం కూడా తక్కువగా ఉండటం ప్రస్తుతం రాజకీయ చర్చకు దారితీస్తోంది.

# నీటిపై రాజీలేదు

>> క్రమంలో పూర్తి చేస్తాం, వ్యవసాయం దండుగ అనే పరిస్థితి నుంచి వ్యవసాయాన్ని పండుగ చేసి రైతుల కళ్లల్లో ఆనందాన్ని చూసేలా పనిచేస్తామన్నారు. గోల్కొండ కోటలో నిర్వహించిన స్వాతంత్ర్య వేడుకలకు సిఎం ముఖ్యఅతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఆ సందర్భంగా సిఎం మాట్లాడుతూ రాష్ట్రాన్ని విధ్వంసం నుంచి వికాసం వైపు నడిపించే కార్యక్రమాలు తలపెట్టామని, తెలంగాణ పునర్నిర్మాణానికి కొత్త బాటలు వేశామని చెప్పారు. 2025-26లో తెలంగాణ తలసరి ఆదాయం రూ.4,18,931. దేశ తలసరి ఆదాయంతో పోలిస్తే తెలంగాణ తలసరి ఆదాయం దాదాపు 91 శాతం అధికం అని పేర్కొన్నారు. రైతు బాగుంటేనే మనం బాగుంటామని ప్రభుత్వం భావిస్తోంది. రైతులకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నాం అని పేర్కొన్నారు. రూ.2 లక్షల వరకు పంట రుణాల మాఫీ.25 లక్షల కుటుంబాలకు రుణభారం నుంచి విముచేశామన్నారు.

మన రైతులు దేశానికే ఆదర్శంగా నిలిచారు. వరి సాగు విస్తీర్ణం, ఉత్పత్తిలో పంజాబ్‌ను అధిగమించి దేశంలో నంబర్-1గా నిలిచారు.యాసంగిలో 81.12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి కొత్త రికార్డు సృష్టించామన్నారు. రైతు భరోసా కింద రూ.36 వేల కోట్ల పెట్టుబడి సాయం ఇచ్చామని, సన్నవడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇచ్చి అండగా నిలబడ్డాం, 32 నెలల్లో వ్యవసాయం, రైతు సంక్షేమానికి రూ.1.70 లక్షల కోట్లు ఖర్చు చేశామన్నారు.'మహిళా సాధికారతలో తెలంగాణ దేశానికే చిరునామా.కోటీ మంది మహిళలకు కోటీశ్వరులను చేయడమే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నాం, మహాలక్ష్మి ్మ పథకం ద్వారా ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణ పథకం. 335 కోట్ల జీరో టికెట్లు.34 లక్షల మంది మహిళలు ప్రతి రోజు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం చేస్తున్నారు.మహిళలకు దాదాపు రూ.11 వేల కోట్ల మేర ఆదా అయ్యాని చెప్పారు, సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే నిర్వహించాం,దేశంలో ఎస్సీ ఉపకులాల వర్గీకరణ అమలు చేసిన తొలి రాష్ట్రం తెలంగాణ, బ్రిటిష్ హయాంలో కులగణన జరిగింది. తర్వాత 100 యేళ్లలో ఎవరూ కులగణన చేయలేదు,తెలంగాణ ప్రభుత్వం విజయవంతంగా కులగణన చేసి కేంద్రానికి ఆదర్శంగా నిలబడింది,

కేంద్ర ప్రభుత్వం కూడా జనగణనలో కులగణన చేయాలని భావించడం వెనుక తెలంగాణ ఉందన్నారు,బీసీలకు రాజకీయాలు, విద్య, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్ల బిల్లుల ఆమోదించి కేంద్రానికి పంపించాం.12 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కనీస వేతనాల సవరణ. కోటి 11 లక్షల మంది కార్మికులకు ప్రయోజనం.గిగ్ కార్మికులకు చట్టబద్ధ గుర్తింపు, సంక్షేమ బోర్డు, సామాజిక భద్రతకు ప్రత్యేక చట్టం. వృద్ధ తల్లిదండ్రులు నిరాదరణకు గురవకుండా సంరక్షి ంచే ప్రత్యేక చట్టం తెచ్చామన్నారు. ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్. 105 స్కూళ్ల మంజూరు.ఇప్పటికే 84 స్కూల్స్ కు అనుమతులు ఇచ్చి పనులు ప్రారంభించుకున్నామన్నారు ప్రీప్రైమరీ నుంచి ఇంటర్ వరకు 22 లక్షల మంది విద్యార్థులకు అల్పాహారం, పాలు, పోషకాహారం. ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో డైట్ ఛార్జీలు 40 శాతం, కాస్మొటిక్ ఛార్జీలు 212 శాతం పెంపు, బడుగు బలహీన మైనార్టీ దళిత పిల్లలు ఆత్మగౌరవంతో బతకడానికి ఈ ప్రయత్నం చేస్తున్నామన్నారు. విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్మెంట్. యాజమాన్యాలతో సంబంధం లేకుండా ప్రతి విద్యా సంవత్సరం నేరుగా విద్యార్థుల ఖాతాల్లో జమ చేస్తామన్నారు,సర్టిఫికెట్ ఉంటే సరిపోదు,దానితో పాటు సాంకేతిక నైపుణ్యం ఉంటేనే ఉద్యోగ ఉపాధి అవకాశాలు వస్తున్నాయన్నారు. తొలి రెండేండ్లలోనే 72 వేలకుపైగా ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు పూర్తి చేశాం. టీజీపీఎస్సీ ని ప్రక్షాళన చేసి పారదర్శకంగా పునరుద్ధరించాం, టీజీపీఎస్సీ ద్వారా 456 పోస్టులు, పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా 7,437 పోస్టుల నియామకానికి నోటిఫికేషన్లు ఇచ్చామన్నారు. పోటీ పరీక్షలు నిరుద్యోగులు సిద్ధం కావాలి.. ఇతర వ్యాపకాల్లోకి పోవద్దు, యువతతో విద్యతో పాటు నైపుణ్యం, ఉద్యోగం కల్పించడం కోసం స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యం కోసం ప్రత్యేక దృష్టి పెడుతున్నాం. యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ, గచ్చిబౌలి స్పోర్ట్స్ డిస్ట్రిక్ట్ ను ఏర్పాటు చేశాం, మట్టిలో మాణిక్యాలను వెలికి తీయడానికి సీఎం కప్ క్రీడా పోటీలను నిర్వహించామన్నారు. త్వరలో ఖేలో ఇండియా 2026ను నిర్వహించబోతున్నాం, గోషామహల్‌లో రూ.2,700 కోట్లతో ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణం,త్వరలో సనత్ నగర్ టిమ్స్ ను ప్రారంభించుకోబోతున్నాం,తొమ్మిది కొత్త ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేశాం.మరో 8 మెడికల్ కాలేజీల నిర్మాణం చేస్తున్నామన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా 5 లక్షల18 వేల మందికి రూ.2,526 కోట్ల సాయం చేశామన్నారు. ఆహార కల్తీ నియంత్రణ, డ్రగ్స్ నియంత్రణను ఒకే వ్యవస్థ కిందకు తీసుకువచ్చి ప్రత్యేక లీగల్, ల్యాబొరేటరీ, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాలు. విస్తృత తనిఖీలు, దాడులు నిర్వహిస్తారు,

తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. హైవేలు, ఔటర్ రింగ్ రోడ్డుపై ప్రమాదాలు తగ్గించేందుకు కొత్తగా టీజీ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ అండ్ రోడ్ సేఫ్టీ బ్యూరో ఏర్పాటు చేశామన్నారు. పభుత్వానికి రావాల్సిన ఆదాయం పక్కదారి పట్టకుండా, పన్నులు-రుసుముల ఎగవేతను అరికట్టేందుకు విజిలెన్స్, పౌరసరఫరాల శాఖల్లో ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాల ఏర్పాటు చేశామన్నారు.ప్రజా ప్రభుత్వం బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ప్రతినెలా ఫస్ట్ తారీఖున ప్రభుత్వ ఉద్యోగాలకు జీతాలు ఇస్తున్నాం..

కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఒకటో తేదీన జీతాల చెల్లింపు చేస్తున్నాం. పేరుకుపోయిన రిటైర్డ్ ఉద్యోగుల బకాయిల చెల్లించాం..వంద రోజుల్లో రూ.6000 కోట్ల బకాయిల కింద చెల్లించాం,ఇతర బకాయిలను సరైన సమయంలో అందిస్తామని మాట ఇస్తున్నాం. అని చెప్పారు.

ప్రజల సమస్యలకు మండల స్థాయిలోనే పరిష్కరించేందుకు ఈ నెల 17వ తేదీ నుంచి రాష్ట్రంలోని అన్ని ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రజావాణిని నిర్వహిస్తామని, ఆన్‌లైన్ ప్రజావాణి పోర్టల్. రాష్ట్రంలోని ఏ ప్రాంతం నుంచైనా అర్జీలు నమోదు చేసుకునే అవకాశం కల్పిస్తామన్నారు. హైదరాబాద్ మెట్రో రెండో దశలో ఏడు కారిడార్లతో 122.9 కిలోమీటర్ల విస్తరిస్తున్నాం..వరంగల్ జిల్లాలో మామునూరు ఎయిర్‌పోర్ట్ ను పునరుద్ధరిస్తున్నాం. ఆదిలాబాద్ ఎయిర్‌ఫీల్డ్ అభివృద్ధి చేస్తున్నాం అని చెప్పారు. మూసీ పునరుజ్జీవన పథకంలో 55 కిలోమీటర్ల సమగ్ర అభివృద్ధి చేస్తున్నాం..39 కొత్త ఎస్టీపీలు నిర్మిస్తున్నాం, గోదావరి నుంచి 2.5 టీఎంసీల స్వచ్ఛమైన నీటిని మూసీకి తరలించే ప్రణాళిక తో ముందుకు వెళ్తున్నాం, నిర్వాసితులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందన్నారు.దేశీయ, అంతర్జాతీయ పరిశ్రమలకు పెట్టుబడుల గమ్యస్థానంగా తెలంగాణ మారిందన్నారు. తెలంగాణ ఇన్వెస్ట్ ద్వారా రూ.1.29 లక్షల కోట్ల పెట్టుబడులను సాధించాం, తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2025లో రూ.5 లక్షల75 వేల కోట్ల పెట్టుబడుల ఒప్పందాలు చేసుకున్నాం..త్వరలోనే తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తాం. ఇన్వెస్ట్ తెలంగాణ గా ప్రపంచానికి చాటు చెపుతాం, తెలంగాణ రైజింగ్-2047 విజన్తో ప్రపంచంతో పోటీపడే భవిష్యత్తు తెలంగాణకు ప్రణాళికలు వేస్తున్నామన్నారు. విధ్వంసం నుంచి వికాసం వైపు ప్రారంభమైన ప్రయాణాన్ని మరింత వేగంగా ముందుకు తీసుకెళ్లి తెలంగాణను దేశంలోనే ఆదర్శంగా, ప్రపంచ వేదికపై సగర్వంగా నిలబెట్టడమే సంకల్పమని పేర్కొన్నారు.


శనివారం గోల్కొండ కోట పంద్రాగస్టు వేడుకల్లో ప్రసంగిస్తున్న సిఎం రేవంత్


లోక్‌భవన్ ఎట్‌హోంలో గవర్నర్ శుక్లా హైకోర్టు సిజె జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్, సిఎం రేవంత్ తదితరులు

## ఎర్రకోట వేడుకలకు హాజరుకాని రాహుల్, ఖర్గే

**న్యూఢిల్లీ, ఆగస్టు 15:** లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీతోపాటు, కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఎర్రకోట వద్ద శనివారం జరిగిన స్వాతంత్ర్య దిన వేడుకలకు హాజరుకాలేదు. ఇద్దరూ ఈ వేడుకలకు హాజరుకాకపోవడం వరుసగా ఇది రెండోసారి. ఎర్రకోట వద్ద ప్రతి ఏడాదిలాగే ఈసారి కూడా స్వాతంత్ర్య దిన వేడుకలు ఘనంగా జరిగాయి. 80వ ఇండిపెండెన్స్ డే వేడుకలు ప్రధాని మోదీ ఆధ్వర్యంలో జరిగాయి. సాధారణంగా ఈ వేడుకలకు రాజకీయాలకు అతీతంగా ప్రతిపక్ష నేతలు, ఇతర పార్టీల నాయకులు కూడా హాజరవుతారు. గతంలో ఖర్గే, రాహుల్ సహా అగ్రనేతలు హాజరయ్యే వారు. కానీ, గత ఏడాది జరిగిన వేడుకలతోపాటు ఈరోజు జరిగిన వేడుకలకు కూడా ఇద్దరూ హాజరుకాకపోవడం ఆసక్తికరంగా మారింది. అధికారపక్షానికి, ప్రతిపక్షానికి మధ్య దూరం పెరిగింది అనేందుకు ఈ పరిణామం ఒక నిదర్శనం అని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇటీవల జరిగిన పార్లమెంట్ సమావేశాలు అధికార, ప్రతిపక్షాల మధ్య వైరంగా మారిన సంగతి తెలిసిందే. మోడీపై, అమిత్ షాపై రాహుల్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. రాహుల్ ఎర్రకోట వద్ద వేడుకలకు చివరిగా 2024లో హాజరయ్యారు. అప్పట్లో రాహుల్‌కు కేటాయించిన సీటుపై వివాదం నడిచింది. ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత అయిన రాహుల్ గాంధీకి రెండో వరుసలో సీట్లు కేటాయించడం వివాదాస్పదంగా మారింది. ఇలాంటి వేడుకల్లో ప్రతిపక్ష నేతకు ముందు వరుసలో సీటు కేటాయించాలి. ఆ తర్వాత నుంచి వేడుకలకు ఆయన హాజరవ్వడం లేదు. సాధారణంగా లోక్‌సభ ప్రతిపక్ష నేతకు క్యాబినెట్ హోదా ఉంటుంది. ప్రోటోకాల్ అనుసరించాలి. రాహుల్‌కు సీటు కేటాయింపులో ప్రభుత్వం ఇవేమీ పట్టించుకోలేదు. దీనిపై అప్పట్లో కాంగ్రెస్ విమర్శలు చేసింది. ఆయనను అవమానించడం అంటే, ప్రజల్ని అవమానించినట్లే అని వ్యాఖ్యానించింది. అటు అధికారపక్షం, ఇటు ప్రతిపక్షం తమ పంతాలకు ఎప్పటినుంచో వస్తున్న సంప్రదాయాల్ని కాలరాస్తున్నాయని రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం.

## సిఎం రేవంత్‌రెడ్డి నేడు మూడు జిల్లాల్లో పర్యటన

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు15:** మూడు జిల్లాల్లో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆదివారం పర్యటించనున్నారు. కామారెడ్డి, ములుగు, హనుమకొండ జిల్లాల్లో ఆదివారం ముఖ్యమంత్రి పర్యటించనున్నారు. నేడు ఉదయం హైదరాబాద్ నుంచి బయలుదేరి కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండలం కందర్పల్లి చేరుకొని, జుక్కల్ ఎమ్మెల్యే లక్షీ ్మకాంతరావు కుమార్తె వివాహ విందుకు సిఎం హాజరవుతారు. అనంతరం ములుగు జిల్లా మేడారం చేరుకొని వన దేవతల సమ్మక్కసారలమ్మ గద్దెలను సిఎం రేవంత్‌రెడ్డి దర్శించుకుంటారు. అక్కడి నుంచి ములుగు పట్టణానికి చేరుకొని గట్టమ్మ ఆలయం సమీపంలో ఏర్పాటు చేసిన పైలాన్ ఆవిష్కరించి, కొత్త కలెక్టరేట్ సముదాయాన్ని ప్రారంభిస్తారు. అక్కడ నుంచి హన్మకొండ జిల్లా పరకాల చేరుకొని వివిధ శాఖలకు సంబంధించిన అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ శిలాఫలకాలను సిఎం ఆవిష్కరిస్తారు. అక్కడే ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రసంగిస్తారు.

## వారం - వర్జ్యం

16-08-2026, ఆదివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
శ్రావణం మాసం, దక్షిణాయణం,
వర్ష ఋతువు, శుక్లపక్షం, ఆశ్లేషకార్తె
చవితి సా.4.58 న.హస్త రా.3.52
వ.మ.12.00-మ.1.37
దు.సా.4.46-సా.5.37
రాహు సా.4.30-సా.6.00
శుభ లేదు.

## వార్తాఫలం

**మేషం :** జీవిత భాగస్వామితో స్వల్ప విభేదాలు తలెత్తుతాయి. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉంటుంది.

**వృషభం :** ఇంటిలో తల్లి ఆరోగ్యం కొంత కలవర పెడుతుంది. గృహనిర్మాణ యత్నాలు ఫలించవు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉంటుంది.

**మిథునం :** శాస్త్ర, సాంకేతిక విషయాల యందు ఆసక్తి చూపుతారు. క్రయ విక్రయాలలో ప్రోత్సాహం.

**కర్కాటకం :** పట్టుదలతో ముందుకు సాగి పనులు పూర్తి చేస్తారు. చర్చాగోష్ఠులలో చురుకుగా పాల్గొంటారు. విందు వినోదాలు.

**సింహం :** పారిశ్రామిక, రాజకీయ రంగాల వారు అరుదైన ఆహ్వానాలు అందుకుంటారు. మిత్రుల కలయిక.

**కన్య :** ఆస్తి వివాదాలు పరిష్కార దశకు చేరుకుంటాయి. కుటుంబంలో శుభకార్యాల ప్రస్తావన ఉంటుంది. ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరంగా ఉంటుంది.

**తుల :** దూర ప్రయాణాలలో నూతన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి. ఇంటా బయటా అనుకూలం.

**వృశ్చికం :** సంఘంలో పలుకుబడి కలిగిన వ్యక్తులతో పరిచయాలు ఏర్పరచుకుంటారు. వస్తు కొనుగోలు. స్వల్ప ధనలాభం పొందుతారు.

**ధనుస్సు :** సన్నిహితుల సలహాతో నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. కాంట్రాక్టులు లాభిస్తాయి. వస్త్ర లాభం.

**మకరం :** భూ సంబంధిత వివాదాలు తీరి లబ్ధి పొందుతారు. బంధువుల రాక ఆనందం కలిగిస్తుంది. క్రయవిక్రయాలలో ప్రోత్సాహం.

**కుంభం :** సోదరుల నుండి స్వల్ప విభేదాలు తలెత్తుతాయి. రాజకీయ రంగాలలోని వారికి విదేశీ పర్యటనలు. మిత్రుల కలయిక.

**మీనం :** ముఖ్యమైన వ్యవహారాలలో ఆటంకాలు ఎదురైనా అధిగమిస్తారు. సెల్ఫ్ డ్రైవింగ్ పట్ల మెలకువ అవసరం.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# భారత్‌కు 'సప్తధార'

>> అనంతరం ప్రజలను ఉద్దేశించి ప్రధాని మోడీ ప్రసంగించారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురుతోందన్నారు. ఎందరో వీరుల బలిదానాల ఫలితమే స్వాతంత్రం అని వివరించారు. తొలిసారిగా ఎర్రకోట వద్ద వందేమాతరం గీతాన్ని ఆలపించామని అన్నారు. దేశం కొత్త ఉత్సాహంతో ముందుకెళ్తోందని పేర్కొన్నారు. వికసిత్ భారత్ 2047 లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని అన్నారు. భారత్ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ దిశగా ఎదుగుతోందని విశ్వాసం వ్యక్తం చేశారు. సంకల్పం దృఢంగా ఉంటే కఠిన సవాళ్లను సునాయాసంగా ఎదుర్కోవచ్చునని ప్రధాని మోడీ తెలిపారు. సంకల్పం, కలలు ఉన్నతంగా ఉంటే సామర్థ్యం పెరుగుతుందని చెప్పారు. ఇవాళ ప్రపంచమంతా భారత్‌వైపు చూస్తోందన్నారు. శౌచాలయాలు 4 రెట్ల వేగంతో నిర్మించామని, పేదలకు ఇళ్లు 3 రెట్ల వేగంతో నిర్మించామని తెలిపారు. దేశవ్యాప్తంగా మెట్రోరైళ్ల సదుపాయాలు పెరిగాయని, ఆత్మనిర్భర భారత్ సాధనే మన లక్ష్యమని ప్రధాని మోడీ పునరుద్ఘాటించారు. ఆత్మ విశ్వాసం పెంచుకోవడంతోపాటు స్వయం సమృద్ధి సాధించాలని ఈ సందర్భంగా ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. వోకల్ ఫర్ లోకల్ నినాదంతో ముందుకెళ్తున్నామని అన్నారు. పలు ప్రాంతాల్లో వరదలు, కొండచరియలు విరిగిపడటం వంటి విపత్తుల వల్ల ప్రభావితమైన కుటుంబాలకు యావత్ దేశం అండగా నిలుస్తుందని అన్నారు.

డిజిటల్ యుగంలో పెరిగిన చిప్ ప్రాముఖ్యం....

డిజిటల్ ప్రపంచంలో ఎలక్ట్రానిక్ వస్తువుల్లో చిప్ ప్రాముఖ్యత పెరిగిందని వివరించారు. సెమీకండక్టర్ల రంగంలో స్వావలంబన దిశగా కీలక చర్యలు చేపట్టినట్లు చెప్పారు. మూడు ప్రధాన సెమీకండక్టర్ ప్లాంట్లు కార్యకలాపాలు చేపట్టాయని గుర్తు చేశారు. ఏడెనిమిదేళ్లలో దాదాపు 8 సెమీకండక్టర్ ప్లాంట్లు ప్రారంభమయ్యే అవకాశం ఉందని ప్రధాని మోడీ తెలిపారు.డ200 గిగావాట్ల అణుఇంధనం ఉత్పత్తి మన లక్ష్యమన్నారు. ఐదు అణు రియాక్టర్ల ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. దేశంలోని 70 నగరాల్లో పైప్‌లైన్ ద్వారా గ్యాస్ అందిస్తుమ్మని చెప్పారు. 1.75 కోట్ల ఇళ్లకు పైప్ లైన్ ద్వారా వంట గ్యాస్ అందిస్తున్నామని వివరించారు. ఇంధన భద్రత సాధించడం దేశ తక్షణ అవసరం అని నొక్కి చెప్పారు. దేశాభివృద్ధిని అడ్డుకోవడం ఎవరి తరం కాదని ప్రధాని మోడీ స్పష్టం చేశారు. 12 ఏళ్లలో అన్ని రంగాల్లో ఎంతో అభివృద్ధి సాధించామన్నారు. 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటకు వచ్చారని గుర్తు చేశారు.


శనివారం ఎర్రకోట పంద్రాగస్టు వేడుకల్లో పాల్గొన్న కేంద్రమంత్రులు అమిత్‌షా, రాజ్‌నాథ్ తదితరులు

రైల్వే కోచ్, మొబైల్ ఫోన్ల తయారీ పెరిగిందని వివరించారు. డిజిటల్ లావాదేవీలు 100 రెట్లు పెరిగాయని గుర్తు చేశారు. రైల్వే విద్యుదీకరణను 30 నుంచి వందశాతానికి పెంచామన్నారు. తొలి హైడ్రోజన్ రైలును కూడా ప్రారంభించామని వివరించారు. అనేక చట్టాలను మార్చామన్నారు.

కరోనాతర్వాత యుద్ధాలు ముంచేసాయి..

కరోనా మహమ్మారి ప్రపంచాన్నే ముంచేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. కరోనా నుంచి బయటపడగానే యుద్ధాలు ముంచేశాయని పేర్కొన్నారు. ముందు ఉక్రెయిన్ యుద్ధం ఇప్పుడు ఇరాన్ యుద్ధం అని వివరించారు. యుద్ధాలు వస్తే ఇంధనం, ఎరువులు దొరకవని కొందరు భయపెట్టారని ఎన్ని అడ్డంకులు సృష్టించినా ప్రజలకు లోటు రానివ్వలేదని చెప్పారు. సంక్షోభం వస్తుందని ముందే ఊహించి ముందస్తు ఏర్పాట్లు చేశామని గుర్తు చేశారు. యూరియా, డీఏపీ ధరలు పెరిగినా ఇక్కడ సబ్సిడీకి ఇస్తున్నామని పేర్కొన్నారు. భారత్‌లో స్థిరమైన ప్రభుత్వం ఉందని ప్రధాని మోడీ పునరుద్ఘాటించారు. 2014 తర్వాత 40 దేశాలతో ట్రేడ్ అగ్రిమెంట్‌లు చేశామని గుర్తు చేశారు. మన టెక్స్‌టైల్, ఫార్మా, మత్స్య సంపద మనల్ని రక్షిస్తోందని చెప్పారు. రక్షణ రంగంలో స్వయం సమృద్ధి సాధించాలన్నారు. భారత్ నుంచి రక్షణ రంగ ఎగుమతులు పెరగాలని ఆకాంక్షించారు. గత 12 ఏళ్లలో రక్షణ రంగ ఉత్పత్తి 4 రెట్లు పెరిగిందన్నారు. ఖాదీ, గ్రామీణ పరిశ్రమల ఉత్పత్తి 5 రెట్లు పెరిగిందని చెప్పారు. ఎలక్ట్రానిక్స్ తయారీ 7 రెట్లు, మొబైల్ ఫోన్ల ఉత్పత్తి 33 రెట్లు పెరిగిందని వివరించారు. భారత్ 6జీ టెక్నాలజీని ప్రపంచమంతా తీసుకెళ్లాలని తెలిపారు. ఫార్చ్యూన్ 500 కంపెనీల్లో భారత్ నుంచి 50 సంస్థలు ఉండాలని ప్రధాని మోడీ ఆకాంక్షించారు.

నక్సలిజాన్ని అంతంచేసాం...

దేశంలో నక్సలిజాన్ని అంతమొందించామన్నారు. నక్సలిజం, మావోయిజం ఎంతోమంది యువకులను బలి తీసుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. యుద్ధంలో ఎంతమంది సైనికులు చనిపోయారో నక్సలిజంతో అంతమంది పోలీసులు చనిపోయారని పేర్కొన్నారు. నక్సలిజం భావజాలం ఉన్నవారిని కట్టడి చేయాల్సి ఉందన్నారు. కానీ దేశంలో చాలామంది మావోవాదులు ఉన్నారని చెప్పారు. వారి మనసుల్లో మావోయిజం, నక్సలిజం ఇంకా ఉందని తెలిపారు. అలాంటి వారిని కనిపెట్టి నిర్మూలించాల్సిన అవసరం ఉందని ప్రధాని మోడీ స్పష్టం చేశారు. మహిళా రిజర్వేషన్ల అమలుకు అన్ని పార్టీలు కలిసి రావాలని ప్రధాని మోడీ పిలుపునిచ్చారు. మహిళలకు 33శాతం రిజర్వేషన్ల కోటా అందాల్సి ఉందన్నారు. మహిళా బిల్లుకు సహకరించి ఆ ఘనత మీరే తీసుకోవాలని ప్రతిపక్షాలకు ఆయన స్పష్టం చేశారు. దేశాభివృద్ధిలో జనగణన ఎంతో కీలకమని పేర్కొన్నారు. పథకాల రూపకల్పనకు జనగణన సమాచారం కీలకమని అభివర్ణించారు. జనగణనకు యువత సహకరించాల్సి ఉందన్నారు. జనగణన నమోదులో తప్పులు లేకుండా చూడాలని అందుకోసం యువతకు ఉచిత ఆన్‌లైన్ శిక్షణ అందిస్తామని ప్రధాని మోడీ వివరించారు.



## కాంగ్రెస్ కార్యాలయంలో వందేమాతరం గీతాలాపనపై విమర్శలు

**న్యూఢిల్లీ, ఆగస్టు 15:** కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయంలో 80వ స్వాతంత్ర దిన వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకల సందర్భంగా జరిగిన ఒక ఘటనపై స్వల్ప వివాదం మొదలైంది. వందేమాతరం గేయానికి ఇటీవల పూర్తిస్థాయి జాతీయ గేయంగా గౌరవం దక్కింది. జాతీయ గీతానికి ఉన్న గౌరవాన్నే కేంద్రం కల్పించింది. దీంతో తాజా స్వాతంత్ర్య దిన వేడుకల్లో వందేమాతరం ఆలపించడం తప్పనిసరి అయింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన వేడుకల సందర్భంగా కూడా వందేమాతరాన్ని నిర్వాహకులు ప్లే చేశారు. అది కూడా పూర్తి గేయాన్ని. అయితే, ఈ గేయం ప్లే అవుతుండగా సోనియా, రాహుల్ వ్యవహరించిన తీరు వివాదాస్పదంగా మారింది. వందేమాతరం ప్లే అవుతున్నప్పుడు సోనియా, రాహుల్ కాస్త అటూ, ఇటూ చూడటం చేశారు. దీంతో పూర్తి వందేమాతరం గేయం ప్లే అవ్వకుండా ఆపేయాలంటూ సూచించారని అంటూ ప్రచారం జరుగుతోంది. ఈ సమయంలో పక్కనే కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా ఉన్నారు. సోనియా, ఖర్గే కాస్సేపు ఏదో చర్చించుకుంటున్నట్లు అక్కడి వీడియోలో కనిపించింది. దీంతో వారు వందేమాతరాన్ని ఆపేయమన్నారంటూ ప్రచారం జరగడంతో ఆ పార్టీ స్పందించింది. ఈ ప్రచారంలో ఎలాంటి నిజం లేదని కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. ఈ కార్యక్రమానికి హాజరైన ఖర్గే చాలాసేపు నిలబడే ఉన్నారు. పెద్దవయసు కావడంతో ఆయనకు కుర్చీ ఏర్పాటు చేయాల్సిందిగా నిర్వాహకులకు సూచించారని, ఆ గేయాన్ని ఆపాలని చెప్పలేదని కాంగ్రెస్ స్పష్టం చేసింది. దీంతో ఈ ప్రచారానికి తెరపడింది. వందేమాతరం పూర్తి గేయాన్ని ఈ రోజు అధికారికంగా ఢిల్లీలోని ఎర్రకోటలో ప్లే చేశారు. మోదీ జాతీయ పతాకాన్ని ఎగురవేసిన తర్వాత ఆర్మీ తమ బ్యాండ్‌తో వందేమాతరం గేయాన్ని ఆలపించింది. ఈ గేయానికి జాతీయ గీతం తరహా హోదా దక్కిన తర్వాత తొలిసారి దేశమంతటా పూర్తి వందేమాతరాన్ని భారతీయులు ఆలపించారు.

# పిఎం ఫొటో కోసం కాదు విభజన హామీలకై ఉద్యమం చేయండి

## కొత్త స్మార్ట్ రేషన్‌కార్డులు, కొత్త పెన్షన్ల పంపిణీపై పిసిసి చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ హర్షం

**హైదరాబాద్, ఆగస్టు 15,ప్రభాతవార్త:** స్మార్ట్ రేషన్‌కార్డుపై ప్రధానమంత్రి ఫోటో కోసం ఉద్యమం చేస్తామనడం బిజెపి నాయకుల విద్వేష రాజకీయాలకు నిదర్శనమని విభజన చట్టంలో తెలంగాణకు ఇచ్చిన హామీల కోసం ఉద్యమం చేస్తే మీకు ప్రజల్లో మంచి పేరు వస్తోందని టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్ ఒక ప్రకటనలో అన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కంటే రాజకీయ ప్రచారానికి బిజెపి ప్రాధాన్యత ఇస్తోందని ఆరోపించారు. బిజెపి ప్రజా ప్రయోజనం లేని అంశాలను పక్కనబెట్టాలని హితవు చెప్పారు. దేశాన్ని పదవులను ఎలా గౌరవించాలో కాంగ్రెస్‌పార్టీకి తెలుసని మాకు ఎవరు సర్టిఫికెట్ ఇవ్వాల్సిన అవసరంలేదని తెలిపారు. తెలంగాణ ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న కొత్త స్మార్ట్ రేషన్ కార్డులు, కొత్త సామాజిక భద్రతా పెన్షన్లపై టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ హర్షం వ్యక్తం చేశారు.పేదలు, నిరుపేదలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు తదితర అర్హులైన వర్గాలకు సంక్షేమ పథకాల ప్రయోజనాలను మరింత పారదర్శకంగా అందించాలనే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఆయన పేర్కొన్నారు.ఆగస్టు 15 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 1.05 కోట్ల కొత్త రేషన్ కార్డుల పంపిణీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు.119 అసెంబ్లీ నియోజక వర్గాల్లో ఏకకాలంలో పంపిణీ చేపట్టడం ద్వారా అర్హులైన కుటుంబాలకు ఆహార భద్రత మరింత బలోపేతం అవుతుందని తెలిపారు.కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల్లో ఆధునిక సాంకేతికతను వినియోగించడం వల్ల ప్రజా పంపిణీ వ్యవస్థలో పారదర్శకత పెరుగుతుందని, అక్రమాలకు అడ్డుకట్ట పడుతుందని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. క్యూఆర్ కోడ్‌తో కూడిన స్మార్ట్ కార్డులు ప్రజలకు దీర్ఘకాలికంగా ఉపయోగపడేలా రూపొందించడం మంచి నిర్ణయమని పేర్కొన్నారు. అదేవిధంగా అర్హులైన కొత్త లబ్ధిదారులకు సామాజిక భద్రతా పెన్షన్లు అందించడం పేద వర్గాల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని ఆయన అన్నారు."పేదల సంక్షేమం కాంగ్రెస్ ప్రభుత్వానికి రాజకీయ నినాదం కాదు.. అది ప్రజా ప్రభుత్వ బాధ్యత" అని స్పష్టం చేశారు.గత ప్రభుత్వ హయాంలో పెండింగ్‌లో ఉన్న అనేక సంక్షేమ సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ, అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.రేషన్ కార్డులు, పెన్షన్లు మాత్రమే కాకుండా ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని దశలవారీగా అమలు చేస్తూ తెలంగాణలో 'ఇందిరమ్మ రాజ్యం – ప్రజా సంక్షేమ పాలనను బలోపేతం చేస్తున్నామని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. పేదల ముఖాల్లో చిరునవ్వు తీసుకురావడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, అర్హత ఉన్న ఒక్క కుటుంబం కూడా సంక్షేమ పథకాల నుంచి దూరం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. 'స్వాతంత్ర్య దినోత్సవం రోజున లక్షలాది పేద కుటుంబాలకు స్మార్ట్ రేషన్ కార్డులు, కొత్త లబ్ధిదారులకు పెన్షన్లు అందించడం ప్రజా ప్రభుత్వ సంక్షేమ పాలనకు నిదర్శనం. ఇది తెలంగాణ ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ కానుక.' అని టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

# 25 మంది పోలీసు, విశ్రాంత పోలీసులకు పతకాలు ప్రదానం



**హైదరాబాద్, ఆగస్టు 15, ప్రభాతవార్త:** గోల్కొండ కోటలో శనివారం జరిగిన స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి 25 మ ంది పోలీసు, విశ్రాంత పోలీసు అధికారులకు గతంలో కేంద్రంతో పాటు రాష్ట్ర సర్కారు ప్రకటించిన మెరిటోరియస్ సహా ఇతర పతకాలను ప్ర ధానం చేశారు. 2024 పంద్రాగస్టు సందర్భంగా కేంద్రం ప్రకటించిన మెరిటోరియస్ పతకాలను ఎసిబి డైరక్టర్ అవినాష్ మొహంతి, ఈగల్ అ దనపు ఎస్పి కృష్ణమూర్తి, టిఎస్ఎస్‌పి మూడవ బెటాలియన్ కమాండంట్ సయ్యద్ జమీల్ బాష, ఐటి విభాగం ఇన్‌స్పెక్టర్ జ్ఞాన సుందరి, వి శ్రాంత ఎస్ఐ ఇక్రం ఎబి ఖాన్, విశ్రాంత ఏఎస్ఐ గుంటి వెంకటేశ్వర్లు, లక్ష్మయ్యలు అందుకోగా మరణించిన ఏఆర్ఎస్ఐ అబ్దుల్ రఫీక్ తరపున ఆయన సతీమణి సిఎం చేతుల మీదుగా పతకాలను అందుకున్నారు. వీరితో పాటు విశ్రాంత ఏఆర్ఎస్ఐలు శ్రీనివాస మిశ్రా, కె. రాము, కె. బా లకృష్ణయ్యలకు మెరిటోరియస్ పతకాలను సిఎం ప్రధానం చేశారు. కాగా 2025 గణతంత్ర దినోత్స వం సందర్భంగా కేంద్రం ప్రకటించిన మెరి టోరియస్ పతకాలు పొందిన నిఘా విభాగం ఐజి కార్తికేయ, డిజిపి కార్యాలయంలో ఎస్పిగా వున్న రాంకుమార్, విశ్రాంత అదనపు ఎస్పి ఫ జ్రుల్ రహమాన్, సైబరాబాద్ సిసిఎస్ డిసిపి అన్నల ముత్యం రెడ్డి, ఐఎస్‌డబ్ల్యు డిఎస్పి రమణ, నగర సాయుధ బలగం ఎసిపి వేణుగోపా ల్, కరీంనగర్ రూరల్ ఇన్‌స్పెక్టర్ అనుముల నిరంజన్ రెడ్డి, విశ్రాంత ఏఎస్ఐ రన్‌వీర్ సింగ్ ఠాకూర్, విశ్రాంత ఏఆర్ఎస్ఐ పీటర్ జోసెఫ్ బహదూర్, సిఐ సెల్ ఏఆర్ఎస్ఐ మహమ్మద్ మొయినుల్లా ఖాన్, విశ్రాంత హెడ్ కానిస్టేబుళ్లు పత్య నాయక్, అయూబ్ ఖాన్‌లు అందుకున్నారు. కాగా ఈ ఏడాది రాష్ట్రావతరణ రోజున రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన సిఎం శౌర్య పతకం దక్కిన ట్రాన్స్‌కో చీఫ్ విజిలెన్స్ అదనపు ఎస్పి ప్రతా ప్ అందుకున్నారు.

# ఇక్కడ పులి, ఢిల్లీలో పిల్లి

## అరవింద్‌పై బల్మూరి వెంకట్ విమర్శలు

**హైదరాబాద్, ఆగస్టు 15,ప్రభాతవార్త:** ఇక్కడ పులి ఢిల్లీలో పిల్లి అంటూ నిజామాబాద్ ఎంపి ధర్మపురి అరవింద్‌పై ఎక్స్ వేదికపై ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ విమర్శలు చేశారు. "బాబు గుండు కేంద్రం నుంచి మనకు వచ్చుది నీ నెత్తిమీద ఉన్న గుండు సున్నా" అంటూ తెలంగాణకు వస్తున్న నిధులపై ట్వీట్ చేశారు. దేశ జిడిపిలో తెలంగాణ రాష్ట్రం నుంచి ఐదుశాతం మేరకు వాటా ఉందని ఈ లెక్కన ఎవరి ఫోటోలు ఎవరు వేసుకోవాలని ఆయన ప్రశ్నించారు. కేంద్రం ఇచ్చేది మీ సొత్తేమి కాదు అది తెలంగాణ చెమచుక్కలు సృష్టించిన సంపద మా హక్క అని ట్వీట్ చేశారు, ఎంపి అరవింద్ చెప్పినట్లు కేంద్రం తెలంగాణకు వేసేది బిక్షమైతే అలాంటి అరకొర నిధులు రావడానికి నీలాంటి చేతకాని చవటలను ఎంపిగా ఎన్నుకోవడమే కారణం అని ఆగ్రహం వ్యక్తం చేశారు.



# అయోధ్య రామమందిరంలో పూజారులకు కొత్త డ్రెస్‌కోడ్

**అయోధ్య, ఆగస్టు 15:** అయోధ్యలోని రామమందిర ప్రధాన ఆలయంలో పూజారులకు శనివారం నుంచి కొత్త డ్రెస్ కోడ్ అమల్లోకి వచ్చింది. ఇకపై ఆలయంలో సేవలందించే పూజారులంతా ఒకే విధమైన సంప్రదాయ దుస్తులను ధరించనున్నారు.ఆలయ ట్రస్ట్ మతపరమైన కమిటీ సభ్యురాలు మిథిలేష్ నందిని శరణ్ మాట్లాడుతూ.. రామానంది సంప్రదాయానికి అనుగుణంగా పూజారుల వస్త్రధారణను నిర్ణయించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా పూజారులు లేత పసుపు రంగు పట్టు ధోతీలు, అదే రంగు పట్టు ఉత్తరీయాలు ధరించాల్సి ఉంటుందని చెప్పారు.లేత పసుపు రంగు శ్రీరాముడికి ప్రీతిపాత్రమైనదిగా భావిస్తారని, అందుకే ఈ రంగును ఎంపిక చేసినట్లు ఆమె వివరించారు. కొత్త డ్రెస్ కోడ్‌లో పూజారుల వెంట్రుకలు, గడ్డం విషయంలోనూ నిబంధనలు విధించారు. పూజారులు పంచకేశ సంప్రదాయాన్ని పాటించాలి లేదా పూర్తిగా గుండు చేయించుకోవాలి. మధ్యస్థంగా పెరిగిన జుట్టు లేదా గడ్డంతో ఉండటానికి అనుమతి ఉండదు. సాంప్రదాయ రామానంది తిలకం ధరించడం తప్పనిసరి చేశారు.మతపరమైన కమిటీ సభ్యుడు మహంత్ రాజ్‌కుమార్ దాస్ మాట్లాడుతూ పట్టు వస్త్రాలకు ఉన్న పవిత్రత, స్వచ్ఛతను దృష్టిలో ఉంచుకుని వాటిని ఎంపిక చేసినట్లు తెలిపారు. పూజారులందరికీ ఒకే విధమైన సంప్రదాయ వస్త్రధారణ ఉండటం వల్ల ఆలయంలో క్రమశిక్షణ, ఏకరూపత, ఆధ్యాత్మిక గౌరవం మరింత పెరుగుతాయని కమిటీ పేర్కొంది. రామలల్లాకు నిర్వహించే పూజలు, సేవల్లో ఇది మరింత భక్తి భావాన్ని ప్రతిబింబిస్తుందని తెలిపింది. స్వాతంత్ర్యదినోత్సవం నుంచే ఈ డ్రెస్‌కోడ్ అమలులోకి వచ్చింది.

# హోం శాఖ కొలువుల భర్తీకి వయోపరిమితి పెంపు

**హైదరాబాద్, ఆగస్టు 15, ప్రభాతవార్త:** హోం శాఖ పరిధిలోని పోలీసు, ఫైర్ సర్వీస్, జైళ్ల శాఖ, ఎస్‌పిఎఫ్, ఫోరెన్సిక్ విభాగాల్లో ఎస్ఐ, ఏ ఎస్ఐ, కానిస్టేబుల్ తత్సమాన పోస్టుల భర్తీకి ఇటీవల వెలువడ్డ నోటీఫికేషన్‌కు సంబంధించి వయో పరిమితిని రెండేళ్లు పెంచారు. ఈ మేరకు పోలీసు నియామక మండలి ఛైర్మన్ శ్రీనివాస రావు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. హోం శాఖ కొలువుల భర్తీకి సంబంధించి ఈ నె ల 19వ తేదీ నుంచి సెప్టెంబర్ తొమ్మిదవ తేదీవరకు నిరుద్యోగుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు. వివిద ప్రజా సంఘాల విజ్ఞప్తుల మేరకు యూనీఫాం సర్వీసు ఉద్యోగాల్లో వయో పరిమితిని ఇదివరకు ప్రకటించిన ఐదేళ్లకు అదనంగా మరో రెండేళ్ల పాటు పెంచుతూ సర్కారు శనివారం ఆదేశాలు జారీ చేయడం తెలిసిందే. ఈ ఆదేశాల ప్రకారం హోం శాఖ పరిధిలోని విభాగాలతోపాటు అటవీ, అబ్కారీ, రవాణా శాఖల్లో వున్న ఖాళీల భర్తీకి వయో పరిమితిని పెరిగింది.

# కాంగ్రెస్‌లో రాజగోపాలుడి వివాదాస్పద వ్యాఖ్యల కలకలం

**హైదరాబాద్, ఆగస్టు 15, ప్రభాతవార్త:** తెలంగాణ కాంగ్రెస్‌ను రాజగోపాల్‌రెడ్డి వివాదాస్పద వ్యాఖ్యలతో కలకలం సృష్టిస్తున్నారు. సీమాంధ్ర పాలకుల, సీమాంధ్ర మీడియా చెప్పుచేతుల్లో తెలంగాణలోని కాంగ్రెస్ పార్టీగానీ ప్రభుత్వం కానీ నడుస్తోందని శుక్రవారం చౌటుప్పల్‌లో వివాదస్పద వ్యాఖ్యలు చేసిన రాజ గోపాల్‌రెడ్డి తాజాగా బిఆర్ఎస్ నుంచి వలస వచ్చిన ఎమ్మెల్యేలను లక్ష్యంగా చేసుకొని శనివారం సొంత పార్టీపైన బాణం గురిపెట్టారు. బిఆర్ఎస్ నుంచి వచ్చినోళ్ళకు బుద్దిలేదు తీసుకున్నోళ్లకు బుద్దిలేదని మాజీ స్పీకర్ శ్రీనివాస్‌రెడ్డి, దానం నాగేదర్ చేరికలపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. గతంలో పోచారం శ్రీనివాస్‌రెడ్డి స్పీకర్ స్థానంలో ఉండి కాంగ్రెస్ పార్టీని నాశనం అయ్యేలా వ్యవహరించారని అలాంటి వ్యక్తిని పార్టీలో ఎలా చేర్చుకొంటారని ఆవేదన చెందారు.

కాంగ్రెస్ పార్టీ పతనానికి కెసిఆర్ నంబర్‌వన్ అయితే పోచారం శ్రీనివాసరెడ్డి నెంబర్ టూ ఆయన పార్టీలోకి రావడమేంటి ఆయనను ఎవరు తీసుకొచ్చారు. పార్టీలోచేరాక ఇప్పుడు బాధ అనిపిస్తోందని పోచారం మాట్లాడటం వింతగా ఉందని ఆయనను ఎవరు పార్టీలో ఉండమంటున్నారు వెళ్లిపోవాలనీ డిమాండ్ చేశారు. ఇక దానం నాగేందర్‌ను చూస్తే జనాల్లో రాజకీయ నాయకుల మీద ఉండే గౌరవం పోతుందని బిఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలిచి కాంగ్రెస్ పార్టీ నుంచి ఎంపిగా పోటిచేశారని మళ్లీ బిఆర్ఎస్ పార్టీలోనే ఉన్నానని అంటున్నాడని ఇదేం చిల్లరరాజకీయం అని ఒక టివి ఛానల్‌తో మాట్లాడతూ ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంగ్రెస్‌లో, ప్రభుత్వంలో మొదటి నుంచి ప నిచేసిన నాయకులు, కార్యకర్తలకు అన్యాయం జరుగుతున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. బయటి నుంచి పార్టీలోకి కొత్తగా వచ్చిన వారి ఆధిపత్యం నడుస్తున్నదని విమర్శించారు. పార్టీ బలహీనపడొద్దనే కొన్ని అంశాలను బహిరంగంగా ప్రస్తావిస్తున్నానని తేల్చి చెప్పారు.

రాష్ట్ర ప్రభుత్వం పేదల కోసం పనిచేయాలే తప్ప సీమాంధ్ర కాంట్రాక్టర్లు, పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం పనిచేయొద్దని రవీంద్ర భారతిలో ఒక కార్యక్రమానికి హాజరై డిమాండ్ చేశారు.టిపిసిసి అద్యక్షుడు మహేష్‌కుమార్ నాకు బదులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బుద్దులు చెప్పాలని ఉద్యమకారులకు కాంగ్రెస్ పార్టీ కార్యక్తలకు న్యాయం జరిగేలా చూడాలని అన్నారు. అవినీతి రహితంగా ప్రజాపాలన అందించాలని అంటున్నా ఇవన్ని నా పార్టీకి మేలు చేస్తాయేతప్ప నష్టం చేయవని ఆయన అభిప్రాయపడ్డారు. రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు పార్టీ వర్గాలు చర్చించుకొంటున్నాయి. రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలనుకాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి సమర్థిస్తూ "కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అనే వ్యక్తి ఒక అగ్నిపర్వతం" అంటూ అభివర్ణించారు. వోల్కానోలా ఆయన ధర్మాగ్రహం బయటపడిందని అన్నారు.ఆయనకు కోపమొచ్చిందంటే ఒక అగ్నిపర్వతం పేలినట్టు పేలుతది. ఆయన ఎప్పుడూ కూడా మంత్రి పదవి కావాలని కొట్లాడ లేదు.. అడగలేదు.. రెండున్నర సంవత్సరాలు అయింది.. అయి ఉంటే అప్పుడే కొట్లాడుతుండె. ఆయన ప్రజల గురించి సమస్యల మీద అడుగుతుండు. రాజగోపాల్ రెడ్డి మాట్లాడే దాంట్లో తప్పేంలేదు. నేను కూడా సమస్యల గురించి చాలాసార్లు మాట్లాడాను. సమస్య లున్నాయి.. వాటిని పరిష్కరించుకుంటే మా పార్టీకే మంచి పేరొస్తది కదా..కాంగ్రెస్ పార్టీకి మంచి పేరు రావాలని మాట్లాడిండు అన్నారు.

# మారుపేర్లతో ఒకే వ్యక్తికి బహుళ పాస్‌పోర్టులు

## యుఎస్ కాన్సులేట్ అధికారుల ఫిర్యాదుతో అరెస్టు

**హైదరాబాద్ (గచ్చిబౌలి), ఆగస్టు 15, ప్రభాతవార్త:** నకిలీ డాక్యుమెంట్లను ఉపయోగించి, మారుపేర్లతో ఒకే వ్యక్తి బహుళ భారతీయ పాస్ పోర్టులను తీసుకున్నాడు. వాటి ద్వారా విదేశీ ప్రయాణాలు సైతం చేశాడు. అమెరికా విసా దరఖాస్తుల సమయంలో ఒకే వ్యక్తి వేరువేరు పాస్‌పోర్టులను ఉపయోగించడంతో యుఎస్ కాన్సులేట్ అధికారులు గచ్చిబౌలి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం.. కోకా పేటలో నివాసం ఉంటున్న మోతుకుపల్లి లక్ష్మికాంత్‌రెడ్డి(55) అనే వ్యక్తి వేరువేరు భారతీయ పాస్‌పోర్టులను కలిగి ఉన్నాడని యుఎస్ కాన్సులేట్ అధికారులు గత మార్చి 22వ తేదీన గచ్చిబౌలి పోలీసులకు పిర్యాదు చేశారు. లక్ష్మికాంత్‌రెడ్డి వేరువేరు పేర్లు, పుట్టినతేదీ, గుర్తింపు వివరాలతో వేరువేరు భారతీయ పాస్‌పోర్టులను తీసుకోవడంతో పాటు వాటిని అమెరికా విసా దరఖాస్తు కోసం ఉపయోగించినట్లు యుఎస్ కాన్సులేట్ అధికారులు గుర్తించారు. యుఎస్ కాన్సులేట్ అధికారుల పిర్యాదు ఆధారంగా గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో మోతు కుపల్లి లక్ష్మికాంత్‌రెడ్డి అనే వ్యక్తి 1997లో నాంపల్లిలో ఉన్న సమయంలో తాను ఉంటున్న అడ్రస్‌తో చదువు రాదని చెప్పి మేధ ప్రసూన్‌కుమార్ రెడ్డి పేరుతో ఓ పాస్‌పోర్టు తీసుకున్నాడు. 2007లో ఇదే పాస్‌పోర్టు రెన్యూవల్ చేసుకున్నాడు. 2017లో తన అసలు పేరుతో మోతుకుపల్లి లక్ష్మికాంతరెడ్డి అనే పేరుతో ఓ పాస్‌పోర్టు తీసుకొని కొన్ని రోజులు సదరు పాస్‌పోర్టు మీద అమెరికాకు సైతం వెళ్లి వచ్చాడు. వీటితో పాటు ఇదే వ్యక్తి నకిలీ రెసిడెన్షియల్ సర్టిఫికేట్లు, డేట్ ఆఫ్ భర్త్ సర్టిఫికేట్లు పెట్టి ముద్దనోళ్ల లక్ష్మికాంత్ పేరుతో మరో పాస్‌పోర్టు సైతం తీసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈమేరకు సికింద్రాబాద్ రీజనల్ పాస్‌పోర్టు కార్యాలయం నుంచి సదరు పాస్‌పోర్టు దర ఖాస్తు పత్రాలను పోలీసులు సేకరించారు. వాటి ద్వారా నకిలీ రెసిడెన్స్ సర్టిఫికేట్లు, జనన ధ్రువీకరణ పత్రాలతో లక్ష్మికాంత్‌రెడ్డి ఈ పాస్‌పోర్టులను పొంది నట్లు గుర్తించారు. ఈమేరకు నిందితుడు లక్ష్మికాంత్‌రెడ్డిని శుక్రవారం అరెస్టు చేసి అతని వద్ద నుంచి పాస్‌పోర్టు పత్రాలు, సెల్‌ఫోన్, ఐప్యాడ్‌లను స్వాధీనం చేసుకున్నారు. దీంతోపాటు నిందితుడి బయోమెట్రిక్ వివరాలు, సదరు పాస్ పోర్టులతో చేసిన అంతర్జాతీయ ప్రయాణవివరాలు, డిజిటల్ కమ్యూనికేషన్లు, పాస్‌పోర్టులు పొందడంలో సహాయపడిన బ్రోకర్లపాత్రపై విచారిస్తున్నారు. ఈ మేరకు నిందితుడిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు.



లక్ష్మీకాంత్‌రెడ్డి (ఫైల్)

# భూములపై రుణం పేరిట రూ.10 కోట్ల టోకరా

## సిసిఎస్‌కు చిక్కిన ఘరానా మోసగాడు యుగంధర్

**హైదరాబాద్, ఆగస్టు 15, ప్రభాతవార్త:** భూములపై బ్యాంకులు, ప్రైవేటు ఆర్థిక సంస్థల నుంచి తక్కువ వడ్డీకి రుణాలు ఇప్పిస్తానని నమ్మించి అమాయకులను రూ.10 కోట్లకు పైగా మోసం చేసిన ఘరానా చీటర్ సునావత్ యుగంధ ర్‌ను సిసిఎస్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఇతని వద్ద నుంచి పలువురి భూములకు సంబంధించిన పత్రాలను జప్తు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను సిసిఎస్ డిసిపి చైతన్య కుమార్ ఆదివారం మీడియాకు వెల్లడించారు. కొండా పూర్‌కు చెందిన సునావత్ యుగం ధర్ (34) ఓ చీటర్. అమాయకులను ఒక పథ కం ప్రకారం భూముల పేరిట రుణాలు ఇప్పిస్తానని నమ్మించి వారిని నిండా ముంచుతు న్నాడు. 2016 నుంచి ఇతను ఈ మోసాలు చేస్తున్నా డు. తెలంగాణతో పాటు ఎపిలో ఇతనిపై 20కిపైగా కేసులున్నాయి. తాజాగా హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తికి చెందిన భూమిపై రుణం ఇప్పించే నెపంతో బాధితుడికి 60 లక్షల రూపాయల సహాయం చేశాడు. అనంతరం అతని భూమికి సంబం ధించిన పత్రాల సేల్ డీడ్‌ను తన పేరి ట రాయించుకున్నాడు. దీని తరువాత బాధితుడి భూ పత్రాలను అతనికి తెలియకుండా ఓ బ్యాంకు లో తనఖాపెట్టి కోటీ 50 రూపా యల రుణం తీసుకున్నాడు. అనంతరం సదరు బ్యాంకుకు యుగంధర్ రుణం తాలూకు కిస్తులు చెల్లించక పోవడంతో బ్యాంకు అధికారులు భూ యజమానిగా వున్న బాధితుడి వద్దకు రాగా గోల్‌మాల్ బండారం రట్టయ్యింది. ఈ కేసులో బాధితుడి ఫిర్యాదు మేరకు యుగంధర్‌పై సిసిఎస్ పోలీసులు చీ టింగ్ కేసు నమోదు చేసి విచారణ చేబట్టగా సంచలన విషయాలు వెలుగు చూశాయి. యుగంధర్ ఇటువంటి మోసాలు పదేళ్ల నుంచి చేస్తున్న ట్లు తేలింది. ఇప్పటి వరకు 30 మందిని పది కోట్ల రూపాయలకు పైగా నిందితుడు మోసం చేసినట్లు తేలింది. ఇందుకు సంబంధించి ఇతనిపై 12 క్రిమినల్ కేసులు, ఎనిమిది సివిల్, ఎన్ఐ కేసులు వున్నాయి. తాజా కేసులో నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచి రిమాండుకు తరలించారు. ఈ తరహా మోసాల పట్ల అందరు జాగ్రత్తగా వుండాలని డిసిపి చైతన్యకుమార్ కోరారు.



సునావత్ యుగంధర్

# నాణ్యమైన, నిరంతర విద్యుత్ లక్ష్యం

## దక్షిణ తెలంగాణ విద్యుత్ సంస్థ సిఎండి పాటిల్

**హైదరాబాద్, ఆగస్టు 15, ప్రభాతవార:** తమ సంస్థ పరిధిఓని వినియోగదారులకు విశ్వసనీయమైన, నాణ్యమైన మరియు నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించడమే ప్రధాన లక్ష్యమని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సిఎండి జితేష్ పాటిల్ తెలిపారు. హైదరాబాద్‌లోని విద్యుత్ పంపిణీ సంస్థ కార్యాలయంలో శనివారం 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాటిల్ మాట్లాడుతూ, దేశ స్వాతంత్రం కోసం ప్రాణత్యాగాలు చేసిన మహనీయులు, స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకోవడం ప్రతి భారతీయుడి బాధ్యత అన్నారు. నాణ్యమైన విద్యుత్ సేవలను అందించడంలో తమ సంస్థ ఉద్యోగులు అంకితభావం, కృషితో పనిచేస్తున్నారని కితాబునిచ్చారు. సంస్థకు మరింత గుర్తింపు, మంచి పేరు తీసుకురావడానికి నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు నర్సిం హులు, చక్రపాణి, డైరెక్టర్ శివాజీ, డైరెక్టర్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కర్ణాటక హోలెమురదట్టి అటవీ ప్రాంతంలో ఎన్‌కౌంటర్

## ముగ్గురు వన్యప్రాణుల వేటగాళ్ల హాతం

**హైదరాబాద్, ఆగస్టు 15, ప్రభాతవార్త:** కర్ణాటక రాష్ట్రంలోని చామరాజనగర్ జిల్లా హోలెమురదట్టి అటవీ ప్రాంతంలో శనివారం తెల్లవారుజా మున జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు వన్యప్రాణుల వేటగాళ్లు హతమయ్యారు. పలు రకాల వన్యప్రాణులకు పేరొందిన ఈ ప్రాంతం కావేరి వైల్డ్‌లైఫ్ శాంక్చ్యురీ పరిధిలో వుంది. వన్యప్రాణులతో పాటు జింకలు, దుప్పులను వేటాడి వాటి మాంసాన్ని బహిరంగ మార్కెట్లో కొందరు స్మగ్లర్లు అమ్ముతున్నట్లు అందిన సమాచారంపై అటవీ శాఖ సిబ్బంది శుక్రవారం అర్ధరాత్రి నుంచి హోలెమురదట్టి అటవీ ప్రాంతంలో గాలింపు చేబట్టారు. అటవీ శాఖ అధికారులు ముందు జాగ్రత్త చర్యగా ఆయుధాలు ధరించి గాలింపు చేబట్టారు. తెల్లవారుజామున ఐదు గంటల సమయంలో జింక మాంసాన్ని టార్చిలైట్ వెలుతురులో వేటగాళ్లు సంచిలో వేసుకుంటున్న తరుణంలో వీరికి అటవీ శాఖ అధికారులు తారసపడ్డారు. అటవీ శాఖ అధికారులు కనబడగానే వేటగాళ్లు తమ వద్ద వున్న నాటు తుపాకులతో పలు రౌండ్లు కాల్పులు జరిపారు. ఆత్మరక్షణ కోసం అటవీ శాఖ అ ధికారులు ఎదురు కాల్పులు జరపగా ముగ్గురు వేటగాళ్లు మరణించారు. కొద్దిసేపు తరువాత ఆ ప్రాంతంలో గాలించగా ముగ్గురు వేటగాళ్ల మృతదేహాలు లభించాయి. మరణించిన వారిని హనురు తాలూక తొమియార్‌పల్యకు చెందిన అంటోని స్వామి, జాన్ పీటర్, కుమార్ ఊరఫ్ సవరి యప్పన్‌గా గుర్తించారు. ఘటనా స్థలంలో రెండు నాటు తుపాకులతో పాటు జింక మాంసం లభ్యమవగా వీటిని జప్తు చేశారు. కాగా ఈ ఘటనపై కర్నాటక ముఖ్యమంత్రి డికె శివకుమార్ మెజిస్ట్రీరియల్ విచారణకు ఆదేశించారు. కాగా ఈ ఘటన ఎన్‌కౌంటర్‌లో మరణించి వేటగాళ్ల సొం త ఊరిలో ఉద్రిక్తతలకు తావచ్చింది. చనిపోయిన వేటగాళ్ల మృతదేహాలకు మైసూరులోని కె.ఆర్ ఆసుపత్రిలో పోలీసులు పోస్టుమార్టం నిర్వహి ంచి వారి కుటుంబీకులకు అప్పగించారు. ఈ సందర్భంగా మార్చ్యురీ వద్ద, వారి సొంత ఊరిలో పోలీసులతో మృతుల కుటుంబీకులు గొడవకు దిగారు. ఈ ప్రాంతంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా భారీగా పోలీసులను మొహరించారు.

# రూ.2 వేల కోట్లు రుణానికి ఇండెంట్

## 18న సేకరించనున్న సర్కార్

**హైదరాబాద్, ఆగస్టు 15, ప్రభాతవార్త:** రాష్ట్ర ఆర్థిక అవసరాలు, సంక్షేమ పథకాల అమలు నిమిత్తం తెలంగాణ ప్రభుత్వం బహిరంగ మార్కెట్ నుంచి మరో రూ.2 వేల కోట్ల రుణం సమీకరించాలని నిర్ణయించింది. అందుకోసం రిజర్వు బ్యాంకును ఆశ్రయించింది. ఇందుకుగాను ఈ నెల 18న ప్రభుత్వ సెక్యూరిటీ బాండ్లను బహిరంగ మార్కెట్లో ఈ వేలం ద్వారా ఈ అప్పు తీసుకుంటామని రాష్ట్ర ఆర్థిక శాఖ రిజర్వ్ బ్యాంక్‌కు ఇండెంట్ పెట్టింది ఈ రూ.2 వేల కోట్లలో రూ.1,000 కోట్లు 11 ఏండ్ల కాల పరిమితితోను, మరో రూ.1,000 కోట్లు 29 ఏండ్ల కాల పరిమితితో సమీకరించనున్నట్టు తెలిపింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుత 2026-27 ఆర్థిక సంవత్సరంలో ఆర్బీఐ నుంచి రూ.36,900 కోట్ల రుణాలు తెచ్చినట్లవుతుంది. ఈ మొత్తంలో ఏప్రిల్ 7న రూ.3,900 కోట్లు, 21న రూ.3 వేల కోట్లు, మే 5న 4 వేల కోట్లు, 19న రూ.2 వేల కోట్లు, జూన్ 2న రూ.4 వేల కోట్లు, 16న రూ.2 వేల కోట్లు, జూలై 1న రూ.7 వేల కోట్లు, 7న రూ.3 వేల కోట్లు, 14న రూ.2,500 కోట్లు, 28న రూ.వెయ్యి కోట్లు, ఈ నెల 4న రూ.2,500 కోట్లు తీసుకోగా, 18న రూ.2 వేల కోట్లు సమీకరించనుంది. ఇది రాష్ట్ర వార్షిక రుణ పరిమితిలో రూ.80 వేల కోట్లలో 44 శాతానికి సమానం.

# రైతు కమిషన్ కార్యాలయంలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవం

**హైదరాబాద్, ఆగస్టు 15, ప్రభాతవార్త:** తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ కార్యాలయంలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరిగాయి. 80వ స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా హైదరా బాద్‌లోని బీఆర్కే భవన్‌లోని కమిషన్ కార్యాలయంలో శనివారం రైతు కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కోదండరెడ్డి మాట్లాడుతూ దేశానికి స్వాతంత్రం తీసుకురావడంలో ఎంతోమంది మహనీయులు తమ ప్రాణాలను త్యాగం చేశారన్నారు. వారి పోరాటాలు, త్యాగాల ఫలితంగానే నేడు భారతదేశం స్వాతంత్ర్యాన్ని అనుభవిస్తోందని పేర్కొన్నారు. స్వాతంత్రం ఒక్కరోజులో లభించినది కాదని, ఎందరో స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు, పోరాటాల ఫలితమేనని గుర్తుచేశారు. దేశ స్వాతంత్రం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయులను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని పిలుపునిచ్చారు.

# విద్యుత్‌లో విలువ ఆధారిత సేవల విస్తరణ

## 19,000 మెగావాట్ల డిమాండ్‌కు సిద్ధం

## ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ సిఎండి కృష్ణభాస్కర్

**హైదరాబాద్, ఆగస్టు 15, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని విద్యుత్ వినియోగదారులకు విలువ ఆధారిత సేవలను విస్తరించడానికి పునరంకితమవుతున్నట్లు ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ ఆఫ్ తెలంగాణ సిఎండి డి కృష్ణభాస్కర్ వెల్లడించారు. 19000 మెగావాట్ల డిమాండ్‌ను తీర్చడానికి విద్యుత్ సంస్థలు పూర్తిగా సన్నద్ధమయినట్లు తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ విద్యుత్ సౌధలో కృష్ణ భాస్కర్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ 2025-26 ఆర్థిక సంవత్సరంలో కేవలం 2.20 శాతం మేర ప్రసార నష్టాలతో, దక్షి ణ రాష్ట్రాలలో అత్యల్ప ప్రసార నష్టాలకు గాను ట్రాన్స్‌కో ప్రతిష్టాత్మక పవర్‌లైన్ అవార్డును గెలుచుకుందని తెలిపారు. రాష్ట్రంలోని దాదాపు 1.97 కోట్ల మంది వినియోగదారులకు వారంలో రోజూ 24 గంటల నాణ్యమైన, నమ్మకమైన విద్యుత్‌ను అందించడంలో కట్టుబడి ఉన్నట్లు పునరుద్ఘాటిం చారు. ఇందులో భాగంగా 30.47 లక్షలకు పైగా వ్యవసాయ విని యోగదారులకు నిరంతర ఉచిత విద్యుత్ సరఫరాను అందిస్తామని వివరించారు. యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (వైటీపీఎస్) ప్రాజెక్ట్ యొక్క మొత్తం 4000 మెగావాట్ల (5+800 మెగావాట్ల యూనిట్లు) సామర్థ్యంలో, (4 యూనిట్ల నుండి మొత్తం 3200 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతోందన్నారు. విద్యుత్‌రంగంలో తెలంగాణను స్వయం సమృద్ధి దిశగా నడి పించేందుకు, చివరిదైన ఐదవ యూనిట్‌ను అక్టోబరులో ప్రారంభిం చనున్నట్లు వెల్లడించారు. అలాగే 2025-26లో ఒప్పందం కుదుర్చుకున్న రాష్ట్ర విద్యుత్ సామర్థ్యాన్ని 24482 మెగావాట్లకు పెంచుతూ, గ్రిడ్ యొక్క అత్యున్నత స్థితిస్థాపకతను మెరుగుపరచినట్లు పేర్కొన్నారు.

పశ్చిమాసియాలో అశాంతి దేశంలోని మధ్య, దారిద్ర్యరేఖ దిగువన ఉన్న అందిరిపై ప్రభావం చూపుతోంది. గ్యాస్, పెట్రోల్ ధరలు పెరగడంతో ఉప్పుతోపాటు అన్నినిత్య వసరాల ధరలు పెరిగాయి. ఇరాన్‌పైఅమెరికా దాడి చేయడంతోనే ధరలు పెరుగుతూ ఉన్నాయి. గత సంవత్సరంకంటే 113శాతం అన్నింటి ధరలు పెరిగాయి. ఏం కొనేట్టులేని పరిస్థితి ఉంది. ఇలాంటి పరిస్థితిలో నిత్యవసరాలు కూడా పంపిణీ చేయాలని డిమాండ్ ప్రజల నుంచి వస్తోంది. తెలంగాణ ప్రభుత్వం నిత్యావసరాలు పంపిణీ చేయాల్సిన ఆవశ్యకత గుర్తించాలి. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ నెల15నుండి రాష్ట్రంలోని కోటి 5 లక్షల కుటుంబాలకు స్మార్ట్ రేషన్ కార్డులు అందజేస్తామని ప్రకటించిన నేపథ్యంలోస్మార్ట్ రేషన్ కార్డులతోపాటు 14 రకాల నిత్యవసర సరుకులను పంపిణీ చేయాలని ముఖ్యమంత్రికి లేఖరాసి సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ప్రజల తరుపున డిమాండ్ చేశారు. ప్రస్తుతం కార్డుపై ఒక వ్యక్తికి 6కిలోల బియ్యం మాత్రమే అందుతున్నాయి. పెరిగిన ధరలకు అనుగుణంగా పేదకుటుంబాల ఆదాయాలు పెరగకపోవడంతో, వారు పౌష్టికాహారానికి దూరమవుతున్నారు. తద్వారా రక్తహీనత, పిల్లల అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. పేదలకు పౌష్టికాహారం అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపైఉన్నది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తక్షణమే రేషన్ కార్డుదారులకు న్యూట్రీషియన్లతో సంప్రదించి, బియ్యంతో పాటు కందిపప్పు, శనగపప్పు, పెసరపప్పు, మంచినూనె, గోధుమలు/గోధుమ పిండి, కోడిగుడ్లు, మిల్లెట్స్, చక్కెర, చింతపండు, పసుపు, కారం పొడి, ఉప్పు, కొబ్బరినూనె వంటి నిత్యావసర సరుకులైన 14రకాల వస్తువులను రేషన్‌కార్డు ద్వారా పంపిణీ చేయాలి. దారిద్ర్యరేఖకు దిగువనఉన్నవారికికే కాకుండా దిగువ, ఎగువమధ్య తరగతి ప్రజలకు కూడా ఉప్పు, చింతపండు, జీలకర్ర, మెంతులు, కందిపప్పు, తదితర పల్లీలు వంటివి సరఫరా చేయాల్సిన అవసరంఉంది.

# స్మార్ట్‌గా సివిల్ సప్లయ్ ఆధునీకరణ

**భాగ్యనగర్ భాస్కర్‌కుమార్**

'అదిరిందయ్యా ఉత్తమ్! స్మార్ట్ రేషన్ కార్డులు, స్మార్ట్ సప్లయ్ చైన్ మేనేజ్‌మెంట్లు, మిషన్ కె 100 ధాన్యం సేకరణ కార్యాచరణ. సిలోస్‌లు, సిఎంఆర్ ధాన్యం అక్రమార్కులపై మెరుపు దాడులు' అన్నట్లు పౌరసరఫరాలశాఖ ఆధునీకరణలతో ఓవైపు ఆహారభద్రతకు పెద్దపీట వేస్తూ మరోవైపు కస్టమ్ మిల్లింగ్ ధాన్యం పక్కదారి పట్టించే రైసుమిల్లర్లపై మెరుపుదాడులు చేస్తూ తెలంగాణ ప్రజల ఆదరాభిమానం చూరగొంటున్నది. తెలంగాణలో ఆహార భద్రతకు శనివారం సంగారెడ్డిలో లాంఛనంగా స్మార్ట్ రూపం ఇచ్చింది. స్వాతంత్ర్యదినోత్సవ కానుకగా రాష్ట్రవ్యాప్తంగా 3.43కోట్ల మంది లబ్ధిదారులకు సంబంధించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. స్మార్ట్‌కార్డులపై బిజెపి నేతలు ఆగ్రహం వ్యక్తంచేశారు. రేషన్ బియ్యం పంపిణీలో కేంద్రం నిధులు సింహభాగంలో ఉంటాయనీ ఎవని అయ్య జాగీరు రేవంత్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఫోటోలు మాత్రమే వేసుకొన్నారని నిజామాబాద్ ఎంపి ధర్మపురి అరవింద్ ప్రశ్నించారు. మెదక్ ఎంపి రఘునందన్‌రావు తక్షణమే కార్డుల పంపిణీ నిలిపేయాలని అసంతృప్తిని వ్యక్తం చేశారు. స్మార్ట్ కార్డుపై కేవలం ఇద్దరిఫోటోలు మాత్రమే ముద్రించడం ఇంటా బయట విమర్శలు వస్తున్నా రాష్ట్రంలోని 33జిల్లా కేంద్రాల్లో ఏకకాలంలో పంపిణీ కార్యక్రమం చేపట్టాలని పౌర సరఫరాల శాఖమంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి సూచనలమేరకు అన్ని జిల్లాలో మొదలైంది. రాష్ట్రంలో ప్రస్తుతం1,06,28,092 ఆహార భద్రత కార్డుల ద్వారా 3.43కోట్ల మంది లబ్ధిదారులు ఆహార భద్రత పరిధిలో ఉన్నారు. వీరిందరికి రానున్న పది రోజుల్లో స్మార్ట్ రేషన్‌కార్డులు అందిస్తారు. కొత్త స్మార్ట్ రేషన్ కార్డులకు నకిలీలను రూపొందించకుండా నివారించేలాతొమ్మిది రకాల ఆధునిక భద్రతా ఫీచర్లతో తయారు చేశారు. బ్యాంకు నోట్లు, పాస్పోర్టులు వంటి అత్యంత భద్రత కలిగిన పత్రాల్లో ఉపయోగించే టెక్నాలజీని వినియోగించారు. పైన ఎడమవైపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కుడివైపు పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చిత్రాలను ముద్రించారు. రేషన్ కార్డు నంబరు, కుటుంబ యజమాని పేరు, చౌకధరల దుకాణం సంఖ్యతో పాటు గ్రామం, మండలం, జిల్లా లబ్ధిదారుని ఇంటి చిరునామా వివరాలున్నాయి. కుటుంబ యజమానిగా మహిళల పేర్లనే ముద్రించారు. సాంకేతికమైన పలు భద్రతా ఫీచర్లు జోడించడంతో ఈ కార్డును స్కాన్ చేయగానే లబ్ధిదారుల వివరాలు నిర్ధారణ అవుతాయి. ఈకార్డు ఉన్న ప్రతి అర్హుడైన లబ్ధిదారుడికి నెలకు ఆరుకిలోల సన్నబియ్యాన్ని ఉచితంగా ప్రభుత్వం అందిస్తోందన్నారు. స్మార్ట్ రేషన్ కార్డుల




ప్రవేశంతో ప్రజాపంపిణీ వ్యవస్థలో పారదర్శకత, సామర్థ్యం, లబ్ధిదారుల సౌలభ్యం మరింత పెరుగుతాయని భావిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తరువాత రేషన్ కార్డుల జారీ చేసే విషయంలో ఆనాటి బిఆర్ఎస్ పాలకులు ఉదాసీనంగా వ్యవహరిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన లబ్ధిదారులకు అందరికి రేషన్‌కార్డులు ఇవ్వాలని నిర్ణయం తీసుకొంది. దీనితో గత ఏడాదిన్నర కాలంలో కాంగ్రెస్ పాలకులు పాతవాటికి తోడు 16,32,810 కొత్త ఆహార భద్రత కార్డులను జారీ చేసి ఆ కుటుంబాలకు చెందిన 61,08,544 మంది లబ్ధిదారులకు ఆహార భద్రత కల్పించారు. ప్రస్తుతంరాష్ట్రంలో మొత్తం ఆహార భద్రత కార్డుల సంఖ్య 1,06,28,092 కోట్లకు చేరడమే కాకుండా కాంగ్రెస్ పాలకులు చేసిన కృషి కారణంగా 3.43కోట్ల మందికి కడుపునిండా ఎన్నడులేని తిండితినే అవకాశం కల్పించారు. తెలంగాణలో ఆహార భద్రత కార్యక్రమం ఏ స్థాయిలో కొనసాగుతోందో ఇందుకు ప్రభుత్వం చేస్తున్న వ్యయమే ప్రబలనిదర్శనం. రేషన్ బియ్యం కోసం ఏటా సుమారు రూ. 14 వేల కోట్లు, రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకు మరో రూ.20 వేలకోట్ల వరకు ప్రభుత్వం వెచ్చిస్తోంది. ప్రతి అర్హుడికి నెలకు ఆరు కిలోల సన్నబియ్యాన్ని ఉచితంగా అందిస్తున్నాం. ఇంత భారీ సంక్షేమ కార్యక్రమాన్ని మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా లబ్ధిదారుడి చెంతకు తీసుకెళ్లడానికి బియ్యం రవాణాలో పారదర్శకతకు స్మార్ట్ సప్లయ్‌చైన్ మేనేజ్‌మెంట్ అనే పద్ధతిని తీసుకొచ్చారు. మండల్ లెవల్ స్టాక్ పాయింట్ల నుంచి రేషన్ దుకాణాలకు బియ్యం రవాణాలో పూర్తి పారదర్శకత పాటించేందుకు పౌరసరఫరాల సంస్థలో స్మార్ట్ సప్లయ్ చైన్ మేనేజ్‌మెంట్ అనే నూతన విధానం ప్రవేశపెట్టారు. స్మార్ట్ ఎస్‌సిఎం విధానం అమలు చేయడానికి యాప్ ప్రత్యేకంగా రూపొందించారు. ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి రేషన్ దుకాణాలకు స్టేజ్2 కాంట్రాక్టర్ లారీల ద్వారా బియ్యం రవాణా చేసేవారు. ఆ లారీలకు గ్లోబల్ పొజిషనింగ్ సిస్టం అమర్చారు. ఆ లారీ ఎటువెళుతుంది, ఎక్కడ ఆగింది? ఈ విధానంలో తెలుస్తుంది. కానీ బియ్యం ఎక్కడ, ఎంత దిగుమతి అయ్యిందో తెలియదు. ఎఫ్‌సిఐ, ఎసిడబ్ల్యుసి గోదాముల నుంచి ఎంఎల్ఎస్ పాయింట్లకు బియ్యం రవాణా చేసే స్టేజ్1 విధానంలోనూ అమలు చేస్తే పారదర్శకత పెరుగుతుందని అధికారులు, డీలర్లు భావిస్తున్నారు. నూతన స్మార్ట్ ఎస్‌సి ఎం విధానంలో టెండర్ల సమయంలో అనుమతించిన నంబర్లతో ఉన్న లారీల వివరాలను కాంట్రాక్టర్ ఆన్లైన్లోనమోదు చేస్తారు. ప్రస్తుతం ల్యాప్టాప్, డెస్క్టాప్లో నూతన యాప్ అందుబాటు లోకి వచ్చింది. త్వరలో మొబైల్స్ యాప్ అందుబాటులోకి తేనున్నారు. డీలర్, కాంట్రాక్టర్, ఎంఎల్ఎస్ పాయింట్, పౌర సరఫరాల శాఖ జిల్లా అధికారుల మొబైల్స్‌లో ఈ యాప్ అందుబాటులోకి రానుంది. మరోవైపు రైస్‌మిల్లు అక్రమార్కులపై పకడ్బందిగా దాడులు చేస్తూ ధాన్యం స్టాక్ చూపని వారిపై కేసులు నమోదు చేస్తున్నారు. సివిల్ సప్లయ్ కమీషనర్ స్టీఫెన్ రవీంద్ర ఒక వైపు విజిలెన్స్ డిజిపి డిఎస్‌చౌహాన్ రైసుమిల్లర్లను ఏ మాత్రం ఊపిరి తీసుకోకుండా ధాన్యం అప్పగించాలని ఒత్తిడి పెంచుతున్నారు. సివిల్‌సప్లయ్ కమీషనర్ స్టీఫెన్ రవీంద్ర జిల్లాలో డిఎస్‌వో, డిఎం సివిల్ సప్లయ్‌కార్పొరేషన్‌లు పోలీసు స్టేషన్‌హౌజ్ ఆఫీసర్లకు కేసులు వీగిపోకుండా ఎఫ్ఐఆర్ కేస్ షీట్ రాసేందుకు తర్ఫీదు ఇచ్చారు. గతంలో కోర్టు తీర్పుల అనుభవాలను తీసుకొని ప్రత్యేకంగా ఒక పుస్తకాన్ని తీసుకొచ్చి ఇక ముందు రైస్‌మిల్లు ఓనర్లకు ఏ తప్పించుకోని అవకాశం ఇవ్వకుండా చర్యలు చేపట్టారు. దీనితో కోర్టుల్లో ముందస్తు బెయిల్ రాకుండా పోయింది. మరోవైపు కొంతమంది మిల్లర్లు ఇతర దేశాలకు పారిపోయే అవకాశం ఉందని తెలిసి వారిపై లుకౌట్ నోటీసులు కూడా జారి చేయడానికి ఉపేక్షించకూడదని కింది స్థాయి అధికారులకు ఎప్పటికప్పుడు పరిస్థితికనుగుణంగా చర్యలు తీసుకొనే స్వేచ్ఛను ఇచ్చారు. దీనితో ప్రతి రోజు సిఎంఆర్ ధాన్యం అక్రమార్గం పట్టించిన మిల్లర్లు బిక్కుబిక్కుమంటూ ఎప్పుడు తాము ఊచలు లెక్కించాల్సి వస్తుందో అనే భయంతో నెట్టుకొస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా కస్టమ్ మిల్లింగ్ ధాన్యంపక్కదారి పట్టించిన రైసు మిల్లులపై మిల్లుల్లో విజిలెన్స్, ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు మెరుపుదాడి చేసి తనిఖీలు చేయడం జులై 20నుంచి నిరంతరంగా కొనసాగిస్తూనే ఉంది. విజిలెన్స్, ఎన్ఫోర్స్మెంట్ శాఖ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన తనిఖీల్లో 89రైస్‌మిల్లుల్లోనే3,72,693.23 టన్నుల ధాన్యం మాయం అయినట్లు అధికారులు గుర్తించారని తెలిసింది. ఈ వడ్ల విలువ రూ.927.16 కోట్లు అయితే ఇందులో పదిరోజులుగా రూ. 715 ప్రభుత్వం రాబట్టింది మొత్తానికి ఈ సారి భారీగా రికవరీ చేయగలిగారు. బ్యాంకుల నుంచి వడ్డీకి రుణాలు తీసుకుని రైతులకు డబ్బులు చెల్లించి కొనుగోలు చేసిన వడ్లను మిల్లర్లకు ఇస్తే..మరాడించి బియ్యం ఇవ్వకుండా అమ్మేసుకుంటున్నారు. పక్కదారి పట్టించిన వడ్లలో 2022-23 రబీ, 2025-26 ఖరీఫ్ సీజన్లకు సంబంధించినవే అత్యధికంగా ఉన్నాయి. మరోవైపు అజ్ఞాతంలోకి వెళ్ళిన కొంతమంది రైసుమిల్లర్లపై లుకౌట్ నోటీసులకు సన్నాహాలు చేస్తున్నారు. ఒకే ఒక్కరోజు జులై మూడోవారం భారీ స్థాయిలో రైసుమిల్లులు ధాన్యం పక్కదారి పట్టించిన వరగంల్, మహబూబ్‌నగర్, జగిత్యాల, నల్లగొండ, సూర్యాపేట మెదక్ రైసుమిల్లుపై దాడి చేసి రూ.154 కోట్ల ధాన్యం రైసు మిల్లులు పక్కదారిపట్టించినట్లు గుర్తించి కేసులుపెట్టారు. జులై చివరివారం రెండవ అతి పెద్ద ధాన్యం వ్యత్యాసం ఐదు రైస్ మిల్లుల్లో ఏకంగా రూ.106 కోట్ల అక్రమాల్నిగుర్తించారు. ●

# 'పరీక్షా' కాలం!

జార్ఖండ్

**ఎ.వి.వి ప్రసాద్**

పరీక్షలే ఇప్పుడు ప్రభుత్వాలకు పరీక్షగా మారుతున్నాయి. ఢిల్లీ జంతర్ మంతర్‌వద్ద రగిలినఆందోళనల జ్వాలలు ఇప్పుడు రాంచీ మీదుగా వివిధ రాష్ట్రాలకువిస్తరిస్తూ అందరిలో ఆందోళన పెంచుతున్నాయి. విద్యార్థులు, ఉద్యోగార్థులు చేయిచేయి కలిపి తమకు న్యాయం కలిగించని ప్రభుత్వాలపై తిరగబడడం రాజకీయ నాయకులలో దడపుట్టిస్తోంది. జంతర్ మంతర్ ఆందోళనల ఫలితంగా కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం ఒక కీలక పరిణామమైతే, జార్ఖండ్‌లో సోరెన్ నాయకత్వంలోని జెఎంఎం ప్రభుత్వం ప్రస్తుతం గడ్డుపరిస్థితిని ఎదుర్కోవడం మరో కీలక పరిణామం. మూడు వారాలుగా విద్యార్థులు, ఉద్యోగార్థులు రాంచిలో సాగిస్తున్న ఆందోళనల జ్వాలలు ఉవ్వెత్తున ఎగసిపడుతూ నేతలకు ముచ్చెమటలు పట్టిస్తున్నాయి. జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (జెపిఎస్సీ)జార్ఖండ్ స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (జెపిఎస్‌సి) నిర్వహించిన నియామక పరీక్షల్లోని అవకతవకల ఆరోపణలకు వ్యతిరేకంగా ఆందోళనలు ఉద్రిక్తతలను పెంచుతున్నాయి. జెఎస్ఎస్‌సి కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవెల్ (సిజిఎల్) పరీక్షను రద్దు చేయాలని, నియామకాల్లోని అవకతవకలపై సిబిఐదర్యాప్తు జరపాలనీ ఆందోళనకారులు డిమాండ్ చేస్తున్నారు. విద్యార్థినేతలు, ప్రభుత్వం మధ్య ఇప్పటికి మూడు దఫాలుగా చర్చలు జరిగినా సమస్యకు పరిష్కారం లభించకపోవడం చూస్తే ప్రభుత్వం ఎంత మొండివైఖరితో ఉన్నదో స్పష్టమవుతుంది. 14వ జెపిఎస్‌సి నియామక పరీక్ష రద్దు చేస్తామనీ, నిర్వహించిన టిడిపిఎల్ సంస్థపై ఇడి విచారణకు ఆదేశిస్తామనీ ప్రభుత్వం హామీ ఇచ్చినా సిబిఐ విచారణ జరిపించే వరకు తాము వెనక్కి తగ్గబోమని ఉద్యమ నాయకులు స్పష్టం చేస్తున్నారు. విద్యార్థుల నిరసనల నేపథ్యంలో జెపిఎస్‌సికి చెందిన ముగ్గురు సభ్యులు డా. అజిత్ భట్టాచార్య, డా. అనిమా హన్స్ దా, డా. జమీల్ అహ్మద్ ఇప్పటికే రాజీనామాచేశారు. సిజిఎల్ పరీక్షను సుప్రీంకోర్టు, హైకోర్టు ఆదేశాల మేరకే నిర్వహించామనీ, అది న్యాయ పరిధిలో ఉన్నందున రద్దు కుదరదనీ మంత్రి సుదివ్య కుమార్ సోను ప్రకటించిన తర్వాత ఆందోళనలు మరింత ఉధృతమయ్యాయి. సిజిఎల్ పరీక్ష ఫలితాలు కూడా వచ్చేశాయి. రెండు వేల మంది పైగా అభ్యర్థులు ఉద్యోగాల్లో చేరడంకూడా పూర్తయింది. అటువంటప్పుడు పరీక్ష రద్దు కోరడమేమిటని ప్రభుత్వం ప్రశ్నిస్తోంది. పార్లమెంటును నీట్ ఆందోళనలు ఓ కుదుపు కుదిపితేనియామక పరీక్షలు జార్ఖండ్ అసెంబ్లీని తలకిందులు చేస్తున్నాయి. గత సోమవారం విద్యార్థి ఉద్యమం హింసాత్మకంగా మారి రక్తపాతాన్ని సృష్టించడంతో దానిప్రభావం అసెంబ్లీపై ఎక్కువగా పడింది.


విద్యార్థుల ఆందోళన

బుధవారం దాకా కొనసాగవలసిన అసెంబ్లీమంగళవారమే నిరవధికంగా వాయిదా పడింది. విద్యార్థులపై జరిగిన లాఠీ చార్జిని నిరసిస్తూ విపక్ష ఎమ్మెల్యేలు గళమెత్తడంతో అసెంబ్లీ ముందుకు కదలని పరిస్థితి ఏర్పడింది. ఉద్యోగాలను డబ్బుకు అమ్ముకుంటున్నారంటూ పలువురు ఎమ్మెల్యేలు అసెంబ్లీలో కరెన్సీని వెదజల్లడం నిరసనలకు పరాకాష్ట అనాలి. పరీక్షల సంస్కరణలకు సంబంధించి 855 సలహాలు వచ్చాయనీ, జవాబు దారీవ్యవస్థను మెరుగుపరుస్తామనీ సిఎం సోరెన్ అసెంబ్లీలో ప్రకటించినా ఎమ్మెల్యేలు వెనక్కితగ్గకపోవడంతో స్పీకర్ విధిలేక సభను నిరవధికంగా వాయిదా వేయవలసి వచ్చింది. పరీక్షల అవకతవకలపైనిరాహారదీక్ష చేస్తున్న ఆరుగురిలోరాహుల్ క్రాంతి ఆసుపత్రి ఐసియు నుంచే దీక్ష కొనసాగించడం ఉద్రిక్తతను మరింత పెంచుతోంది. జంతర్ మంతర్ ఆందోళనల్లో సోనమ్ వాంగ్చుక్ లా రాంచీ ఆందోళనల్లో దీపేంద్ర నాథ్ మహతో నిరవధిక నిరహార దీక్ష కొనసాగిస్తున్నారు. జార్ఖండ్ లోక్ తాంత్రిక్ క్రాంతికార్ మోర్చా (జెఎల్‌కెఎం) నేత అయిన మహతో చేస్తున్న దీక్ష జెఎంఎం ప్రభుత్వ పునాదులను కదుల్చుతున్నట్లే కనిపిస్తోంది. జెపిఎస్ సి మాజీ చైర్మన్ ఎల్. ఖియంగ్తేను సిఐడి పోలీసులు గత సోమవారం అరెస్టు చేసిన తర్వాత ప్రభుత్వం ఆందోళనకారులతో మరో దఫాచర్చలు జరిపినా ప్రయోజనం లేకపోవడంతో పరిస్థితి పూర్తిగా అదుపుతప్పినట్లే కనిపిస్తోంది. నిషేధిత సంస్థ టిఎస్సార్ డేటా ప్రాసెసింగ్‌కు పరీక్ష నిర్వహణ కాంట్రాక్టు అప్పగించడాన్ని కూడా విద్యార్థి సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. ఖియంగ్తే 2 కోట్ల రూపాయల లంచంతో పాటు 20శాతం కమిషన్ కూడా తీసుకొన్నట్లు ఆరోపణలున్నాయి. అటువంటి వారు మరికొందరుకూడా ఉన్నారు. దానిపై ప్రభుత్వం నుంచి ఎటువంటి సమాధానం లభించకపోవడం అందరికీ ఆశ్చర్యం కలిగిస్తోంది. కేవలం కంటితుడుపు చర్యగా కొందరు ముఖ్యులతో రాజీనామాలు చేయించినట్లుకనిపిస్తోంది. గత సోమవారం రాంచిలో ఆందోళనకారులు చేపట్టిన అసెంబ్లీ ముట్టడి చివరికి హింసాత్మకం అయింది. ఒక దశలో పోలీసులు లాఠీ చార్జిని కూడా జరిపి, బాష్పవాయువును ప్రయోగించారు. కొన్ని డజన్ల మంది తీవ్రంగా గాయపడ్డారు కూడా. ఈఘటన దేశవ్యాప్తంగా తీవ్రసంచలనం కలిగించింది. ఇషాంత్ సింగ్ యుద్ధంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అలాగే శనివారం స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా ఆందోళనకారులు భారీగా నిర్వహించిన 'తిరంగా యాత్ర' నిరసన ర్యాలీ కూడా దేశంలో అందరి దృష్టినీ ఆకర్షించింది. ఆందోళనకారులు డిమాండ్ చేస్తున్న సిబిఐ దర్యాప్తునకు ప్రభుత్వం ఇంకా అంగీకరించకపోవడంతో పరిస్థితి పూర్తిగా చేయిదాటుతోంది. ప్రభుత్వం, విద్యార్థులు, ఉద్యోగార్థులు ఈ ఆందోళనలకు ఒక సరైన ముగింపుఇవ్వకపోతే ప్రజలు తీవ్రసమస్యలు ఎదుర్కొనవలసి వస్తుంది. ఆందోళనకారులు సమస్యను మరింత సాగదీయకుండా ఒక సామరస్య పరిష్కారానికి ప్రయత్నించాలి. పరీక్షల్లో అవకతవకలకు ఆస్కారం లేకుండా ఒక పటిష్టమైన, పారదర్శకమైన అధికారయంత్రాగాన్ని ప్రభుత్వం రూపొందించవలసి ఉంది. లేకుంటే ప్రభుత్వానికి నిత్యం పరీక్షే ఎదురవుతూంటుంది. ●

# ఆత్మహత్యల 'సెగ'లు!

ఫ్రాన్స్

**గన్ని మోహన్**

ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ సర్కారుకు రాజకీయ సంక్షోభంతోపాటు ప్రధాని కార్యాలయం ఉద్యోగుల ఆత్మహత్య ఘటనలు సతమతం చేస్తున్నాయి. రెండేళ్లలోనే నలుగురు ప్రధానులు మారిన మాక్రాన్ సర్కారులో ఉన్నత ఉద్యోగులు, కొత్త కేబినెట్ రాక వంటివాటితో ఉద్యోగులపై మానసిక ఒత్తిడి పెరిగిందన్న భావన ఎక్కువైంది. మరీ ముఖ్యంగా ప్రధానమంత్రి సెబాస్టియన్ లెకోర్ను కార్యాలయానికి అనుబంధంగా పనిచేసే వివిధ ప్రభుత్వ విభాగాల్లో వరుసగా ఆత్మహత్యలు, ఆత్మహత్యాయత్నాలు చోటుచేసుకున్న నేపథ్యంలో ఉద్యోగులపై మానసిక వేధింపుల ఆరోపణలపై ఫ్రెంచ్ ప్రాసిక్యూటర్లు క్రిమినల్ దర్యాప్తు ప్రారంభించారు. ఈవ్యవహారంలో పారిస్ ప్రాసిక్యూటర్ కార్యాలయం ప్రాథమిక దర్యాప్తును చేపట్టింది. ఇప్పటివరకు ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులు ఆత్మహత్య చేసుకోగా, మరో ఇద్దరు ఆత్మహత్యకు ప్రయత్నించినట్లు అధికారులు గుర్తించారు. మరో ఉద్యోగి మృతి కూడా అనుమానాస్పద పరిస్థితుల్లో జరిగింది. రాజకీయ దుమారాన్ని అరికట్టేందుకు ఆత్మహత్యలు, ఆత్మహత్యాయత్నాలకు సంబంధించిన ఉద్యోగుల్లో ఎవరూ ప్రస్తుత ప్రధానమంత్రి సెబాస్టియన్ లెకోర్ను వ్యక్తిగత కార్యాలయంలో పనిచేయలేదని, వారెవరూ ప్రధానమంత్రితో నేరుగా పని చేసిన సిబ్బంది కాదని చెపుతున్నా ఆత్మహత్యల పరంపర విస్తృత దర్యాప్తునకు బాటలు వేసింది. దీనికి గత ఏప్రిల్‌లో జరిగిన ఒకప్రభుత్వ ఉద్యోగి లారా అనే సీనియర్ ప్రభుత్వ ఉద్యోగిని ఏప్రిల్‌లో రైలు ముందు దూకి ఆత్మహత్యకు యత్నించిన ఘటన మూలం అయింది. ఓవ్యక్తి ఆమెను రక్షించడంతో ప్రాణాలతోబయటపడ్డారు. ఆతర్వాత లారా తన కార్యాలయంలో తనపై మానసిక వేధింపులు, అవమానకర ప్రవర్తన, తన ప్రాణాలకు ముప్పు కలిగించే పరిస్థితులు సృష్టించారని ఆరోపిస్తూ ఫిర్యాదు చేశారు. ప్రధాన మంత్రి కార్యాలయ సేవలకు అనుబంధంగా ఉన్న కరస్పాండెన్స్ విభాగంలో పనిచేసిన తనను ఉద్దేశపూర్వకంగా ఒంటరి చేశారని ఆమెఆరోపించారు. ఆమెను సమావేశాలకు పిలవకుండా చేయడం, సంస్థాగత చార్టుల నుంచి ఆమె పేరును తొలగించడం, సహచరుల నుంచి దూరంగా ఉంచడం, అవమానించడం, ఎగతాళి చేయడం వంటి చర్యలకు గురిచేశారని తెలిపారు. ఆత్మహత్యాయత్నానికి కొన్ని నెలలముందే లారా తన వీలునామా, అంత్యక్రియలకు సంబంధించిన ఏర్పాట్లు కూడా చేసుకున్నట్లు ఫ్రెంచ్ మీడియాలో విస్తృత వచ్చాయి. లారా ఘటన ఒక్కటే కాదని ప్రధాన మంత్రి కార్యాలయ సేవల పరిధిలోనిప్రభుత్వ విభాగాల్లో గత కొంతకాలంగా ఇలాంటి విషాద ఘటనలు చోటుచేసుకుంటున్నాయని అధికారులు చెబుతున్నారు. గత అక్టోబర్‌లో ఒకప్రభుత్వఉద్యోగి కార్యాలయంలోనే ఆత్మహత్యకు ప్రయత్నించారు. మార్చిలో ఒకప్రాజెక్ట్ మేనేజర్ ఇంట్లో ఆత్మహత్య చేసుకున్నారు. మరో ప్రభుత్వ ఉద్యోగి కార్యాలయ తీవ్ర ఒత్తిడితో రైలు ముందు దూకిమరణించినట్లు ఆరోపణలున్నాయి.


సెబాస్టియన్ లెకోర్ను


లారా ఆత్మహత్యాయత్నం అనంతరం పారిస్‌లోని ప్రభుత్వ కార్యాలయంలో ఓ యువ ఉద్యోగి మృతదేహం కూడా లభించింది. ఈవరుస ఘటనల నేపథ్యంలో ప్రభుత్వ ఉద్యోగుల పని వాతావరణం, మానసిక ఆరోగ్యం, ఉన్నతాధికారుల వ్యవహారశైలిపై ప్రశ్నలుతలెత్తాయి. ప్రభుత్వంలోనే వ్యవస్థాగత స్థాయిలో ఉద్యోగులపై వేధింపులు జరు గుతున్నాయంటూ ఓ సిబ్బంది ప్రతినిధి జూన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగానే ప్రాసిక్యూటర్ కార్యాలయం ప్రాథమిక దర్యాప్తును ప్రారంభించింది. ఉద్యోగులపై వ్యక్తిగతంగా వేధింపులు జరిగాయా? ప్రభుత్వ విభాగాల్లోని విధానాలు, తరచూ జరుగుతున్న మార్పులు, అధికారులశైలి కారణంగా వ్యవస్థాగత ఒత్తిడిఏర్ప డిందా అనే అంశాలను దర్యాప్తులోకి చేర్చారు. ఫ్రాన్స్‌లో గత రెండేళ్లుగా కొనసాగుతున్న రాజకీయ అస్థిరత కూడా ప్రభుత్వ ఉద్యోగులపై పనిఒత్తిడిని పెంచిందని ఉద్యోగ సంఘాలు, సిబ్బంది ప్రతినిధులు ఆరోపిస్తున్నారు. అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ జాతీయ అసెంబ్లీని రద్దు చేసిన తర్వాత దేశరాజకీయాల్లో అనిశ్చితి పెరిగింది. రెండేళ్లలో ఫ్రాన్స్‌కు నలుగురు వేర్వేరు ప్రధానమంత్రులు రావడంప్రభుత్వ యంత్రాంగంలో తరచూ నాయకత్వ మార్పులకు దారితీసింది. ప్రధానమంత్రి మార్పులతోపాటు ఉన్నత స్థాయి అధికారుల బదిలీలు, మేనేజ్‌మెంట్ పునర్వ్యవస్థీకరణలు, విభాగాలపునర్నిర్మాణం తరచూ జరగడంతో ఉద్యోగుల్లో అయోమయం, అస్థిరత, ఒత్తిడి పెరిగిందని ఫ్రెంచ్ మీడియాతో పలువురు సిబ్బంది తెలిపారు. ప్రాసిక్యూటర్ కార్యాలయం చేపట్టిన క్రిమినల్ దర్యాప్తుతోపాటు ఫ్రెంచ్ ప్రభుత్వంకూడా ఈఘటనలపై అంతర్గత విచారణలకు ఆదేశించింది. వ్యక్తిగతంగా జరిగిన విషాద ఘటనలను పరిశీలించడంతో పాటు ప్రభుత్వ విభాగాల్లో ఉద్యోగుల సంక్షేమం, పని పరిస్థితులపై కూడా సమగ్రసమీక్ష చేపట్టింది. ఉద్యోగుల మానసిక ఆరోగ్యం, కార్యాలయ వాతావరణం, నిర్వహణ విధానాలు, ఉద్యోగులపై ఒత్తిడివంటి అంశాలపై దర్యాప్తు చేసారు. ప్రధాని కార్యాలయంలోని అన్ని విభాగాల్లో పని పరిస్థితులపై ప్రత్యేక నిపుణుల ఆడిట్ నిర్వహణకు ఆదేశించడంతో పీఎంవో సేవల పరిధిలోని ప్రభుత్వ విభాగాల్లో ఉద్యోగులపై మానసిక ఒత్తిడి, వేధింపులు ఉన్నాయన్న ఆరోపణలపై ఇప్పుడు క్రిమినల్ దర్యాప్తు ప్రారంభం కావడం ఫ్రాన్స్ ప్రభుత్వ యంత్రాంగంలో ఉద్యోగుల పని పరిస్థితులపై తీవ్రచర్చకు దారితీసింది. వరుస ఆత్మహత్యలు, ఆత్మహత్యాయత్నాల వెనుక వ్యక్తిగత కారణాలే ఉన్నాయా? లేక కార్యాలయాల్లోని వేధింపులు, పరిపాలనా అస్థిరత, అధికపని ఒత్తిడి కూడా కారణమా? అనే అంశాలపై దర్యాప్తు పూర్తయ్యే వరకు స్పష్టత వచ్చే అవకాశం లేదు. ప్రభుత్వ ఉద్యోగుల మానసిక ఆరోగ్యం, సురక్షితమైన పనివాతావరణం కల్పించాల్సిన బాధ్యతను ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్‌కు ఈ ఘటనలు మరోసారి గుర్తుచేస్తున్నాయి. ●

# కొత్త ఆధ్యాత్మిక చైతన్యమే 'ఇస్కాన్'

**డి.శ్రీనివాస్**

అంతర్జాతీయ కృష్ణచైతన్య సంఘం ఇంటర్నేషనల్ సొసైటీ ఫర్ కృష్ణ కాన్సియస్ నెస్... ఈ పేరు నేడు ఒక ఆధ్యాత్మిక విప్లవానికి పర్యాయపదం. కృష్ణ చైతన్యానికి మారు పేరు. హరినామ సంకీర్తన ధ్యేయంగా, శ్రీమద్ భగవద్గీత పునాదిగా, శ్రీమద్ భాగవతం, శ్రీ చైతన్య మహాప్రభు బోధనలు ఆలంబనగా విరాజిల్లుతోంది. హరేకృష్ణ హరేకృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే.. హరే రామ హరే రామ రామ రామ హరే హరే.. అనే మహామంత్రం భక్తులు నిత్యం వందలు, వేలసార్లు జపిస్తూ ధార్మిక జగత్తులో ఓలలాడుతున్నారు. భౌతిక సుఖాలకు పాకులాడకుండా శాశ్వతమైన గోలోకా బృందావనాన్ని చేరుకోవాలని తపిస్తుంటారు. ఏ.సి. భక్తివేదాంత స్వామి ఈ సంస్థ వ్యవస్థాపక ఆచార్యులు. తదనంతరం వీరే శ్రీల ప్రభుపాదులుగా వ్యవహరింపబడినారు. ఇస్కాన్‌ను భక్తి వేదాంత స్వామి 1966 జులై 13 న న్యూయార్క్‌లో ఏర్పాటు చేశారు. అలా ఈ సంస్థ ఏర్పడి 60 సంవత్సరాలు పూర్తయ్యాయి. ఇటీవలనే ఉత్సవాలు జరిగాయి. ఇంకా జరుగుతున్నాయి. ఇస్కాన్ స్థాపించాక వారు ప్రపంచవ్యాప్తంగా 108 కృష్ణ మందిరాలను నెలకొల్పారు. అందులో భాగంగా మనదేశంలో వారు తన స్వహస్తాలతో మాయాపూర్, కొలకత్తా, బృందావనం, హైదరాబాద్‌లో ఇస్కాన్ మందిరాలను ప్రతిష్టించారు. హైదరాబాద్ అబిడ్స్‌లోని ఇస్కాన్ శ్రీశ్రీ రాధా మదన మోహన మందిరాన్ని 1976 ఆగస్టు 18న ప్రతిష్టించారు. అంటే ఈనెల 18తో ఈ మందిరం స్థాపించి 50 సంవత్సరాలు పూర్తి అవుతున్నాయి. ఒకవైపు ఇస్కాన్ ఏర్పడి 60 సంవత్సరాలు, ఇస్కాన్ హైదరాబాద్ ఆబిడ్స్ మందిరం 50 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న శుభ సందర్భంగా వీటి వివరాలు ఒకసారి పరిశీలిద్దాం. భక్తివేదాంత స్వామి కలకత్తాలో 1896 సెప్టెంబర్ 1న సాంప్రదాయ గౌడియ వైష్ణవ కుటుంబంలో జన్మించారు. తల్లిదండ్రులు పెట్టిన పేరు అభయ్. సంప్రదాయంగా వచ్చిన భక్తితో పాటు వారి తండ్రి మోహన్ దే కున్న అపారమైన భక్తి వీరికి కూడా బాల్యం నుండే అబ్బింది. అదే తదనంతర కాలంలో తన ఆధ్యాత్మిక ప్రయాణానికి బాటలు వేసింది. అందులో భాగంగా వేదాంత స్వామి 1922లో శ్రీల భక్తి సిద్ధాంత సరస్వతి ఠాకూర్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఠాకూర్ మాట్లాడుతూ ఆంగ్ల భాష తెలిసిన మీరు పాశ్చాత్య దేశాలలో కృష్ణ చైతన్యం ప్రచారం చేయాలని అభిలషించారు. అలాగే 1932లో సరస్వతి ఠాకూర్ మరోమారు వేదాంత స్వామికి 'నీవద్ద డబ్బులు ఉంటే కృష్ణ చైతన్యం పుస్తకాలు' ప్రచురించాలని, రచనలు చేయాలని సూచించారు. 1935లో వారి వద్దనే వేదాంతస్వామి దీక్ష తీసుకున్నారు. 1944లో కలకత్తా నుండి 'బ్యాక్ టు హెడ్' పత్రికను ప్రారంభించారు. అనేక ఒడిదుడుకులు ఎదురైనప్పటికీ పత్రికను ప్రచురించారు. కృష్ణ చైతన్యం కొరకు కృషిచేశారు. పత్రిక ప్రచురణ, కృష్ణ చైతన్యం లక్ష్యంగా ఢిల్లీ తరచుగా వెళ్లేవారు. ఎందరినో కలిసి సహకరించాలని అభ్యర్థించేవారు. అయినా చేయూత లభించలేదు. కృష్ణ ప్రచారం పోరాటంలో బృందావనానికి తన మకాన్ని మార్చారు. అంతేకాకుండా 1959లో సన్యాసం స్వీకరించారు. గురువు ఆజ్ఞ మేరకు పుస్తకం ప్రచురణ, అనువాదం చేయటం ప్రారంభించారు. ఆశించిన రీతిలో ఆధ్యాత్మిక ప్రయాణం సాగటం లేదని గుర్తించి అమెరికా వెళ్లాలన్న చెక్కుచెదరని సంకల్పంతో ముందుకు సాగారు. ప్రచారం చేయాలని తలిచారు. చేతిలో డబ్బులు లేవు. వెళ్ళాక ఎక్కడ ఉండాలో తెలియదు. అయినా సంకల్పం చెక్కుచెదరలేదు. ఎట్టకేలకు సింధియా స్టీమ్ షిప్ లైన్ సంస్థ అధినేత్రి సుమతి మురార్జీని వేదాంతస్వామి 1965 ఆగస్టు 13న కలకత్తా షిప్ హార్బర్ నుండి జలదూత అనే షిప్‌లో ప్రయాణమైనారు. 37 రోజుల ప్రయాణం తర్వాత సెప్టెంబర్ 19న న్యూయార్క్ చేరుకున్నారు. పెన్సిల్వేనియా రాష్ట్రంలోని బట్లర్ నగరంలో ఉన్న గోపాల్ ఆగర్వాల్‌ఇంటికి వెళ్లారు. అనంతరం అనేక ప్రదేశాలలో తిరుగుతూ కృష్ణ చైతన్యం బోధనలు ఇవ్వసాగారు. అయితే ఆ రోజులలో అమెరికాలోని చాలా ప్రాంతాలలో యువత హిప్పి కల్చర్


శ్రీశ్రీ రాధా మదన మోహన


శ్రీల ప్రభుపాదులవారు

కలిగి, మత్తు మందులు, మాదక ద్రవ్యాలు, తాగుడుకు బానిసలై ఉండటాన్ని గమనించిన వేదాంతస్వామి ఆశ్చర్యకరంగా వారి మధ్యనే నివసించాల్సిన పరిస్థితులు నెలకొని ఉండేవి. అమెరికాలో 9 నెలలకు పైగా నిర్విరామంగా కృష్ణబోధనలు చేస్తూ, భారతీయ ఆధ్యాత్మికం, కృష్ణచైతన్యం పట్లవిశ్వాసం ఉన్న వ్యక్తుల తోడ్పాటుతో వేదాంతస్వామి తనకంటూ ఒక ఆశ్రయం ఏర్పాటు చేసుకున్నారు. న్యూయార్క్‌లోని సెకండ్ అవెన్యూ స్టోర్ ఫ్రంట్‌లో కృష్ణ సందేశాలు ఇవ్వడానికిహాల్, తాను నివాసం ఉండేందుకు ఒక గది కల భవనంలోకి తన మకాంని మార్చారు. అక్కడి నుండే కృష్ణ చైతన్య ప్రచారం కార్యక్రమాలు, భజనలు, హరినామ సంకీర్తనలు, శ్రీమద్ భగవద్ గీత, భాగవతం, కృష్ణ సంబంధ గ్రంథాలపై ప్రవచనాలు భక్తివేదాంత స్వామి ఇచ్చారు. ఈ కృష్ణ చైతన్య యాత్రలో చిరస్థాయిగా నిలిచేందుకు వారు 1966 జులై 13న 'ఇస్కాన్' ను స్థాపించారు. పూర్తి స్థాయి సంస్థగా రూపాకల్పన చేశారు. పుస్తక రచనలు, అనువాదాలు, ప్రచురణల కొరకు 'భక్తి వేదాంత బుక్ ట్రస్ట్' ను నెలకొల్పారు. శ్రీ అభయ చరణారవింద భక్తి వేదాంత స్వామి తదనంతరం శ్రీల ప్రభుపాదులుగా ప్రసిద్ధి చెందారు. ఎంతో మందికి దీక్షలు ఇచ్చారు. 70కి పైగా వైదిక గ్రంథాలు, కృష్ణచైతన్య పుస్తకాలకి సంబంధించి సంపుటాలు రచించారు, అనువదించారు, అలాగే వాటికి వ్యాఖ్యనాలు రాసారు. వీరి గ్రంథాలు 95 భాషలలోకి అనువాదం అయ్యాయి. భగవద్గీత యధాతథం, శ్రీమద్ భాగవతం, శ్రీ చైతన్య చరితామృతం, భక్తి రసామృతం, శ్రీ ఈశోపనిషత్తు, ఉపదేశామృతం, దేవాదిదేవుడు శ్రీకృష్ణ భగవానుడు వంటిఅనేక సుప్రసిద్ధమైనగ్రంథాలు ఇవి కొన్ని. ఇక శ్రీల ప్రభుపాదులవారు కేవలం 11సంవత్సరాల వ్యవధిలో 14 సార్లు ప్రపంచాన్ని చుట్టివచ్చారు. తన జీవిత కాలం అంతా కృష్ణసేవలో, ఆచార్యుల మార్గనిర్దేశంలో గడిపిన శ్రీల ప్రభుపాదులవారు 1977 నవంబర్ 14 న తనువు చాలించారు. నేడు అనేక దేశాలలో ఇస్కాన్ కృష్ణ మందిరాలున్నాయి. కోట్లల్లో ఇస్కాన్ భక్తులున్నారు. వివిధ సేవ కార్యక్రమాలు, ఉచిత భోజన వితరణ, విద్యా సంస్థలు, గోశాలలు, గురుకులాలు, వర్ణాశ్రమాలు, సమాజ హితం కోసం పనులు చేస్తూ, మరోవైపు భక్తి యుత సేవ చేస్తూ ఇస్కాన్ నేడు ఆధ్యాత్మిక భూలోక బృదావనంగా తీర్చిదిద్దబడింది. ముఖ్యంగా జగన్నాథ రథయాత్రలు అన్ని చోట్లా నిర్వహిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా 150కి పైగా దేశాలలో ఇస్కాన్ కృష్ణ చైతన్య కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. 900కు పైగా ఇస్కాన్ రాధాకృష్ణ మందిరాలు నెలకొల్పబడినాయి. 75కోట్ల భక్తి గ్రంథాలు ప్రపంచ దేశాలలో అనేక భాషలలో వితరణ చేశారు. ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం సుమారు 1.2కోట్ల మంది భక్తులు ఇస్కాన్ ఆలయాలను సందర్శిస్తున్నారు. భారతదేశంలోని పాఠశాలల్లో మధ్యాహ్న భోజన కార్యక్రమం ద్వారా ప్రతి రోజూ సుమారు 30లక్షల మంది పిల్లలకు భోజనం అందించబడుతోంది. వైద్యసేవల్లో భాగంగా ఇస్కాన్ ఆసుపత్రులు, వైద్య శిబిరాలు, నేత్ర శిబిరాల ద్వారా ఇప్పటివరకు సుమారు 3.4 లక్షల మంది రోగులు సేవలను పొందారు. 1967నుంచి ఇప్పటివరకు సుమారు ఒక లక్షమంది భక్తులు అధికారిక ఆధ్యాత్మిక దీక్షను స్వీకరించారు. ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏటా సుమారు 6వేల కృష్ణ చైతన్య ఉత్సవాలు నిర్వహించబడుతున్నాయి. హైదరాబాద్ అబిడ్స్‌లోని ఇస్కాన్ శ్రీశ్రీ రాధా మదన మోహన మందిరం ఈనెల 18వ తేదీతో 50సంవత్సరాలు పూర్తిచేసుకుని, స్వర్ణోత్సవ శోభను సంతరించుకుంది. శ్రీల ప్రభుపాదులు 1976 ఆగస్టు 18న ఈ మందిరంలో శ్రీ శ్రీ రాధా మదన మోహన, శ్రీ శ్రీ గౌరనితాయి, శ్రీశ్రీజగన్నాథ, సుభద్ర, బలదేవ విగ్రహాలను ప్రతిష్టించారు. 50 ఏళ్ళ ప్రస్థానాన్ని అత్యంత వైభవంగా ఆలయకమిటీ నిర్వహిస్తోం ది. ఈ సందర్భంగా ఆగస్టు 15, 16, 17, 18 తేదీలలో నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా 5లక్షల భోజనాలు ఉచితంగా పంపిణీ చేయనున్నారు. ప్రత్యేక గీతాన్ని ఆవిష్కరిస్తారు. 50ఏళ్ల ప్రస్థానంలో సేవలందించిన వారికి సత్కారం చేయాలని నిర్ణయించారు. భక్తితత్వంతో నిస్వార్థ సేవ.. అమెరికాలో అననుకూల పరిస్థితులను సైతం సానుకూలంగా మార్చుకుని యువతను 'కృష్ణ చైతన్యం'లోకి తెచ్చారు. జీవితాన్ని తరతరాలకు ఆదర్శనీయంగా తీర్చిదిద్దారు. ●

# ప్రధాని చెప్పిన 'సప్తధార'లు ఇవీ..

## ఏడు లక్ష్యాలతో దేశ అభివృద్ధికి వడివడిగా అడుగులు



**న్యూఢిల్లీ, ఆగస్టు 15:** సప్తధార శక్తి సామర్థ్యాలతో దేశాన్ని నూతన శిఖరాలకు తీసుకెళ్తామన్న ప్రధానిమోడీ భారతావనికి నూతన వేగం అందిస్తామని, సరికొత్త లక్ష్యాలను సాధించి, వాటిని అధిగమించేలా శక్తివంతం చేస్తామన్నారు. యువతలో ఉన్న అపార సామర్థ్యాలను దేశ నిర్మాణం కోసం పూర్తిగా వినియోగిస్తామన్నారు. యువత ప్రతిభ, ఉత్సాహం, శక్తిని ఏకం చేసి బలమైన, మరింత అభివృద్ధి చెందిన భారతదేశాన్ని నిర్మించే దిశగా మళ్లిస్తామని మోడీ ప్రకటించారు. తయారీ రంగం, రైతాంగం, సాంకేతికత, గతి శక్తి, రక్ష శక్తి, గ్రీన్ ఎనర్జీ, సాఫ్ట్ పవర్ అనే ఏడు ధారల సాయంతో దేశాన్ని స్వయం సమృద్ధం చేస్తామన్నారు. దేశ ప్రగతికి తయారీ రంగాన్ని భారత భవిష్యత్తుకు గ్రోత్ ఇంజిన్‌గా అభివర్ణించిన ప్రధాని మోడీ తయారీ రంగానికి ఊతమివ్వాలని పిలుపునిచ్చారు. మనకు విడి భాగాలతోపాటు పూర్తి స్థాయి ఉత్పత్తులు కూడా కావాలన్న ప్రధాని ప్రపంచ సప్లయ్ చైన్‌లో భారత్ కేంద్ర బిందువుగా మారాలని పిలుపునిచ్చారు. సప్తధారలో రెండో ధారగా వ్యవసాయం, ఆహార శుద్ధి రంగాన్ని ప్రధాని మోడీ అభివర్ణించారు. ఈ దిశలో మనం ముందుకెళ్లాలన్న ప్రధాని ఇప్పుడు ప్రపంచ మార్కెట్లు మన రైతులకు తెరిచి ఉన్నాయన్నారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల వల్ల అతిపెద్ద మార్కెట్లు సైతం మనకు అందుబాటులోకి వస్తున్నాయని మనం వాటిని చేరుకోవాలన్నారు. పొలం నుంచి ఎగుమతి మార్కెట్‌కు మన ఉత్పత్తులను మళ్లించాలన్నారు. మన సంప్రదాయ ఆహారం, మిల్లెట్స్, సుగంధ ద్రవ్యాలు, పండ్లు, కూరగాయలు అంతర్జాతీయ బ్రాండ్లుగా మారాల్సిన అవసరం ఉందన్నారు. మూడో సప్తధారగా టెక్నాలజీ, ఆవిష్కరణలు అని పేర్కొన్న మోడీ డేటా సెంటర్లు, రోబోటిక్స్, సరికొత్త టెక్నాలజీల యుగం నడుస్తోందన్నారు. ఈ టెక్నాలజీల హబ్‌గా భారత్ మారాలని పిలుపునిచ్చారు. యుపిఐని ప్రవేశపెట్టడం ద్వారా మన సామర్థం ఏంటో మనకు తెలిసిందన్నారు. మేడిన్ ఇండియా 6జీ దేశమంతటా చేరాలని లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు. యుపిఐ, డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాతోపాటు నెక్స్ట్ జనరేషన్ కమ్యూనికేషన్ టెక్నాలజీలో మనం మరో పెద్ద అడుగు వేయాలన్నారు. దేశవ్యాప్తంగా వేగవంతమైన కనెక్టివిటీని పెంపొందించాలన్న ప్రధాని వ్యాపార రంగానికి ఊతం ఇవ్వడం కోసం కొత్త రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేలు ఏర్పాటుకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. సప్తధారల్లో రక్షణ కూడా భాగమన్న ప్రధాని రక్షణ ఉత్పత్తుల తయారీ, రక్షణ రంగంలో భారత్ స్వయం సమృద్ధి సాధించాలన్నారు. డ్రోన్ టెక్నాలజీ గురించి ప్రత్యేకంగా ప్రస్తావించిన ప్రధాని డ్రోన్లు, కౌంటర్ డ్రోన్ టెక్నాలజీ భారత్ మరింత పెట్టుబడులు పెడుతుందన్నారు. గ్రీన్ ఎనర్జీని ఆరో ధారగా పేర్కొన్న ప్రధాని దేశంలో కాలుష్యం తగ్గించడం కోసం గ్రీన్ టెక్నాలజీ రంగంలో పెద్ద ఆవిష్కరణలకు పిలుపు నిచ్చారు. భారత సాఫ్ట్ పవర్‌ను ఏడో ధారగా ప్రకటించిన ప్రధాని యోగా, చేతివృత్తులు, సినిమా, యానిమేషన్, గేమింగ్, డిజిటల్ కంటెంట్, సృజనాత్మక రంగాన్ని సాఫ్ట్ పవర్‌కు ఉదాహరణగా పేర్కొన్నారు. పెద్ద స్థాయిలో అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించే సామర్థం భారత్‌కు ఉందన్న ప్రధాని దేశంలో అనేక జాతీయ పార్కులు, మ్యూజిక్ కన్సర్ట్ ఆధారిత ఆర్థిక వ్యవస్థ, ఇతర ఆకర్షణీయ ప్రదేశాలు ఉన్నాయన్నారు.

# దిమాగీ నక్సల్స్‌తో జాగ్రత్త...

## యువతకు ప్రధాని మోడీ హెచ్చరిక

**న్యూఢిల్లీ, ఆగస్టు 15:** స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోట వేదికగా ప్రధాని నరేంద్ర మోడీజాతిని ఉద్దేశించి ప్రసంగిస్తూ దిమాగీ నక్సల్స్‌పై సంచలన వ్యాఖ్యలు చేశారు. అడవుల్లో ఆయుధాలు పట్టిన నక్సలిజాన్ని విజయవంతంగా నిర్మూలించామని, సాయుధ నక్సల్స్ కనుమరుగైనా దిమాగీ నక్సల్స్ మిగిలి ఉన్నారని ప్రధాని అన్నారు. దిమాగీ నక్సల్స్ ఒక అవకాశం కోసం ఎదురుచూస్తున్నారని, సమాజాన్ని తప్పుడు మార్గంలోకి లాగడానికి వారు కొత్త ఎత్తుగడలు వేస్తున్నారని ప్రధాని మోడీ తెలిపారు. మనం వారిని గుర్తించి ఏకాకిని చేయాలని మోడీ సూచించారు.

3,500 మందికి పైగా భద్రతా సిబ్బంది నక్సలిజం పోరాటంలో అమరులయ్యారని, ఇది యుద్ధాల్లో ప్రాణాలు కోల్పోయిన వారికంటే ఎక్కువని ఈ సందర్భంగా గుర్తుచేశారు. అలాగే ప్రస్తుతం దేశంలో జరుగుతోన్న జనగణన గురించి ప్రస్తావించారు. దానిలో యువత చురుగ్గా పాల్గొనాలని మోడీ పిలుపునిచ్చారు. నేను అందరినీ ఒక సాయం చేయాలని అడుగుతున్నాను. జనగణన విషయంలో ఒక గంటా, రెండు గంటల సమయం కేటాయించండి. అది దేశానికి ఎంతో ఉపయోగపడుతుంది. గణన అంటే లెక్కలన్నీ ఒక దగ్గర రాసుకోవడం కాదు. జనాభా లెక్కల సమయంలో మీరు ఇచ్చే వివరాల ఆధారంగానే జాతీయ విధానాలు, పథకాలు రూపుదిద్దుకుంటాయి.

దేశ ప్రగతికి ఆ లెక్కలు సూచీగా ఉంటాయి. అందుకే కచ్చితమైన, స్పష్టమైన సమాచారం ఇవ్వడం అత్యంత కీలకం అని మోడీ పేర్కొన్నారు. ఎర్రకోట వేదికగా ప్రధాని మోడీ యువతకు తీపి కబురు చెప్పారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థుల కోసం ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ సదుపాయాన్ని అందిస్తున్నట్లు ప్రకటించారు. గడిచిన కొన్నేళ్లలో దేశంలో 650కి పైగా కొత్త విశ్వవిద్యాలయాలను ఏర్పాటు చేశామని తెలిపారు. జాతీయ విద్యా విధానం ద్వారా విదేశీ విశ్వవిద్యాలయాలు కూడా భారత్‌లోకి వస్తున్నాయని, మన యువత స్వదేశంలోనే విదేశీ డిగ్రీలు పొందే అవకాశం లభించిందని ప్రధాని మోడీ పేర్కొన్నారు.



# యుద్ధ నౌకలతో హార్ముజ్‌ను స్వాధీనం చేసుకోలేరు

## ట్రంప్‌కు ఇరాన్ కౌంటర్

**టెహ్రాన్, ఆగస్టు 15:** హార్ముజ్ జలసంధిపై పూర్తి నియంత్రణ అమెరికాదేనని ట్రంప్ చేసిన వ్యాఖ్యలను ఇరాన్ ఖండించింది. జలసంధి ఎప్పటికీ తమ నియంత్రణలోనే ఉంటుందని.. దానిని ఎవరూ ఆక్రమించుకోలేరని పేర్కొంది. హార్ముజ్‌ను మూసి ఉంచాలా? తెరవాలా? అనేది తమ నిర్ణయంపై ఆధారపడి ఉంటుందని ఇరాన్ ఉప విదేశాంగ మంత్రి కాజెమ్ తెలిపారు. యుద్ధ నౌకల మోహరింపు ద్వారా జలసంధిని స్వాధీనం చేసుకోలేరని ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. అగ్రరాజ్యం తన భ్రమలను విడిచిపెట్టి.. ఓటమిని అంగీకరించే వరకు హార్ముజ్‌పై ఇరాన్ దిగ్బంధనాన్ని అమలు చేస్తూనే ఉంటుందని పేర్కొన్నారు. తాము బెదరింపులకు భయపడబోమని.. సైనిక ప్రదర్శనలకు లొంగబోమని స్పష్టం చేశారు. హార్ముజ్ ద్వారా నౌకలు స్వేచ్ఛగా ప్రయాణిస్తున్నాయని అమెరికా చెబుతున్న మాటల్లో నిజంలేదని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ పేర్కొన్నారు. గతంలో మాదిరిగానే.. జలసంధి పూర్తిగా తమ నియంత్రణలోనే ఉందన్నారు. తమ సాయుధ దళాల అనుమతి లేకుండా ఏ వాణిజ్య నౌక కూడా ఈ మార్గంలో ప్రయాణించబోదని స్పష్టం చేశారు. హార్ముజ్ విషయంలో అమెరికా తప్పుడు అంచనాలు వేస్తోందన్నారు.

**డొనాల్డ్ ట్రంప్ ఏమన్నారంటే..?**

యుద్ధంలో ఇరాన్‌ను ఓడిస్తామని.. ఆ దేశం ఓటమిని చవిచూసినతర్వాత హార్ముజ్‌ను అమెరికా భూభాగంగా ప్రకటిస్తామని శనివారం జరిగిన మీడియా సమావేశంలో ట్రంప్ పేర్కొన్నారు. ఆ దేశంవద్ద అణ్వాయుధ సామర్థ్యం ఉండడం ఎప్పటికైనా ప్రమాదమేనని.. దానిని నాశనం చేయాలనే లక్ష్యంతో యుద్ధానికిదిగినట్లు వెల్లడించారు.

# భారత్-అమెరికా సంబంధాలు మరింత బలోపేతం

## యుఎస్ విదేశాంగమంత్రి మార్కో రూబియో



**వాషింగ్టన్, ఆగస్టు 15:** భారత 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో శుభాకాంక్షలు తెలిపారు. భారత్-అమెరికా సంబంధాలు మునుపెన్నడూ లేనంత బలంగాఉన్నాయని పేర్కొన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ప్రధాని నరేంద్ర మోడీ మధ్య ఉన్న వ్యక్తిగత సాన్నిహిత్యమే ఇందుకు కారణమని చెప్పారు. రక్షణ, ఇంధన భద్రత, కీలక ఖనిజాలు, కృత్రిమ మేధ, అంతరిక్షం, వాణిజ్య రంగాల్లో ఇరు దేశాల సహకారం మరింత విస్తరిస్తోందని తెలిపారు. భారత్, అమెరికా ప్రజల మధ్య ఉన్న స్నేహం ద్వైపాక్షిక భాగస్వామ్యానికి పునాదిగా నిలుస్తోందని రూబియో పేర్కొన్నారు. ఈ భాగస్వామ్యం కేవలం రెండు దేశాల ప్రయోజనాలకే పరిమితం కాదని, అంతకు మించి విస్తరించి ఉందని స్పష్టం చేశారు. హిందూ మహాసముద్ర ప్రాంతంలో ఢిల్లీతో పరస్పర సహకారానికి వాషింగ్టన్ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. భవిష్యత్తులోనూ భారత్‌తో కలిసి పనిచేసేందుకు అమెరికా ఎదురుచూస్తోందని తెలిపారు. ఇజ్రాయెల్ అధ్యక్షుడు ఐజాక్ హెర్జోగ్.. భారత్‌కు, ప్రధాని నరేంద్ర మోడీకి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఇరు దేశాల మధ్య స్నేహ బంధం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. సింగపూర్ ప్రభుత్వం భారత్‌తో తమకున్న వ్యూహాత్మక, ఆర్థిక బంధాన్ని గుర్తుచేసుకుంటూ అభినందనలు తెలిపింది. ఈ సందర్భంగా ప్రత్యేక సందేశాన్ని విడుదల చేస్తూ.. ఇరు దేశాల మధ్య డిజిటల్ కనెక్టివిటీ, గ్రీన్ ఎనర్జీ, రక్షణ రంగాల్లో భాగస్వామ్యం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించింది.

# పోటీ పరీక్షార్థులకు ఆన్‌లైన్ ఉచిత కోచింగ్

## జనగణనలో అందరూ భాగస్వాములు కావాలి: ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, ఆగస్టు 15:** స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా దేశ రాజధాని ఢిల్లీలోని ఎర్రకోట వేదికగా ప్రసంగించిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దేశ యువతకు కీలక ప్రకటన చేశారు. దేశంలో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థుల కోసం ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ అందించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు ప్రకటించారు. కోచింగ్ సెంటర్లకు వెళ్లేందుకు మధ్యతరగతి, పేద కుటుంబాలు భారీగా ఖర్చు చేయాల్సి వస్తోందని పేర్కొన్న ప్రధాని మోడీ వారిపై ఆర్థిక భారం తగ్గించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా పలు పోటీ పరీక్షల కోచింగ్ కోసం కుటుంబాలు రూ.వేల కోట్లు ఖర్చు చేస్తున్నారని ఆ భారాన్ని తగ్గించాల్సిన అవసరం ఉందని గుర్తు చేశారు. చదువుల కోసం యువత వారి కుటుంబాలకు దూరంగా వెళ్లాల్సిన పరిస్థితి కూడా తగ్గాలని అభిప్రాయపడ్డారు. దేశంలో ఇప్పటికే ఉన్న డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను ఉపయోగించుకుని ఫ్రీ ఆన్‌లైన్ కోచింగ్ అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ముందుకు వస్తోందని ప్రధాని మోడీ చెప్పారు. ప్రతిభావంతులైన ఉపాధ్యాయులు, విద్యావేత్తల సేవలను ఈ ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ కోసం ఉపయోగించుకో నున్నట్లు తెలిపారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే యువతకు నాణ్యమైన విద్యా వనరులను అందుబాటులోకి తీసుకురావడమే ఈ నిర్ణయం ప్రధాన ఉద్దేశంగా ఆయన ప్రసంగంలో వివరించారు. ఇదే సమయంలో దేశవ్యాప్తంగా జరుగుతున్న జనగణనలో యువత చురుకుగా భాగస్వాములు కావాలని ప్రధాని మోడీ పిలుపునిచ్చారు.

## సిజెపి చీఫ్ ఇన్‌స్టాకు అంతరాయం..

# ఎగసిన దుమారం

**న్యూఢిల్లీ, ఆగస్టు 15:** కాక్రోచ్ జనతా పార్టీకి చెందిన ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ శనివారం కొద్దిసేపు నిలిచిపోయింది. ఈ విషయాన్ని సిజెపి ఫౌండర్ అభిజీత్ దీప్కే తన ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ ద్వారా వెల్లడించారు. సిజెపి ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ నిలిపివేయడాన్ని పిరికిపంద చర్యగా అభిజీత్ దీప్కే వర్ణించారు. అయితే, కొంతసేపటి తర్వాత అకౌంట్ తిరిగి ప్రారంభమైంది. ఈ అంశంపై దీప్కే స్పందించారు. సిజెపి అకౌంట్ నిలిచిపోవడానికి సంబంధించిన స్క్రీన్ షాట్లను సోషల్ మీడియాలో షేర్ చేసుకున్నారు. ఆయనతో పాటు సిజెపి తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం ఉదయం 6.16 గంటలకు సిజెపి ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ నిలిచిపోయింది. దీనిపై ఫిర్యాదు చేయడంతో 6.45 గంటలకు ఖాతా తిరిగి పునరుద్ధరించారు. భారత స్వాతంత్ర్య దినం రోజున తమ గొంతు నొక్కే ప్రయత్నం జరిగిందని, ఇలాంటి చర్యలకు తాము భయపడబోమని దీప్కే ప్రకటించారు. ఇది పిరికిపందలు చేసిన చర్యగా అభివర్ణించారు.

# మహిళను హత్యచేసి వన్యమృగాలకు ఆహారం

## ఏడువేల కిలోమీటర్లు ఛేదించి అరెస్టుచేసిన పోలీసులు

**జైపూర్, ఆగస్టు 15:** రాజస్థాన్‌లో షాబాజ్ అనే వ్యక్తి ముస్కాన్ అనే మహిళను హత్య చేసి ఆధారాలు దొరక్కుండా ఉండేందుకు ఆమె మృతదేహాన్ని అడవి మృగాలకు ఆహారంగా వేశాడు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగాఉన్న షాబాజ్ ఖాన్‌ను రాజస్థాన్ పోలీసులు సుమారు ఏడు వేల కిలోమీటర్లు వెంబడించి బీహార్‌లో అరెస్ట్ చేశారు. జూన్ 22న ముస్కాన్ దారుణహత్యకు గురైంది. షాబాజ్ ఖాన్,అతని సహచరుడుకలిసి ముస్కాన్‌ను రాంపుర కొండప్రాంతంలో హత్య చేశారు. అక్కడ ఆమె తలపై రాళ్లతో కొట్టి చంపారు. అనంతరం మృతదేహాన్ని క్రూర మృగాలు తినివేస్తే ఆనవాళ్లు కూడా మిగలవనే దురాలోచనతో సమీపంలోని ఒక జంతువుల గుహవద్ద పడేశారు. అయితే మృతదేహం పూర్తిగాధ్వంసం కాకముందే పోలీసులుదానిని స్వాధీనంచేసుకున్నారు. అప్పటికే మిస్సింగ్‌కేసు పెట్టిన కుటుంబసభ్యులు అది ముస్కాన్ మృతదేహంగా నిర్ధారించారు.

# ఎర్రకోటవద్ద వందేమాతరం ఆలాపన చరిత్రాత్మకం



**న్యూఢిల్లీ, ఆగస్టు 11:** చరిత్రాత్మక ఘటన చోటుచేసుకున్నది. వందేమాతరం గేయాన్ని ఎర్రకోట వద్ద ఆలపించారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా శనివారంపూర్తి స్థాయిలో ఆ గీతాన్ని పాడారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఆ గేయాన్ని పాడడం ఇదే మొదటిసారి. వందేమాతరం గీతాన్ని రాసి 150 యేళ్ల పూర్తి అవుతోంది. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో ఈ గేయం కీలక పాత్ర పోషించింది. దేశ ప్రజల్లో ఆ పాట జాగృతి నింపింది. ప్రధాని మోడీ జాతీయ పతాకాన్ని ఎగురవేసిన తర్వాత ఎర్రకోటపై వందేమాతర గీతం ప్రతిధ్వనించింది. తొలుత 21 గన్ సెల్యూట్ చేశారు. 1721 ఫీల్డ్ బ్యాటరీ సెర్మోనియల్ గ్రూపు ఈ సెల్యూట్ నిర్వహించారు. 105 ఎంఎం లైట్ ఫీల్డ్ గన్స్ వాడారు. ఆర్మీ బ్యాండ్ ద్వారా వందేమాతరాన్ని ఆలపించారు. ఎర్రకోట వేదికపై రెండు ఎంఐ17 హెలికాప్టర్లు పూలవర్షం కురిపించాయి. ఓ హెలికాప్టర్ జాతీయ పతాకాన్ని మోసుకెళ్లింది. మరో హెలికాప్టర్ వందేమాతరం గీతం రాసిన జెండాను తీసుకెళ్లింది. దేశానికి స్వాతంత్రం వచ్చిన తర్వాత మొదటిసారి వందేమాతరం గీతాన్ని ఎర్రకోట వద్ద ఆలపించారు.

# మోడీ హాగ్ సెటైర్లకు బిజెపి కౌంటర్



**న్యూఢిల్లీ, ఆగస్టు 15:** రాహుల్ గాంధీ బిజెపి ప్రభుత్వ విదేశాంగ విధానాన్ని విమర్శించే క్రమంలో, ప్రధాని నరేంద్రమోడీ విదేశాధినేతల్ని ఆలింగనం చేసుకోవడంపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. విదేశీ నేతల్ని కౌగిలించుకోవడం ఎలాంటి విదేశాంగ విధానం అని ప్రశ్నించారు. ఇదే సమయంలో కాంగ్రెస్ నేత సందీప్ దీక్షిత్‌ను కౌగిలించుకుని, ఇటలీ ప్రధాని జార్జియా మెలోనిని ప్రస్తావిస్తూ అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యల వ్యవహారం తిరిగి కాంగ్రెస్‌కే ఎదురుదెబ్బగా మారింది. బిజెపి నేతలు ఇందిరాగాంధీ గతంలో విదేశీ నేతల్ని ఆలింగనం చేసుకున్న ఫోటోలను షేర్ చేస్తున్నారు. తాజాగా బిజెపి ఎంపీ నిషికాంత్ దూబే తన ఎక్స్ అకౌంట్లో నెహ్రూకు సంబంధించిన పలు పాత ఫోటోలను పోస్ట్‌చేశారు. నా లైబ్రరీలోని నెహ్రూగాంధీ కుటుంబానికి సంబంధించిన ఓ పుస్తకంలోని కొన్ని అయితే, దూబే వీటిని నెహ్రూ కిస్ ఫోటోలని నేరుగా పేర్కొనకపోయినప్పటికీ, నెహ్రూ మహిళలతో సన్నిహితంగా ఉన్నట్లు చూపించే ఉద్దేశంతోనే వాటిని పోస్ట్ చేసినట్లు కాంగ్రెస్ ఆరోపిస్తోంది. దీనిపై కాంగ్రెస్ ప్రతినిధి సుప్రియా శ్రీనేత్ స్పందిస్తూ నెహ్రూ ఫోటోలు అసలు సందర్భం నుంచి విడదీసి తప్పుగా ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఒక ఫోటోలో నెహ్రూ సోదరి విజయలక్ష్మి పండిట్ ఆయన చెంపపై ముద్దు పెడుతున్నారని, మరో ఫోటోలో ఆయన మేనకోడలు నయనతార సహగల్ ఉన్నారని ఆమె వివరించారు. 1962 మార్చిలో తీసిన మరో ఫోటోలో హోలీ సందర్భంగా జాక్వెలిన్ కెన్నెడీకి నెహ్రూ రంగులు పూస్తున్నట్లు ఉందని సుప్రియా శ్రీనేత్ తెలిపారు. క్రియేటివ్ కాంగ్రెస్ కార్య క్రమంలో రాహుల్ గాంధీ, సందీప్ దీక్షిత్‌లు ఆలింగనం చేసుకుని ప్రధాని మోడీపై వ్యంగ్యంగా స్పందించారు.

ఈ సమయంలోనే సందీప్ దీక్షిత్, రాహుల్ గాంధీతో నన్ను మెలోనీ అనుకోలేదుగా? అని ప్రశ్నించగా, రాహుల్‌గాంధీ నేను ఇంకా ఆ స్థాయికి చేరుకోలేదని బదులిచ్చారు. దీని తర్వాత బిజెపి ఇందిరా గాంధీఫిడెల్ కాస్ట్రో, ఇందిరా గాంధీయాసర్ అరాఫత్ ఫోటోలను కూడా షేర్ చేసింది. నెహ్రూ తన సోదరి విజయలక్ష్మి పండిట్, మేనకోడలు నయనతార సహగల్, అమెరికా మాజీ ప్రథమ మహిళ జాక్వెలిన్ కెన్నెడీతో ఉన్న చిత్రాలు ఉన్నాయి.

# ప్రధానిమోడీ ఐర్లాండ్ పతాకం ధరించారంటూ కాంగ్రెస్ సెటైర్లు



**న్యూఢిల్లీ, ఆగస్టు 15:** దేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ ధరించిన దుస్తులు ఇప్పుడు రాజకీయ దుమారానికి దారితీశాయి. ప్రతి సంవత్సరం ఆగస్టు 15వ తేదీన ఎర్రకోటపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసే సమయంలో ఆయన ధరించే ప్రత్యేక శైలితో కూడుకున్న దుస్తులు, వైవిధ్యంగా కనిపించే తలపాగాలు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమోతుంటాయి. ఈసారి మాత్రం దీనికి భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. ప్రధాని మోడీ ధరించిన జాకెట్‌పై అలంకరించిన పాకెట్ స్క్వేర్స్‌లో కనిపించిన జాతీయ పతాకం అమరిక ఇప్పుడు తీవ్ర వివాదానికి కేంద్రబిందువు అయింది. ప్రధాని మోడీ జాతీయజెండాను తలకిందులుగా అమర్చుకున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనికి ఈ వ్యవహారంపై కాంగ్రెస్ పార్టీ ఘాటు విమర్శలు గుప్పించింది. ఈ విమర్శలకు మరింత ఆజ్యం పోసింది. స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగం కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తెలుపు రంగు కుర్తాపైజామాతో పాటు చాక్లెట్ బ్రౌన్ కలర్ స్లీవ్‌లెస్ జాకెట్, సాంప్రదాయ తలపాగాలను ధరించారు. ఈ జాకెట్‌పై ఆకుపచ్చ, తెలుపు, కాషాయం రంగులలో ఉన్న మూడు జేబు రుమాళ్లను అమర్చారు. సాధారణంగా భారత జాతీయ జెండా పైభాగంలో కాషాయం, మధ్యలో తెలుపు, దిగువన ఆకుపచ్చ రంగులు ఉంటాయి. దీనికి భిన్నంగా మొదట ఆకుపచ్చ రంగు, ఆ తర్వాత తెలుపు, చివర్లో కాషాయ రంగుతో తలకిందులుగా కనిపించింది. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధి, రాజ్యసభ సభ్యుడు పవన్‌ఖేరా. ఆయన వేసుకున్న పాకెట్ స్క్వేర్ రంగులు, దాని అమరికను తప్పుపట్టారు. ప్రధాని మోడీ మన దేశ మువ్వన్నెల పతాకాన్నికాకుండా ఐర్లాండ్ జాతీయ పతాకాన్ని ధరించారని ఆరోపించారు. ప్రధాని మోడీధరించిన జాతీయ పతాకం కూడా కుడి నుంచి ఎడమవైపుగా అమర్చినట్లు ఉందని పవన్ ఖేరా సెటైర్లు వేశారు. పైగా అది ఐర్లాండ్ జాతీయ పతాకాన్ని పోలిఉందని, ప్రధాని మోడీ ఆ దేశ స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకొంటున్నట్లుగా అనిపిస్తోందని తన అధికారిక ఎక్స్ అకౌంట్‌లో సెటైర్లు వేశారు.

# భారీ వర్షాలకు ఈశాన్య అరుణాచల్ అతలాకుతలం

**ఇటానగర్, ఆగస్టు 15:** అరుణాచల్‌ప్రదేశ్ రాష్ట్రంలో భారీ వర్షాల వల్ల సంభవించిన వరదల కారణంగా కొండచరియలు విరిగిపడ్డాయి. వేర్వేరుగా జరిగిన ఈ ఘటనల్లో నలుగురు చనిపోగా, ఐదుగురు సైనికులు గల్లంతయ్యారు. ఆ రాష్ట్రంలోని అప్పర్‌సుబన్‌సిరి జిల్లాలోని కియోజరింగ్‌బయాచింగ్ రోడ్డు మలుపు ప్రాంతం, దిబంగ్ లోయ జిల్లాలో ఈ ఘటనలు జరిగాయి. పసుపానీ ఆర్మీ క్యాంపులోని రెండు షెల్టర్లు కొట్టుకుపోయాయి. ఐదో గ్రెనేడియర్‌కు చెందిన ఏడుగురు జవాన్లు కొట్టుకుపోయారు. ఇద్దరిని రక్షించగా, ఐదుగురు గల్లంతయ్యారు. గల్లంతైనవారిని హవల్దార్ ఉపేందర్, ఆర్మీ సిబ్బంది కుందన్, వినోద్, ఆదిత్య, సముందగా గుర్తించారు. ఐదో గ్రెనేడియర్, ఇండోటిబెటన్ బోర్డర్ పోలీస్ 58వ బెటాలియన్, జనరల్ రిజర్వ్ ఇంజినీర్ ఫోర్స్‌కు చెందిన ఆర్‌సిసి, అరుణాచల్‌ప్రదేశ్ పోలీసులు, వలంటీర్లు సహాయక చర్యలు చేపట్టారు. అప్పర్‌సుబన్‌సిరి ప్రాంతంలో విరిగిపడిన కొండచరియల శిథిలాల కింద పలువురు కూరుకుపోయారు. టాడు బాకి, తాజి రాయ్, మర్కోష్ బసుమతారి, బాబుల్ అలీ మృతదేహాలను వెలికితీసినట్లు అధికారులు వెల్లడించారు.

# సంక్షిప్త వార్తలు

## నేడు ప్రత్యేక పూజలకోసం తెరుచుకోనున్న శబరిమలై



**పతనంతిట్ట, ఆగస్టు 15:** శబరిమల అయ్యప్ప ఆలయం ఆదివారంనుంచి తెరుచుకోనుంది. చింగం మాసం పూజల కోసం ఈ ఆలయాన్ని తెరుస్తున్నట్లు ట్రావన్‌కోర్‌దేవస్వోమ్ బోర్డు వెల్లడించింది. సాయంత్రం ఐదు గంటలకు ఆలయ ప్రధాని పూజారి ఆలయ తలుపులను తెరుస్తారు. తరువాత ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. 17వ తేదీ ఉదయం ఐదు గంటల నుంచి భక్తులకు దర్శనం అవకాశం కల్పించనున్నారు. ప్రసిద్ధి చెందిన శబరిమల ధర్మశాస్త్ర అయ్యప్ప ఆలయం ఆదివారం సాయంత్రం సరిగ్గా 5 గంటలకు తెరుచుకోనుంది.

## ఉగ్ర సంస్థలతో లింకులు: బెంగళూరులో ఒకరి అరెస్టు

**బెంగళూరు, ఆగస్టు 15:** అఫ్ఘానిస్థాన్ కేంద్రంగా నడుస్తోన్న ఉగ్రమూతాతో సంబంధం ఉన్న అసఫూల్ మాలిక్ అనే యువకుడిని బెంగళూరు పోలీసులు అరెస్టు చేశారు. తెహ్రీక్-ఎ-తాలిబన్ పాకిస్థాన్ (టిటిపి) సభ్యుడితో కలిసి, ఆ సంస్థలో చేరడానికి ప్రయత్నిస్తున్నట్లు గుర్తించారు. అనుమానాస్పద ఆన్‌లైన్ కార్యకలాపాలపై సమాచారం అందడంతో అతడిని అరెస్టు చేసినట్లు తెలిపారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన అసఫూల్ మాలిక్ బెంగళూరులో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. అతడిని అదుపులోకి తీసుకొని విచారించగా ఉగ్రవాద సంస్థలతో లింకులు బయటపడ్డాయి.

## విద్యుత్ తీగ తగిలి కరెంట్‌షాక్, టీచర్ మృతి

**భువనేశ్వర్, ఆగస్టు 15:** ఒక స్కూల్‌లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్ల సమయంలో విషాద సంఘటన జరిగింది. జెండా ఆవిష్కరణకు సంబంధించిన ఐరన్ పోల్‌కు విద్యుత్ వైర్ తగిలింది. దీంతో కరెంట్ షాక్‌తో టీచర్ మరణించగా, ముగ్గురు విద్యార్థులు గాయపడ్డారు. ఒడిశాలోని బాలాసోర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. జెండా ఆవిష్కరణ స్టాండ్‌కు ఐరన్ పైపు అమర్చడానికి వారు ప్రయత్నిస్తున్నప్పుడు అనుకోకుండా పైనుంచి వెళ్తున్న విద్యుత్ లైన్‌కు అది తగిలింది. ఈ నేపథ్యంలో ఆ టీచర్, ముగ్గురు విద్యార్థులు విద్యుతాఘాతానికి గురయ్యారు.

## విద్యావ్యవస్థ లోపాలే నిరసనలకు కారణం: బాబారామ్‌దేవ్

**హారిద్వార్, ఆగస్టు 15:** విద్యార్థుల నిరసనలు, ప్రభుత్వ ఉద్యోగాల నియామక ప్రక్రియపై యోగా గురువు రామ్‌దేవ్ బాబా సంచలన వ్యాఖ్యలు చేశారు. దేశవ్యాప్తంగా పెరుగుతోన్న నిరసనలు, గందరగోళం లాంటివి విద్య, ఉపాధి వ్యవస్థల్లో ఉన్న తీవ్రమైన లోపాలను సూచిస్తున్నాయని అన్నారు. పతంజలి యోగపీఠంలో నిర్వహించిన స్వాతంత్ర్య వేడుకల్లో భాగంగా రామ్‌దేవ్ మాట్లాడారు. పాఠశాలలు, కళాశాలల్లో ఇప్పటికీ కనీస సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థులు వీధుల్లోకి వస్తున్నారని బాబా రాందేవ్ అన్నారు.

## మద్యం కొన్నా, అమ్మినా 5 వేలు ఫైన్

**చెన్నై, ఆగస్టు 15:** దేశవ్యాప్తంగా యువతను యుతను పట్టిపీడిస్తున్న డ్రగ్స్,మద్యం అలవాట్లను కట్టడిచేసేందుకు తమిళనాడులోని ఓ గ్రామం అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది. విజుంతమావడి గ్రామం తీసుకున్న నిర్ణయం దేశ ప్రజల ప్రశంసలు అందుకుంటోంది. తమిళనాడులోని విజుంతమావడి గ్రామంలో పెళ్లి కాని యువకులకు మద్యం విక్రయించడాన్ని నిషేధించారు అక్కడి పెద్దలు. ఈ రూల్స్‌ను అతిక్రమిస్తే రూ.ఐదువేల జరిమానా విధించనున్నట్లు తెలిపారు.

## కాశ్మీర్ ప్రజలు తిరుగాబుటు చేసేవారు: సిఎం ఒమర్

**శ్రీనగర్, ఆగస్టు15:** జమ్ముకశ్మీర్ సిఎం ఒమర్ అబ్దుల్లా మాట్లాడుతూ ప్రత్యేక హోదాను రద్దు చేయకపోవడం, రాష్ట్ర హోదాను కేంద్రం తొలగించకపోయి ఉంటే పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పిఒకె) ప్రజలు జమ్ముకశ్మీర్‌లో విలీనం కావడానికి తిరుగుబాటు చేసేవారని అన్నారు. శనివారం శ్రీనగర్‌లో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమంలో ఒమర్ అబ్దుల్లా మాట్లాడారు. 1947లో పాకిస్థాన్ నుంచి దండెత్తి వచ్చిన గిరిజన దుండగులకు వ్యతిరేకంగా పోరాడి, భారతదేశంలో భాగం కావాలని ఎంచుకున్న కశ్మీర్ ప్రజల నిర్ణయాన్ని పిఒకెలోని ప్రస్తుత పరిస్థితులు సమర్థిస్తున్నాయని తెలిపారు.

# దేశ ఉజ్వల భవిష్యత్ నిర్దేశకులు విద్యార్థులే



## జెన్‌జి చరిత్రపై అవగాహన పెంచుకోవాలి

## పిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, ఆగస్టు 15, ప్రభాతవార్త:** ప్రశ్నించే హక్కు, స్వేచ్ఛ ఉంటే అది రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్య విలువలను కాపాడుతోందననీ అదే నిజమైన స్వా తంత్ర్యమనీ పిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. శనివారం గాంధీ భవన్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహేశ్‌కుమార్‌గౌడ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి దేశ ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం లో ఎఐసిసి కార్యదర్శి సచిన్ సావంత్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్పొరేషన్ చైర్మన్లు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జనరల్ సెక్రటరీలు తది తరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేశ్‌కుమా౦ గౌడ్ మాట్లాడుతూ దేశ ఉజ్వల భవిష్యత్ నిర్దేశకులు విద్యా ర్థులు నవసమాజ నిర్మాణం కోసం వారు చేసే పోరాటల పటిమ నుంచి దేశానికి కొత్త నాయకత్వం పుట్టు కొస్తోందని అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం దేశంలోనే గొప్ప పండగ అని, కుల మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ జరుపుకునే జాతీయ పండగని చెప్పారు. ఎందరో మహనీయుల త్యాగాల ఫలితంగానే దేశానికి స్వాతంత్ర్యం లభించిందని తెలిపారు. మహాత్మా గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్, నేతాజీ సుభాష్ చంద్రబోస్ వంటి మహనీయుల స్పూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. దేశ చరిత్రను యువత సమగ్రంగా అధ్యయనం చేయాలని, ముఖ్యంగా నేటి జెన్ జీ తరం చరిత్రపై అవగాహన పెంచుకోవాలని హితవు చెప్పారు. కుల, మతాల పేరుతో జరుగుతున్న చిచ్చు నుంచి దేశాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. ప్రశ్నించే హక్కు, ప్రశ్నించే స్వేచ్ఛ ఉన్నప్పుడే నిజమైన స్వాతంత్ర్యం సాకారమవుతుందని వివరించారు. రాజ్యాంగాన్ని గౌరవిస్తూ ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. పరిపాలన కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతమైతే ప్రజాస్వామ్యం పరిఢవిల్లదని ఆయన అన్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారిపై తీవ్రవాదులుగా ముద్ర వేయడం సరైన విధానం కాదని విమర్శించారు. బిజెపి నియంతృత్వ వైఖరిని ప్రతి పౌరుడు ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర దేశాన్ని సమగ్రంగా అర్థం చేసుకునే అవకాశం కల్పించిందని మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. జోడో యాత్ర స్పూర్తితో తెలంగాణలో కులగణన సర్వే నిర్వహించామని తెలిపారు. రాష్ట్రంలో గత ప్రభుత్వ హయాంలో పేరుకుపోయిన అప్పులపై ప్రజలకు వాస్తవాలు తెలియాల్సిన అవసరం ఉందని, సుమారు రూ.8 లక్షల కోట్ల అప్పుల అంశాన్ని ప్రజలు తెలుసుకోవాలని అన్నారు. వాస్తవాలకు దూరంగా సోషల్ మీడియాలో జరుగుతున్న విషప్రచారాన్ని అరికట్టాలని, యువత నిజానిజాలను తెలుసుకుని చైతన్యవంతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రశ్నపత్రాల లీకేజీలకు ఎవరు బాధ్యులనే అంశంపై సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో సోనియా గాంధీ, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, మాజీ లోక్‌సభ స్పీకర్ మీరా కుమార్ వంటి నాయకుల పాత్రను గుర్తు చేశారు. తెలంగాణలో అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు దేశం ఆశ్చర్యపోయేలా ఉన్నాయని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. ముఖ్యంగా పేదలకు సన్నబియ్యం అందిస్తున్నామని, తెలంగాణలో అమలవుతున్న అనేక సంక్షేమ కార్యక్రమాలు దేశ వ్యాప్తంగా ఆదర్శంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం త్యాగాలు చేసిన మహనీయుల ఆశయాలను కొనసాగిస్తూ రాజ్యాంగ పరిరక్షణ, ప్రజాస్వామ్య బలోపేతం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.



## అసెంబ్లీ, మండలి ఆవరణల్లో స్వాతంత్ర్య వేడుకలు

### జాతీయ జెండాలను ఆవిష్కరించిన అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 15:** దేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శాసనసభ ప్రాంగణంలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా శాసన సభ్యులు, శాసనమండలి సభ్యులు, కౌన్సిల్ సెక్రటరీ డా. వి నరసింహా చార్యులు, అసెంబ్లీ సెక్రటరీ రేండ్ల తిరుపతి, అధికారులు, సిబ్బంది పాల్గొ న్నారు. దేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా తెలంగాణ శాసన మండలిలో జాతీయ పతాకాన్ని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు కోదండరాం, విజయశాంతి, శ్రీపాల్‌రెడ్డి, వాణిదేవి, శాసనమండలి సెక్రెటరీ నరసింహాచార్యులు తదితరులు పాల్గొన్నారు స్పీకర్, చైర్మన్ ముందుగా రాజ్యాంగ నిర్మాత డా. బిఆర్ అంబేద్కర్, జాతిపిత మహాత్మాగాంధీ, తెలంగాణ తల్లి విగ్రహాలకు పూలమాలలు వేశారు.

## జాతీయ జెండాను ఆవిష్కరించిన సిఎస్ సంజయ్‌జాజు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 15:** దేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా డా.బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్‌జాజు జాతీయ జెండాను ఎగరవేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్య దర్శులు, కార్యదర్శులు, సచివాలయ అధికారులు ఉద్యోగులు హాజరయ్యారు.

## కేంద్రం కులగణన నిర్ణయం చరిత్రాత్మకం

### 18 బిసి సంఘాల హర్షం

**హైదరాబాద్, ఆగస్టు 15, ప్రభాతవార్త:** కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం రాబోయే జనగణనలో కులగణన కూడా చేపడతామని స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేయడం పట్ల 18 బీసీ సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. శనివారం బీసీ సంక్షేమ సంఘం జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ర్యాగ అరుణ్‌కుమార్ అధ్యక్షతన 18 బీసీ సంఘాల ప్రతినిధుల కీలకసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి సంఘాల ప్రతినిధులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ 1931లో బ్రిటీష్ పాలన తర్వాత దేశ చరిత్రలోనే తొలిసారిగా ఒక ప్రభుత్వం ధైర్యమైన నిర్ణయం తీసుకుని కుల గణన చేపడుతోందని నాయకులు ప్రశంసించారు. ఈ నిర్ణయంతో ప్రధాని మోడీ చరిత్రలో నిలిచిపోతారన్నారు. కులగణన పూర్తయితే 75 కోట్లకు పైగా ఉన్న బీసీలకు ఆర్థిక, రాజకీయ, సామాజిక, విద్యా, ఉద్యోగ రంగాల్లో జనాభా నిష్పత్తికి అనుగుణంగా న్యాయ మైన వాటా లభిస్తుందని పేర్కొ న్నారు. జాతీయ బిసి కమిషన్‌కు రాజ్యాంగ హోదా కల్పించడం, విశ్వకర్మ యోజన ద్వారా వృత్తి కులాలకు రుణ సదు పాయం అందించడం, కీలక రాజ్యాంగ పదవుల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు ప్రాధాన్యం ఇవ్వడం మోడీ ప్రభుత్వానికే చెల్లిందని స్పష్టం చేశారు.



గౌవరవందనం స్వీకరిస్తున్న జీఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ

## దక్షిణ మధ్యరైల్వే ఆధ్వర్యంలో ఘనంగా 80వ స్వాతంత్ర్య వేడుకలు

**హైదరాబాద్ (తార్నాక), ఆగస్టు 15, ప్రభాతవార్త :** దక్షిణ మధ్య రైల్వే ఆధ్వ ర్యంలో 80వ స్వాతంత్ర్య వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ జాతీయ జెండాను ఎగురవేసి ఆర్‌పీఎఫ్ గౌరవవందనం స్వీకరించారు. అదనపు జనరల్ మేనేజర్ సత్య ప్రకాశ్, ఐజీ, ప్రిన్సిపల్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్ అరోమా సింగ్ ఠాకూర్, అధికారులు, సిబ్బంది, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. విద్యార్థుల సాం స్కృతిక కార్యక్రమాలతో పాటు ఆర్‌పీఎఫ్ కమాండో, డాగ్‌షోలు ఆకట్టుకు న్నాయి. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ దేశాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి నాలుగు నెలల్లో దక్షిణ మధ్య రైల్వే రూ.4,060.57 కోట్ల స్థూల ఆదాయం సాధిం చిందన్నారు. 30.593 మిలియన్ టన్నుల సరుకు రవాణా చేసినట్లు తెలి పారు. భద్రతకు ప్రాధాన్యమిస్తూ 135.22 కిలోమీటర్ల ట్రాక్ పునరుద్ధరణ, 20 రోడ్డు అండర్ బ్రిడ్జిల నిర్మాణం పూర్తిచేశామన్నారు. కాజీపేట-బల్హార్షా ట్రిప్లింగ్ ప్రాజెక్టు పూర్తయిందని, కొత్త రైలు సర్వీసులు, ప్రత్యేక రైళ్లతో ప్రయాణికుల అవసరాలను తీర్చుతున్నామని తెలిపారు. సౌరవిద్యుత్ సామర్థ్యాన్ని 13.34 మెగావాట్లకు పెంచినట్లు వెల్లడించారు. రైల్వే సిబ్బంది, కుటుంబ సభ్యుల సమష్టికృషితో మరింత అభివృద్ధి సాధిస్తామని జీఎం పేర్కొన్నారు.

## పలు జిల్లాల్లో చెదురుమదురు వర్షాలు

**హైదరాబాద్, ఆగస్టు 15, ప్రభాతవార్త :** తెలంగాణకు భారత వాతావరణ శాఖ మరోసారి వర్షసూచనలు జారీ చేసింది. బంగాళాఖాతంలో ఏర్పడిన ఆవర్తనం కారణంగా రాష్ట్రంలో వర్షాలు కురిసే అవకాశం ఉందని స్పష్టం చేసింది. ప్రస్తుతం వాయవ్య బంగాళాఖాతంలో సముద్ర మట్టానికి 5.8 నుంచి 7.6 కిలోమీటర్ల ఎత్తులో ఒక ఉపరితల ఆవర్తనం కేంద్రీకృతమై ఉందని దీని ప్రభావంతో రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో చెదురుమదురు నుండి ఒక మోస్తరు వర్షాలు కురవనున్నాయి. వాతావరణ కేంద్రం వెల్లడించిన వివరాలు ప్రకారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, సిరిసిల్ల, సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్, వికారాబాద్, మహబూబ్ నగర్, వనపర్తి, గద్వాల్, నాగర్ కర్నూల్, ఖమ్మం, సూర్యాపేట సహా తెలంగాణలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. భూపాలపల్లి, మంచి ర్యాల, ఆసిఫాబాద్, ములుగు, కొత్తగూడెం జిల్లాల్లో అర్ధరాత్రి సమయంలో మరియు మరుసటి రోజు తెల్లవారుజామున చెదురుమదురుగా తేలికపాటి నుండి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది. తెలంగాణలోని ఇతర జిల్లాల్లో కూడా అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉంది. హైదరాబాద్‌లో మధ్యాహ్నం వరకు పొడి వాతావరణం ఉండే అవకాశం ఉండగా, మధ్యాహ్నం తర్వాత నుండి రాత్రి వరకు కొన్ని ప్రాంతాల్లో స్వల్పంగా వర్షంకురిసే అవకాశం ఉంది. కాగా రాష్ట్రంలో గడచిన 24 గంట ల్లో పలు జిల్లాల్లో చిరు జల్లుల నుండి స్వల్ప వర్షాలు పడ్డాయి. కామారెడ్డి జిల్లాలో 10.1 మిల్లీమీటర్లు, మంచిర్యాలలో 6.5 మిల్లీమీటర్లు, సిద్దిపేట్‌లో 5 మిల్లీ మీటర్లు, ములుగులో 3.6 మిల్లీమీటర్లు, భూపాలపల్లిలో 3.2 మిల్లీమీటర్లు, నిజామాబాద్‌లో 2.6 మిల్లీమీటర్లు, జగిత్యాలలో 2.8 మిల్లీమీటర్లు, మహబూబాబాద్‌లో 2.8 మిల్లీమీటర్లు, కొత్తగూడెంలో 3.4 మిల్లీమీటర్లు, వరంగల్ జిల్లాలో 2.5 మిల్లీమీటర్ల వర్షపాతం రికార్డయింది.

## వికసిత్ భారత్ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలి

### ఆరోగ్యకర, ఆత్మనిర్భర తెలంగాణ నిర్మాణానికి కృషి చేయాలి

### లోక్‌భవన్‌లో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవం

### జాతీయ జెండాను ఆవిష్కరించిన గవర్నర్ శివప్రతాప్‌శుక్లా

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 15:** వికసిత్ భారత్ నిర్మా ణంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలనీ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా పిలుపునిచ్చారు. శనివారం లోక్ భవన్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవం ఘనంగా జరిగింది. పోలీసులు గౌరవ వందనం స్వీకరించిన తర్వాత రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా జాతీయ పతకాన్ని ఆవిష్కరించారు. గవర్నర్ సతీమణి జానకి శుక్లా, గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం దాన కిషోర్, సంయుక్త కార్యదర్శి కె శశికిరాణాచారి, లోక్ భవన్ అధికారులు, ఉద్యోగులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గవర్నర్ శివప్రతాప్ శుక్లా రాష్ట్ర ప్రజలకు, దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలి పారు. గవర్నర్ శివప్రతాప్ శుక్లా ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ సందేశాన్ని ఇచ్చారు. స్వాతంత్రం కోసం ప్రాణత్యాగం చేసిన వీరులను స్మరించుకుంటూ వారి త్యాగం, ధైర్యం, దేశభక్తి స్ఫూర్తితో అభివృద్ధి చెందిన, ఆత్మనిర్భరమైన భారత నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య సమరయోధులు, జాతీయ నాయకుల అపార త్యాగాల ఫలి తంగానే దేశానికి స్వాతంత్రం లభించిందన్నారు. భిన్నత్వంలో ఏకత్వమే భారతదేశ బలమని, ఈ విలువలతో ప్రపంచానికి భారత్ మార్గదర్శకంగా నిలుస్తోంద న్నారు. భారత్ అతిపెద్ద ప్రజాస్వామ్యదేశంగా కొనసాగుతూ ప్రపం చంలోని మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగే దిశగా వేగంగా ముందుకు సాగుతోందని గవర్నర్ పేర్కొన్నారు. వికసిత్ భారత్ లక్ష్య సాధనకు దేశం ఆత్మవిశ్వాసంతో పయనిస్తోందన్నారు.



శనివారం లోక్‌భవన్‌లో గవర్నర్ శివప్రతాప్‌శుక్లా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన దృశ్యం

**తెలంగాణ కీలక వృద్ధి కేంద్రం..**

దేశ అభివృద్ధి ప్రస్థానంలో తెలంగాణ కీలక గ్రోత్ ఇంజిన్‌గా ఎదిగిందని గవర్నర్ తెలిపారు. హైదరాబాద్ దేశంలోని ప్రముఖ వృద్ధి కేంద్రాల్లో ఒకటిగా బలమైన స్థానాన్ని సంపాదించుకుందని పేర్కొన్నారు. దేశంలోనే యువ రాష్ట్రంగా ఉన్నప్పటికీ తెలంగాణ తక్కువ కాలంలో ప్రత్యేక గుర్తింపు సాధించిందన్నారు. సాగునీటి ప్రాజెక్టుల ద్వారా వ్యవసాయ రంగంలో వచ్చిన మార్పులతోపాటు ఐటీ, కృత్రిమ మేధస్సు, ఫార్మాస్యూటికల్స్, బయో టెక్నాలజీ రంగాల్లో హైదరాబాద్ విస్తరిస్తోందన్నారు. ఆవిష్కరణలు, సాంకేతికత, అభివృద్ధిలో తెలంగాణ ప్రపంచస్థాయి కేంద్రంగా ఎదుగుతోందని చెప్పారు. టీబీ, మాదకద్రవ్యాలపై ప్రజా ఉద్యమం అవసరం. ఆర్థిక, సాంకేతిక అభివృద్ధితోపాటు సమాజ ఆరోగ్యం, యువత సాధికారతకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని గవర్నర్ అన్నారు. టీబీ ముక్త్ భారత్, నశా ముక్త్ భారత్ వంటి జాతీయ కార్యక్రమాలను తెలంగాణలో విస్తృత ప్రజా ఉద్యమాలుగా తీర్చిదిద్దడం తన ప్రత్యేక ప్రాధాన్యాల్లో ఒకటని తెలిపారు. యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడటంతోపాటు టీబీ వంటి వ్యాధులను పూర్తిగా నిర్మూలించేందుకు ప్రజలు, సంస్థలు, యువత పెద్దఎత్తున భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

**జవాన్ల త్యాగాలను కొనియాడిన గవర్నర్..**

దేశ భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం ఉందని పేర్కొన్నారు. దేశ సరిహద్దుల్లో నిరంతరం విధులు నిర్వహిస్తున్న సాయుధ దళాలు, భద్రతా బలగాల వీరత్వాన్ని గవర్నర్ ఈ సందర్భంగా కొనియాడారు. వారి అప్రమత్తత, త్యాగాల వల్లే దేశం అభివృద్ధి పథంలో నిర్భయంగా ముందుకు సాగుతోందన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా త్రివర్ణ పతాకం సాక్షిగా దేశాన్ని అభివృద్ధి చెందిన, ఆరోగ్యకరమైన, ఆత్మనిర్భరమైన, సమృద్ధి చెందిన దేశంగా తీర్చి దిద్దేందుకు ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని గవర్నర్ పిలుపునిచ్చారు.

## దేశప్రజలకు విద్య, వైద్యం ఇప్పటికీ అందడం లేదు

### పౌరులను అక్షరాస్యులను చేయడంలో ప్రభుత్వాలు విఫలం : సిపిఎం జాన్‌వెస్లీ

**హైదరాబాద్, ఆగస్టు 15, ప్రభాతవార్త:** దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 80 సంవత్స రాలు గడుస్తున్నా ఇప్పటికీ దేశ ప్రజలకు విద్యా, వైద్యం ఉచితంగా అందకపోవడం దారుణమని సీపీఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ఆవేదన వ్యక్తం చేశారు. దేశ ప్రజలను అక్షరాస్యులను చేయడంలో ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని మండిపడ్డారు. శనివారం హైదరాబాద్‌లోని ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని సీపీఎం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జాన్‌వెస్లీ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ .. బ్రిటీష్ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా చేసిన పోరాట ఫలితంగానే దేశానికి స్వాతంత్రం వచ్చిందన్నారు. భగత్‌సింగ్‌తోపాటు వీరులెందరో అమరులయ్యారని గుర్తు చేశారు.

స్వాతంత్ర్య పోరాట చరిత్రలేని ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ దేశాన్ని పాలిస్తూ తిరోగమనంలోకి తీసుకెళుతున్నాయని, ఇది దేశానికి అవమానకరమని విమర్శించారు. పేదరిక నిర్మూళనకు, కుల వ్యవస్థ నిర్మూళనకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. మహిళలకు పూర్తిస్థాయిలో హక్కులు కల్పించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సామ్రాజ్యవాదుల ముందు ప్రజలు మోకరిల్లే పరిస్థితిని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సృష్టించిందన్నారు.

దేశంలోని రాజ్యాంగ వ్యవస్థలను నాశనం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సీబీఐ, ఈసీఐ, ఈడీతోపాటు న్యాయ వ్యవస్థలను బీజేపీ మోడీ సర్కారు నాశనం చేస్తున్నదని విమర్శించారు. తెలంగాణలో 73 లక్షల ఓట్లు రద్దయ్యే ప్రమాదమేర్పడిందన్నారు.

జెండావిష్కరణలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి నాగయ్య, టి. సాగర్, రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్. వెంకట్రాములు, స్కైలాబ్ బాబు, శ్రీరాంనాయక్, బాబూరావు, అరుణజ్యోతి, ప్రజా సంఘాల నాయకులు, శ్రీనివాస్‌రెడ్డి, కోట రమేష్, శోభన్‌నాయక్, బి పద్మ, కట్ట నరసింహ పాల్గొన్నారు.

## ఆర్టీసీ సిబ్బంది నిజమైన రవాణా యోధులు

### డిజిటల్ సేవల వైపు టిజిఎస్‌ఆర్టీసీ అడుగులు

### స్వాతంత్ర్య వేడుకల్లో ఎండి వై.నాగిరెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 15, ప్రభాతవార్త: ఆర్టీసీ** బస్ భవన్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని టీజీఎస్ ఆర్టీసీ ఎండీ వై. నాగిరెడ్డి జాతీయ పతాకాన్ని శనివారం ఆవిష్కరిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్రం అనేది ఉచితంగా వచ్చిన కానుక కాదని, వేలాది మంది అమరవీరుల త్యాగాల ఫలితమని తెలిపారు. భారతమాత స్వేచ్ఛా వాయువులు పీల్చుకోవడానికి ప్రాణాలర్పించిన మహనీయుల త్యాగాలను స్మరించుకునే పవిత్రమైన రోజని అన్నారు. దేశ పురోగతిలోనూ, ప్రజాజీవనంలోనూ రవాణా వ్యవస్థల పాత్ర అత్యంత కీలకమైనదని, తెలంగాణ రాష్ట్ర ప్రగతి చక్రంలో టీజీఎస్ ఆర్టీసీ ఒక ప్రధాన శక్తిగా నిలుస్తూ రోజూ లక్షలాది మంది ప్రజలను సురక్షి తంగా తమ గమ్యస్థానాలకు చేరుస్తోందని ఎండీ వెల్లడించారు. సరిహద్దుల్లో సైనికులు దేశాన్ని కాపాడుతుంటే, రోజూ వేకువజామునే లేచి ఎండనక, వాననక కోట్లాది మంది ప్రజలను చేరవేస్తున్న ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు, గ్యారేజ్ మెకానిక్‌లు, ఇతర సిబ్బందే నిజమైన రవాణా యోధులని నాగిరెడ్డి ప్రశంసించారు. సంస్థ పట్ల ప్రజలు చూపుతున్న నమ్మకమే ఆర్టీసీకి నిజమైన బలమని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని ఆర్టీసీ అత్యంత విజయ వంతంగా అమలు చేస్తోందని తెలిపారు. మారే కాలానికి అనుగుణంగా ఆర్టీసీని ఆధునిక, పర్యావరణహిత వ్యవస్థగా తీర్చిదిద్దుతున్నామని నాగిరెడ్డి స్పష్టం చేశారు. ప్రయాణికుల సౌకర్యార్థం యూపీఐ, కార్డు చెల్లింపుల వంటి డిజిటల్ సేవలతో పాటు లైవ్ బస్ ట్రాకింగ్‌ను అందుబాటులోకి తెచ్చామన్నారు. మహిళల భద్రతకు ప్రాధాన్యమిస్తూ బస్సుల్లో సీసీటీవీ కెమెరాలు, పానిక్ బటన్ల ఏర్పాటును వేగవంతం చేశామని వివరించారు. కాలుష్య నివారణ కోసం భారీగా ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెడుతూనే, పాత బస్సుల స్థానంలో కొత్త సూపర్‌లగ్జరీ, ఎక్స్‌ప్రెస్ బస్సులను తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. ఉచిత ఆరోగ్య పరీక్షలు, వైద్య శిబిరాల ద్వారా ఉద్యోగుల ఆరోగ్యాన్ని సంరక్షిస్తూ, ప్రమాద రహితంగా బస్సులు నడిపే డ్రైవర్లను, ప్రతిభ చూపిన సిబ్బందిని ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ఆర్టీసీ కేవలం ఒక ప్రభుత్వ సంస్థ కాదని, అది అందరి ఆస్తి అని గుర్తు చేస్తూ, ప్రజారవాణాను ప్రోత్సహించడం, బస్సులను, డిపోలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి ప్రాథమిక బాధ్యత అని పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో అన్ని ప్రాంతాలకు సేవలను విస్తరించి, ప్రజాసేవలో టీజీఎస్ ఆర్టీసీని దేశంలోనే అగ్రగామిగా నిలబెడతామని సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ వేడుకల్లో సంస్థ ఈడీలు (ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ లు) సిహెచ్.వెంకన్న, ఎం. రాజశేఖర్, ఎఫ్‌ఏ విజయపుష్ప, జేడీ నర్మద, సిపిఎం ఉషాదేవి, సీఎంఇ జానిరెడ్డి, సిటీఎం శ్రీదేవిలతో పాటు పలువురు అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



### బిసిల కోసం రాహుల్‌గాంధీ పోరాటం చేస్తుంటే

## ఓట్ల యంత్రంగా చూస్తున్న బిజెపి

### ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు

**హైదరాబాద్, ఆగస్టు 15,ప్రభాతవార్త:** బిసిల కోసం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ రాజీలేని పోరాటం చేస్తుంటే నరేంద్రమోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం మాత్రం బిసిలను ఓట్ల యంత్రాలుగా వాడుకుంటోందని అభివృద్ధి కోసం ఏమీ చేయడంలేదని ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు ఆరోపించారు. కామారెడ్డిలోని పార్టీ కార్యాయలంలో విలేఖరులతో మాట్లా డుతూ రాహుల్‌గాంధీ భారత్‌జోడో యాత్రలో కన్యాకుమారి నుంచి కశ్మర్ వరకు బడుగులజీవితాలు చూసి వారి జీవితాలు బాగుకోసం ప్రశ్నంచడమే కాకుండా పార్లమెంట్‌లో బిసిల కోసం కొట్లాడుతున్నారని చెప్పారు. జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు ఇవ్వాలని అన్నారు. జనగణనలో ఎస్‌సి ఎస్‌టి బిసి అన్యాయంగా జరుగుతోంది హనుమంతరావు ఆరోపించారు. కులగణనలో బిసిలకు పేరు ఎందుకు లేదని ప్రశ్నించారు. పార్లమెంట్‌లో బిసిలకు ప్రత్యేక బిల్లు పెట్టాలని డిమాండ్ చేశారు.

**స్వాతంత్ర్య వేడుకల్లో విహెచ్ డ్యాన్స్**

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో స్వాతంత్ర్య దినోత్స వేడుకల్లో ప్రభుత్వ సలహాదారు విహెచ్ డ్యాన్స్ చేసి వీక్షకులను ఆశ్చర్యానికి గురి చేశారు. గిరిజన సాంప్రదాయ దుస్తుల్లో ప్రదర్శన చేస్తున్న విద్యార్థి నులతో విహెచ్ హుషారుగా నృత్యం చేశారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు కూడా ఆయనతో డ్యాన్స్ చేశారు.

## పోలీసు విభాగాల్లో ఘనంగా పంద్రాగస్టు వేడుకలు




డిజిపి కార్యాలయంలో పంద్రాగస్టు సందర్భంగా జాతీయ పతాకం ఎగురవేసి గౌరవ వందనం సమర్పిస్తున్న మల్టీజోన్-2 ఐజి షానవాజ్ ఖాసీం. చిత్రంలో ఇతర అధికారులు

**హైదరాబాద్, ఆగస్టు 15, ప్రభాతవార్త:** రాష్ట్ర పోలీసు విభాగాల్లో స్వాతంత్ర్య వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. డిజిపి కార్యాయం మొదలు కొని జంట నగరాలు, శివార్ల లోని అన్ని పోలీసు విభాగాల్లో ఈ వేడుకలు ఘనంగా నిర్వహించారు. లక్డీ కాపూల్‌లోని డిజి పి కార్యాలయంలో మ ల్టీ జోన్ 2 ఐజి షా నవాజ్ ఖాసీం జా తీయ జెండాను ఎగుర వేశారు. ఈ కార్యక్రమంలో పరి పాలన విభాగం ఏఐ జి రమణకుమార్. ఎస్‌పి అనోన్య, డిజిపి కార్యాలయ సిఎస్‌ఓ యోగేశ్వర రావు సహా కార్యాలయ అధికారులు పలువురు పాల్గొన్నారు.

కాగా బంజారా హిల్స్‌లోని కమాండ్ కంట్రోల్‌లో జరిగిన మరో కార్య క్రమంలో ఐఎస్‌డబ్ల్యు ఓఎస్‌డి కమలాసన్ రెడ్డి జాతీయ జెండాను ఆవిష్క రించారు. ఈ కార్యక్రమంలో కమాండ్ కంట్రోల్‌లోని అధికారులు పలువురు పాల్గొన్నారు. సైబరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో కమిషనర్ రమేష్, మల్కాజిగిరి కమిషనరేట్‌లో జరిగిన కార్యక్రమంలో కమిషనర్ సుమతి జాతీయపతాకాన్ని ఆవిష్క రించారు. కాగా ఎసిబి ప్రధాన కార్యాలయంతో పాటు నిఘా విభాగం ఇతర విభాగాల్లోనూ పంద్రాగస్టు వేడుకలు ఘనంగా జరిగాయి.

## వ్యవసాయ రంగంలో గణనీయమైన అభివృద్ధి

### రైతుల ఆదాయం పెంచడమే లక్ష్యం

### వ్యవసాయ శాఖ డైరెక్టర్ డాక్టర్ గోపి

**హైదరాబాద్, ఆగస్టు 15, ప్రభాతవార్త :** తెలంగాణ ఏర్పడిన తర్వాత వ్యవసాయ రంగంలో గణనీయమైన అభివృద్ధిని సాధించామని వ్యవసాయ శాఖ డైరక్టర్ డాక్టర్ బి. గోపి తెలిపారు. వ్యవసాయ కమిషనరేట్ కార్యాలయంలో శనివారం 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోపి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, జెండాకు వందనం చేశారు. అనంతరం మాట్లాడుతూ ఆధునిక సాగు సాంకేతికతను వ్యవసాయంలో అనుసంధానం చేస్తున్నట్లు వెల్లడించారు. తద్వారా రైతుల పెట్టుబడి ఖర్చులను తగ్గించడం, ఉత్పాదకతను పెంచడం, రైతుల ఆదాయాన్ని పెంపొందించడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా అనేక వినూత్న కార్యక్రమాలను అమలు చేస్తోందని వివరించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా యూరియా తదితర ఎరువుల పంపిణీని పారదర్శకంగా నిర్వహించేందుకు తెలంగాణలో అమలు చేసిన ఫర్టిలైజర్ యాప్ విధానాన్ని దేశవ్యాప్తంగా అమలు చేయబడటం రాష్ట్రానికి, వ్యవసాయ శాఖకు పేరు ప్రతిష్ఠలు తీసుకువచ్చిందన్నారు. రైతులు వ్యవ సాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తల సూచనలను పాటిస్తూ, ఎప్పటికప్పుడు ఆధునిక సాగు పద్ధతులు, సాంకేతిక పరిజ్ఞానాన్ని తెలుసుకుని, వాటిని ఆచరణలో అమలు చేయాలని సూచించారు.

ప్రస్తుతం నెలకొన్న వాతావరణ పరిస్థితులు, ముఖ్యంగా ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే వాతావరణ మార్పులను దృష్టిలో ఉంచుకుని రైతులకు ముందస్తు అవగాహన కల్పించడంలో వ్యవసాయ శాఖ క్షేత్రస్థాయి సిబ్బంది నుంచి కమిషనరేట్ స్థాయి వరకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో కృషి చేశారన్నారు. రైతులకు వాతావరణ పరిస్థితులపై సంపూర్ణ అవగాహన కల్పించడంతో పాటు, అవసరమైన చోట్ల ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను ప్రోత్స హించేందుకు అధికారులు, సిబ్బంది చేసిన కృషిని ఆయన ఈ సందర్భంగా కొనియాడారు. రైతుల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా నిరంతరం సేవలంది స్తున్న వ్యవసాయ శాఖలో విధి నిర్వహణలో నిబద్ధత, ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందిని ప్రశంసించారు.



# సంక్షేమం.. అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

## పేదల సంక్షేమానికి పెద్దపీట

## స్మార్ట్ రేషన్‌కార్డులతో ఆహార భద్రత

## సీతారామతో కొత్త ఆయకట్టుకు జలకళ: మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

## 2047 నాటికి రూ.3 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థే లక్ష్యం : డిసిఎం భట్టివిక్రమార్క

## స్వాతంత్ర్య వేడుకల్లో మంత్రుల కీలక ప్రకటనలు

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, ఆగస్టు 15, ప్రభాతవార్త:** ఉమ్మడి ఖమ్మం జిల్లాలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఖమ్మం జిల్లా కేంద్రంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జాతీయ పతాకాలను ఆవిష్కరించి ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. రెండు జిల్లాల అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. ప్రజలే కేంద్రంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రులు స్పష్టం చేశారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. రైతు సంక్షేమం నుంచి పరిశ్రమల వరకు, విద్య నుంచి వైద్యం వరకు అన్ని రంగాల్లో సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

**రైతన్నకు రుణమాఫీ.. భరోసా**

ఖమ్మం జిల్లాలో రైతు భరోసా కింద 3.41 లక్షల మందికి రూ.427.97 కోట్లు, పంట రుణమాఫీ కింద 1.31 లక్షల మందికి రూ.912.10 కోట్లు అందించినట్లు భట్టి తెలిపారు. భద్రాద్రి జిల్లాలోనూ రైతు రుణమాఫీతో పాటు ఆయిల్‌పామ్ సాగు విస్తరణకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు మంత్రి తుమ్మల వెల్లడించారు. సీతారామ ఎత్తిపోతల పథకం ద్వారా ఉమ్మడి జిల్లాల్లో కొత్త ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు చర్యలు కొనసాగుతున్నాయి. పాలేరు లింక్ కాలువ ద్వారా ఖమ్మం జిల్లాలో 1,38,790 ఎకరాలకు కొత్త ఆయకట్టు కల్పించనున్నట్లు భట్టి తెలిపారు. తెల్ల రేషన్ కార్డుదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని ప్రభుత్వం ప్రారంభించింది. మహాలక్ష్మి పథకం కింద ఖమ్మం జిల్లాలో 2,45,213 మంది లబ్ధిదారులకు రూ.57.05 కోట్ల సబ్సిడీతో గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నట్లు భట్టి తెలిపారు.

**ఉచిత కరెంటు.. ఉచిత ప్రయాణం**

గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించే 2,49,454 కుటుంబాలకు రూ.257.22 కోట్ల సబ్సిడీతో ఉచిత విద్యుత్ అందిస్తున్నట్లు తెలిపారు. మహిళల ఉచిత బస్సు ప్రయాణంతో జిల్లాలో రూ.326.73 కోట్ల మేర ఆదా జరిగిందన్నారు. ఖమ్మం జిల్లాలో తొలి విడతగా మంజూరైన 16,243 ఇందిరమ్మ ఇళ్లలో 10,396 ఇళ్ల నిర్మాణం పూర్తయిందని భట్టి తెలిపారు. లబ్ధిదారులకు రూ.454.97 కోట్ల ఆర్థిక సహాయం అందించినట్లు చెప్పారు. ఖమ్మం, పాలేరు, మధిర, వైరా, సత్తుపల్లి నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణాలు చేపడుతున్నట్లు భట్టి తెలిపారు. ఒక్కో పాఠశాలకు రూ.200 కోట్ల చొప్పున నిధులు వెచ్చిస్తున్నట్లు వెల్లడించారు.

**భద్రాద్రికి రూ.350 కోట్ల వరం**

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ అభివృద్ధికి ముఖ్యమంత్రి రూ.350 కోట్లు మంజూరు చేసినట్లు మంత్రి తుమ్మల తెలిపారు. గోదావరి పుష్కరాల నాటికి భద్రాచలాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దేందుకు అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చెప్పారు. జాతీయ రహదారులతో భద్రాద్రి జిల్లాకు కనెక్టివిటీ పెంచుతున్నామని తుమ్మల తెలిపారు. కొత్తగూడెం-హైదరాబాద్, కొత్తగూడెం-జగ్గయ్యపేట, భద్రాచలం-ఏటూరునాగారం రహదారుల అభివృద్ధితో పాటు ఏలూరు వైపు డబుల్ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు చెప్పారు.

**పర్యాటకానికి కొత్త ఊపు**

ఖమ్మం ఖిల్లా, పాలేరు సరస్సు, నేలకొండపల్లి బౌద్ధ స్తూపం తదితర ప్రాంతాల అభివృద్ధికి నిధులు కేటాయించినట్లు భట్టి తెలిపారు. భద్రాచలం, పర్ణశాల, కిన్నెరసాని ప్రాంతాలను కలిపి పర్యాటకంగా అభివృద్ధి చేసి స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెంచాలని తుమ్మల అన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాను వ్యవసాయం, పరిశ్రమలు, విద్య, వైద్యం, పర్యాటకం, మౌలిక వసతులు, సంక్షేమ రంగాల్లో ముందంజలో నిలిపేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రులు తెలిపారు.

# కెసిఆర్ నాయకత్వంలో మళ్లీ తెలంగాణను పట్టాలెక్కిద్దాం

## తెలంగాణ భవన్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించిన కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు15:** 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ కేంద్ర కార్యాలయం తెలంగాణ భవన్‌లో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జాతీయ జెండాను ఆవిష్కరించి రాష్ట్ర, దేశ ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశ ప్రజలకు వ్యక్తిగత, ప్రాంతీయ, భాషా, మత, కుల, రాష్ట్రపరమైన గుర్తింపులు ఎన్నున్నప్పటికీ అన్నింటికంటే ముందుగా మనమంతా భారతీయులమని అన్నారు. భారతీయత అనే భావమే దేశ ప్రజలందరినీ ఒక్కటిగా నడిపిస్తోందని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా మహాత్మాగాంధీని గొప్పగా గౌరవిస్తుంటే, దేశంలో మాత్రం ఆయనను అవమానించేలా, ఆయనను హత్య చేసిన వారిని కీర్తించేలా కొందరు వ్యవహరించడం బాధాకరమని కేటీఆర్ అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను చిన్నచూపు చూడటం దేశానికి మంచిది కాదని స్పష్టం చేశారు. దేశ స్వాతంత్రం కోసం పోరాడిన వారిని గౌరవించడం ప్రతి భారతీయుడి బాధ్యత అన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లు టవర్స్‌కు 60 వేలకుపైగా దరఖాస్తులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు15:** హైదరాబాద్ క్యూర్ పరిధిలో అల్పాదాయ వర్గాల కోసం నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ పథకంలో ఇండ్ల కోసం 60 వేల మందికిపైగా దరఖాస్తు చేసుకున్నారు. ఈ పథకంలో భాగంగా మరో నాలుగు నియోజకవర్గాల్లో ఆదివారం నుంచి కొత్తగా దరఖాస్తు లను స్వీకరిస్తున్నట్లు హౌసింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ విపి గౌతం తెలిపారు. అవుటర్ రింగ్ రోడ్ లోపలివైపు ఉన్న ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలోనూ ఇందిరమ్మ ఇండ్ల టవర్స్ నిర్మించాలన్న లక్ష్యంలో భాగంగా ఇప్పటికే 16 నియోజకవర్గాల్లో డిమాండ్ సర్వే ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తున్న సంగతి తెలిసిందే. ఈ నియోజకవర్గాల్లో దరఖాస్తులను శనివారం వరకు స్వీకరించారు. ఈ దరఖాస్తులను పరిశీలించిన అనంతరం త్వరలోనే లాటరీ ప్రక్రియను నిర్వహిస్తామని తెలిపారు.

ఈ ఇళ్ల నిర్మాణాల కోసం ఇప్పటికే టెండర్లను పిలిచామని సెప్టెంబరు మొదటి వారంలో పనులను ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. 16 నియోజకవర్గాల్లో వచ్చిన దరఖాస్తుల సంఖ్య చూస్తే సగటున ఒక్కో ఫ్లాట్ కు 8.18 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో గతంలో ప్రకటించిన వాటికి అదనంగా తాజాగా ఎల్ బి నగర్, గోషామహల్, ముషీరాబాద్, చంద్రాయణగుట్ట నియోజకవర్గాల్లోని ఎంపిక చేసిన భూముల్లో కూడా ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ నిర్మించనున్నామని ఆయన వివరించారు.

# రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యలతో పూర్తిగా ఏకీభవిస్తున్నా

## కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతిని ఆ పార్టీ వారే బయట పెడుతున్నారు : కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు15:** తెలంగాణలో అవినీతి, అక్రమాలు ఏ స్థాయిలో ఉన్నాయో ఇప్పుడు ప్రతిపక్షాలు చెప్పడం మాత్రమే కాదని, అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన సొంత పార్టీ ఎమ్మెల్యేలే బహిరంగంగా వెల్లడిస్తున్నారని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలతో తాను పూర్తిగా ఏకీభవిస్తున్నానని ఆయన తెలిపారు. అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధే ప్రభుత్వ పెద్దలపై అవినీతి ఆరోపణలు చేయాల్సిన పరిస్థితి వచ్చిందంటే తెలంగాణలో పాలన ఎంత దారుణంగా మారిందో అర్థం చేసుకోవచ్చని కేటీఆర్ అన్నారు. శనివారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియా ప్రతినిధులతో మాట్లాడారు.

తెలంగాణలో అవినీతి, అక్రమాలు జరుగుతున్నాయని ఇంతకాలం ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ విమర్శలుగా కొట్టిపారేస్తూ వచ్చిందని కేటీఆర్ అన్నారు. అయితే ఇప్పుడు అదే ఆరోపణలు అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేల నోటి నుంచి వస్తున్నాయని చెప్పారు. సొంత పార్టీ ఎమ్మెల్యే బహిరంగంగా ప్రభుత్వ పెద్దలపై అవినీతి ఆరోపణలు చేయడం సాధారణ విషయం కాదని, ఇది రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితుల తీవ్రతకు అద్దం పడుతుందని కేటీఆర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అవినీతి ఏ స్థాయిలో ఉందో అధికార పార్టీ ప్రజాప్రతినిధుల వ్యాఖ్యలే స్పష్టం చేస్తున్నాయని అన్నారు. తెలంగాణను ఏఐసీసీకి ఏటీఎంగా మార్చారు తెలంగాణ కాంగ్రెస్ పార్టీని రాహుల్ గాంధీ, ఏఐసీసీకి ఏటీఎంగా మార్చుకున్నారని కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణకు వచ్చిన ప్రతిసారీ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సైతం రాష్ట్రం ఏఐసీసీకి ఏటీఎంగా మారిందని వ్యాఖ్యానిస్తున్న విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఒకవైపు దేశ ప్రధానమంత్రి స్వయంగా తెలంగాణ ఏఐసీసీకి ఏటీఎంగా మారిందని చెబుతున్నారని, మరో వైపు రాష్ట్రంలో అవినీతిపై అధికార పార్టీ ఎమ్మెల్యేలే ప్రశ్నలు లేవనెత్తుతున్నారని కేటీఆర్ అన్నారు.

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై గతంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దాడులు నిర్వహించిన విషయాన్ని కూడా కేటీఆర్ ప్రస్తావించారు. ఈడీ దాడులు జరిగినప్పటికీ, ఆ తర్వాత ఈ వ్యవహారంలో ఎలాంటి చర్యలు తీసుకున్నారో, విచారణ ఎక్కడికి చేరిందో ప్రజలకు స్పష్టత లేదని అన్నారు. కేంద్ర దర్యాప్తు సంస్థలు రాజకీయ ప్రయోజనాల కోసం కాకుండా నిజాయితీగా, పారదర్శకంగా పనిచేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఎవరి విషయంలోనైనా ఆరోపణలు వచ్చినప్పుడు రాజకీయ అనుబంధాలను పక్కనపెట్టి చట్ట ప్రకారం విచారణ జరగాలని, దర్యాప్తు సంస్థలపై ప్రజలకు నమ్మకం కలిగేలా వాటి పనితీరు ఉండాలని అన్నారు.




# స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తిని కొనసాగించాలి

## పిసిసి చీఫ్ మహేశ్‌కుమార్

## గాంధీభవన్‌లో సేవాదళ్ స్వాతంత్ర్య వేడుకలు

**హైదరాబాద్, ఆగస్టు 15 ప్రభాతవార్త:** దేశస్వాతంత్ర పోరాట స్ఫూర్తిని సేవాదళ్ కొనసాగిస్తూ కాంగ్రెస్ సంస్థాగత అభివృద్ధికి దోహదం చేయాలని టిపిసిసి చీఫ్ బొమ్మ మహేష్‌కుమార్ పిలుపు నిచ్చారు,. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు అధ్యక్షుడు మిద్దెల జితేందర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బొమ్మా మహేష్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించి, స్వాతంత్ర్య సమరయోధులకు ఘన నివాళులు అర్పించారు. అనంతరం కాంగ్రెస్ సేవాదళ్ కార్యకర్తలను ఉద్దేశించి బొమ్మా మహేష్ కుమార్ ప్రసంగించారు. దేశానికి స్వాతంత్రం ఒక్కరోజులో లభించలేదని, మహాత్మా గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభాయ్ పటేల్, సుభాష్ చంద్రబోస్ తదితర మహనీయులతో పాటు లక్షలాది మంది స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల ఫలితమే నేటి స్వేచ్ఛ అని ఆయన అన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో కాంగ్రెస్ పార్టీ పోషించిన చారిత్రక పాత్రను యువతకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి కాంగ్రెస్ కార్యకర్తపై ఉందన్నారు. దేశ స్వాతం త్ర్య చరిత్రను వక్రీకరించే ప్రయత్నాలను ప్రజలు తిప్పికొట్టాలని మహేష్ కుమార్ పిలుపునిచ్చారు. దేశాన్ని ఏకం చేసిన రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్యం, లౌకిక వాదం, సామాజిక న్యాయం వంటి స్ఫూర్తిని కాపాడు కోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, సేవాదళ్ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ స్థాయి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# మోడీ సమర్ధ నేతృత్వంలో దేశం అన్ని రంగాల్లో అద్భుత ప్రగతి

## జాతీయ జెండాను ఆవిష్కరించిన బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు15:** భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, దేశ స్వాతంత్రం కోసం ప్రాణాత్యాగం చేసిన అమరవీరులు, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ప్రజలందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ వేడుకల్లో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ గారు, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్, బీజేపీ కర్ణాటక-తమిళనాడు కో ఇంచార్జ్ పొంగులేటి సుధాకర్ రెడ్డి, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ ,ఎమ్మెల్సీ అంజిరెడ్డి, బీజేపీ రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు డాక్టర్ ఎన్. గౌతమ్ రావు, వేముల అశోక్ ఇతర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్. రాంచందర్ రావు ప్రసంగిస్తూ, గత 12 ఏళ్లుగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమర్థ నాయకత్వంలో భారతదేశం అన్ని రంగాల్లో అద్భుత ప్రగతి సాధించి, ప్రపంచంలోనే 4వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని కొనియాడారు.

# రుణ మాఫీపై మాట తప్పిన ముఖ్యమంత్రి

- రుణమాఫీ కాలేదని తేలితే రాజీనామా చేస్తావా ?
- బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ సవాల్

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** రాష్ట్రంలో రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తానని కనిపించిన దేవుళ్లమీద ఒట్టుపెట్టి రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేయకుండా మోసం చేసిన ఘరానా మోసగానివి.. నిన్ను మించిన మోసగాడు లేడని మాజీ మంత్రి, బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీష్‌రావు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేశానని గొప్పలు చెప్పుకుంటున్నావ్ రేవంత్‌రెడ్డి నీ ఊరికి రమ్మంటావా లేదా రాష్ట్రంలో ఏ గ్రామంకు పోదాం చెప్పు ఆ గ్రామంలో పూర్తిస్థాయిలో రైతులకు రుణమాఫీ అయితే నేను ముక్కు నెలకు రాసి అక్కడే రాజీనామా చేస్తా రుణమాఫీ కాలేదని తెలితే నవ్వు రాజీనామా చేస్తావా అని సవాల్ విసిరారు. రెండు ఆర్థిక సంవత్సరాలలో రూ.15 వేల కోట్ల రైతు బంద్ ఎగొట్టిన ఘనత రేవంత్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఇప్పటికైనా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యోగాలు ఇస్తే కాంగ్రెస్ వచ్చిన తర్వాత నియామక పత్రాలు ఇచ్చి గొప్పలు చెప్పుకుంటున్నావ్ రేవంత్‌రెడ్డి దమ్ముంటే అశోకనగర్, దిల్‌సుఖనగర్, ఉస్మానియా యూనివర్శిటీకి వస్తావ రా సెక్యూరిటీ లేకుండా నిరుద్యోగులతో మాట్లాడదామని సవాల్ విసిరారు. 70 వేల ఉద్యోగాలు ఇచ్చానని గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. సంగారెడ్డిలో పంద్రాగస్టు రోజున చిల్లర, రోత మాటలు మాట్లాడడం దేశంలో ఏ సిఎం కూడా మాట్లాడడని కేవలం రేవంత్‌రెడ్డి ఒక్కడే మాట్లాడదాని మండిపడ్డారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజు సిఎం మాట్లాడిన చిల్లర, రోత వ్యాఖ్యాలను తీవ్రంగా ఖండిస్తున్నారని పేర్కొన్నారు. సంగారెడ్డిలో సాయంత్రం 4.20 నిమిషాలకు ప్రసంగం ప్రారంభించిన సిఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీలను మార్చిపోయి అన్ని 420 మాటలే మాట్లాడారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తీరు ఎలా ఉందో పోచారం శ్రీనివాస్‌రెడ్డి, దానం నాగేందర్, చెబుతున్నారని తెలిపారు. మీ ప్రభుత్వంలో జరుగుతున్న స్కాంలపై మీ పార్టీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డియే మండిపడుతున్నారని తెలిపారు. ప్రజలు నీ కంటే నా కంటే చాలా తెలివైన వారు నీవు అన్ని చిల్లర మాటాలు అబ్బలు మాట్లాడుతున్నావు సమయం వచ్చినప్పుడు ప్రజలు కర్రు కాల్చివాత పెడుతారని హెచ్చరించారు. సమావేశంలో పార్టీ నాయకులు రాజనర్సు, రమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న మాజీమంత్రి హరీశ్‌రావు

# వచ్చే వారం నుంచి వరుసగా ఉద్యోగ నోటిఫికేషన్లు


## ఆధునిక టెక్నాలజీతో పారదర్శకంగా నియామకాలు

## తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మన్ బుర్రా వెంకటేశం

**హైదరాబాద్, ఆగస్టు 15, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని నిరుద్యోగులకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీజీపీఎస్సీ) ఛైర్మన్ బుర్రా వెంకటేశం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా తీపి కబురు చెప్పారు. వచ్చే వారం నుంచి వరుసగా ఉద్యోగ నోటిఫికేషన్లను జారీ చేస్తామని, నియామకాల కోసం నిరుద్యోగులు ప్రిపేర్ కావాలని సూచించారు. కమిషన్ కార్యాలయంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ బుర్రా వెంకటేశం గౌరవ వందనం స్వీకరించి, కమిషన్ సభ్యులు డాక్టర్ అమీర్ ఉల్లా ఖాన్, పి. రజనీ కుమారి, సి. చంద్రకాంత్ రెడ్డి, ప్రొఫెసర్ ఎల్‌బీ లక్ష్మీకాంత్ రాథోడ్, కార్యదర్శి ఎం. హరితతోపాటు అధికారులు, సిబ్బంది సమక్షంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ బుర్రా వెంకటేశం మాట్లాడుతూ.. పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఒక రాజ్యాంగబద్ధమైన సంస్థ అని ఉద్యోగ నియామకాలను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించాల్సిన గొప్ప బాధ్యతను కలిగి ఉందన్నారు. దేశవ్యాప్తంగా ఇటీవల నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ కావడం తదనంతర పరిణామాలను ప్రస్తావిస్తూ, ప్రభుత్వ సేవలో ప్రవేశించాలని ఆకాంక్షించే అభ్యర్థులకు ఒక చిన్న పొరపాటు కూడా తీవ్ర పరిణామాలకు దారితీస్తుందని, అందువల్ల ప్రతి ఉద్యోగి నియామక ప్రక్రియలోని ప్రతి దశలోనూ అత్యంత జాగ్రత్తతో, శ్రద్ధతో పనిచేయాలని ఛైర్మన్ సూచించారు.

# అమెరికాలో మెరుగుపడిన శాంతిభద్రతలు: ఎఫ్‌బిఐ

**వాషింగ్టన్, ఆగస్టు 15:** అమెరికాలో శాంతిభద్రతలు మెరుగయ్యాయని దేశవ్యాప్తంగా హత్యల రేటు గత 75 ఏళ్లలోనే అత్యంత కనిష్ట స్థాయికి పడిపోయినట్లు ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ తన తాజా నివేదికలో వెల్లడించింది. 2025 సంవత్సరానికి సంబంధించిన గణాంకాల ప్రకారం హింసాత్మక నేరాలు సైతం గణనీయంగా తగ్గుముఖం పట్టాయి. ఎఫ్‌బీఐ విడుదల చేసిన వార్షిక క్రైమ్ రిపోర్ట్ ప్రకారం 2024తో పోలిస్తే 2025లో హత్యల సంఖ్య సుమారు 12 శాతం నుంచి 15 శాతం వరకు తగ్గింది. దాంతో 1950 తర్వాత నమోదైన అత్యల్ప హత్యాకాండ రేటు ఇదే కావడం గమనార్హం. కేవలం హత్యలే కాకుండా తీవ్రమైన దాడులు, దోపిడీలు వంటి హింసాత్మక నేరాలు మొత్తంగా ఆరు శాతం కంటే ఎక్కువగా తగ్గాయి. వాహనాల దొంగతనాలు, ఆస్తి సంబంధిత నేరాలు కూడా తగ్గుముఖం పట్టినట్లు నివేదిక స్పష్టం చేసింది. కరోనా మహమ్మారి విజృంభించిన 2020-21 మధ్య కాలంలో అమెరికాలో నేరాల సంఖ్య విపరీతంగా పెరిగింది. అయితే ఆందోళన కలిగించిన ఆ పరిస్థితుల నుంచి దేశం వేగంగా కోలుకోవడమే కాకుండా, ఇప్పుడు రికార్డు కనిష్టానికి నేరాలను ని యంత్రిం చడం విశేషం. న్యూయార్క్, చికాగో, లాస్ ఏంజెల్స్ వంటి ప్రధాన నగరాల్లోనూ క్రైమ్ రేట్ గణనీయంగా తగ్గ డంతో పౌరులలో భద్రతాభావం పెరిగినట్లు తెలుస్తోంది. ఈ భారీ తగ్గుదల వెనుక అనేక కారణాలు ఉన్నాయని నిపు ణులు విశ్లేషిస్తు న్నారు. బైడెన్ హారిస్ ప్రభుత్వం అమెరికన్ రెస్క్యూ ప్లాన్ కింద స్థానిక పోలీస్ విభాగాలకు భారీగా నిధులు కేటాయించడం, ఫెడరల్‌లోకల్ ఏజెన్సీల మధ్య సమన్వయం పెరగడం ముఖ్య కారణాలుగా చెబుతున్నారు. మధ్య ప్రాచ్య ఉద్రిక్తతలు, ఆర్థిక సవాళ్లతో సతమత మవుతున్న అమెరికన్లకు దేశంలో మెరుగైన శాంతిభద్రతలపై ఎఫ్‌బీఐ ఇచ్చిన ఈ నివేదిక పెద్ద ఊరటనిచ్చే అంశంగా మారింది.




# పాక్ హిందువులు మాతో ఉండేందుకే ఇష్టపడతారు

## అధ్యక్షుడు ఆసిఫ్ ఆలీజర్దారీ వివాదాస్పద వ్యాఖ్యలు

**ఇస్లామాబాద్, ఆగస్టు 15:** పాకిస్థాన్ అధ్యక్షుడు ఆసిఫ్ ఆలి జర్దారీ భారత్‌పై, అక్కడి హిందువుల పరిస్థితిపై తన అక్కసు వెళ్లగక్కారు. భారతీయులు అఖండ భారత్"ను విశ్వసిస్తారని, అయితే పాకిస్థాన్‌లోని హిందువులు భారత్‌లో ఉండటం కంటే తమ దేశంలోనే ఉండేందుకే ఇష్టపడ తారని జర్దారీ పేర్కొన్నారు. భారతీ యులు అఖండ భారత్‌ను విశ్వసిస్తారు. కానీ మేం ముస్లింలం. వారు కాదు. సహనాన్ని విశ్వసించే ముస్లింలం. పాకిస్థాన్‌లో నాలుగు శాతం హిందూ జనాభా ఉంది. వారు ఎక్కడైనా ఉన్నంత స్వేచ్ఛగా ఇక్కడ ఉన్నారు. వారు భారత్‌లో ఉండటం కంటే మాతో ఉండటానికే ఇష్టపడతారు" అని జర్దారీ వ్యాఖ్యానించారు. అయితే జర్దారీ వ్యాఖ్యలకు పాకిస్థాన్‌లోని మైనారిటీల జనాభా గణాంకాలు భిన్నమైన చిత్రాన్ని చూపుతున్నాయి. 1947లో దేశ విభజన సమయంలో పాకిస్థాన్‌లో హిందువులు, సిక్కులు సహా ముస్లిమేతర మైనారిటీలు మొత్తం జనాభాలో సుమారు 15-20 శాతం వరకు ఉన్నారు. అయితే దశాబ్దాలుగా మైనారిటీలపై కొనసాగుతున్న వివక్ష, వేధింపులు, హింస, బలవంతపు మతమార్పిడుల కారణంగా ప్రస్తుతం పాకిస్థాన్‌లో హిందువుల జనాభా సుమారు 3-4 శాతానికి పరిమితమైందని నివేదికలు పేర్కొంటున్నాయి. పాకిస్థాన్‌లో హిందువులు, సిక్కులపై దాడులు, వేధింపులు, బలవంతపు మతమార్పిడులకు సంబంధించిన ఘటనలు గతంలో పలుమార్లు వెలుగులోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో పాకిస్థాన్ అధ్యక్షుడు హిందువులు తమ దేశంలోనే ఉండటానికి ఇష్టపడుతున్నారని చేసిన వ్యాఖ్యలకు భిన్న స్పందన వస్తోంది.

# నల్సార్ విద్యార్థులపై చర్య విషయంలో బార్ కౌన్సిల్ చీఫ్ మన్నన్ కుమార్ మిశ్రా క్షమాపణ

**న్యూఢిల్లీ, ఆగస్టు 15:** హైదరాబాద్లోని ప్రతిష్ఠాత్మక నల్సార్ యూనివర్సిటీకి చెందిన 2026 బ్యాచ్ విద్యార్థులను న్యాయవాదులుగా నమోదు చేసుకోకుండా ఆదేశాలు జారీ చేసి వివాదానికి కేంద్రబిందువైన బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్మన్ మన్నన్ కుమార్ మిశ్రా క్షమాపణలు తెలిపారు. ఆలోచనా స్వాతంత్ర్యాన్ని గౌరవించాల్సిందేనని ఆయన పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ కూడా తీవ్రంగా స్పందించిన విషయం తెలిసిందే. 2026లో నల్సార్లో పట్టభద్రులవుతున్న కొంతమంది విద్యార్థులు తమ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా చీఫ్ జస్టిస్ సూర్యకాంత్‌ను ఆహ్వానించాలన్న యూనివర్సిటీ నిర్ణయాన్ని వ్యతిరేకించారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగిన కాక్రోచ్ జనతా పార్టీ నేతృత్వంలోని నిరసనల్లో పోలీసుల దౌర్జన్యానికి సంబంధించిన పిటిషన్లు అత్యవసరంగా విచారించాలని కోరిన సందర్భంలో జస్టిస్ సూర్యకాంత్ చేసిన వ్యాఖ్యలే ఇందుకు కారణమయ్యాయి. ఆ సందర్భంగా ఆయన మా సమయాన్ని వృథా చేయొద్దని వ్యాఖ్యానించినట్లు ప్రచారం జరిగింది. తాను పిటిషన్ విచారించేందుకు నిరాకరించలేదని, దానిని సరైన విధానంలో దాఖలు చేయాలని మాత్రమే సూచించానని అనంతరం జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు. బిసిఐ చైర్మన్ మన్నన్ కుమార్ మిశ్రా నేతృత్వంలో జారీ చేసిన ఉత్తర్వుల్లో 2026 బ్యాచ్ నల్సార్ విద్యార్థులను తదుపరి ఆదేశాలు వెలువడే వరకు రాష్ట్ర బార్ కౌన్సిళ్లు న్యాయవాదులుగా నమోదు చేయకూడదని ఆదేశించారు. సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది వికాస్ సింగ్ ఈ చర్యను ఏకపక్షమైనది, చట్టవిరుద్ధమైనది, అసమానమైనదిగా అభివర్ణించారు. కాక్రోచ్ జనతా పార్టీ కూడా ఈ ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసింది. ఈ నేపథ్యంలో మన్నన్ కుమార్ మిశ్రా క్షమాపణలు చెప్పడం, విద్యార్థుల ఆలోచనా స్వాతంత్ర్యాన్ని గౌరవించాల్సిన అవసరం ఉందని అంగీకరించడం ప్రాధాన్యం సంతరించుకుంది.





# అన్న ప్రాణం తీసిన తమ్ముడు

## కుటుంబ తగాదాలే కారణం!

## సరూర్‌నగర్ పిఎస్ పరిధిలో ఘటన

**హైదరాబాద్ (హుడా కాంప్లెక్స్), ఆగస్టు 15, ప్రభాతవార్త :** కుటుంబ తగాదాల కార ణంతో సొంత తమ్ముడే అన్నను హత్యచేసిన సంఘటన సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చంపాపేట కుమ్మరిబస్తీలో నివాసముంటున్న ముదావత్ వెంకటేష్ (26) ఆటోడ్రైవర్‌గా జీవనం కొన సాగిస్తున్నాడు. సొంత తమ్ముడైన శివ (24) పక్కవీధిలో నివాస ముంటున్నాడు. ఇద్దరు అన్నదమ్ముల మధ్య కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. వీరి తండ్రి మరణించిన నాటి నుండి అన్నదమ్ముల మధ్య గొడవలు ఎక్కువయ్యాయి. ఈ క్రమంలోనే శనివారం అన్నదమ్ముల మధ్య తీవ్రస్థాయిలో ఘర్షణ చోటు చేసుకుంది. ఆవేశానికి గురైన తమ్ముడు శివ ఇంట్లోని కత్తెరను తీసుకుని అన్న వెంకటేష్‌పై విచక్షణారహితంగా దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన వెంక టేష్‌ను స్థానికులు వెంటనే అనుపత్రికి తరలించేందుకు ప్రయత్నించారు. అయితే మార్గమధ్యంలోనే వెంకటేష్ మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. అన్నను పొడిచిన అనంతరం శివ అక్కడి నుండి పారిపోయాడు. సమాచారం అందు కున్న పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకుని వివరాలను సేకరిం చారు. బాధితుని కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా అనుపత్రికి తరలిం చారు. పరారీలో ఉన్న నిందితుడు శివ కోసం గాలింపు చర్యలు వేగవంతం చేశారు.



వెంకటేష్ (ఫైల్)

## సిన్సినాటి ఓపెన్‌లో ఏడు సార్లు గ్రాండ్ స్లామ్ ఛాంపియన్ వీనస్ ఓటమి



**ఒహియో:** ఏడుసార్లు గ్రాండ్ స్లామ్ ఛాంపియన్ అయిన వీనస్ విలియమ్స్ సిన్సినాటి ఓపెన్ తొలి రౌండ్‌లో కొలంబియన్ క్వాలిఫయర్ ఎమిలియానా అరాంగో చేతిలో 6-2, 6-2 తేడాతో ఓటమి చవిచూడటంతో, ఆమె సింగిల్స్ ఓటముల పరంపర 13 మ్యాచ్‌లకు చేరింది.

46 ఏళ్ల అమెరికన్ క్రీడాకారిణి వైల్డ్‌కార్డ్ ద్వారా డబ్ల్యూటీఏ 1000 టోర్నమెంట్‌లో లిండ్నర్ టెన్నిస్ సెంటర్‌లోని గ్రాండ్‌స్టాండ్ కోర్టులో విలియమ్స్‌ను ఓడించడానికి 25 ఏళ్ల అరాంగోకు ఒక గంట ఐదు నిమిషాలు పట్టింది. విలియమ్స్ ప్రారంభ గేమ్‌లోనే తన సర్వ్‌ను కోల్పోయి, నిరంతరం ఒత్తిడి తెస్తున్న ప్రత్యర్థిపై తిరిగి పుంజుకోవడానికి చాలా కష్టపడింది. అరాంగో తనకు లభించిన ఐదు బ్రేక్‌పాయింట్ అవకాశాలలో నాలుగింటిని సద్వినియోగం చేసుకుని, తన మొదటి సర్వ్‌తో 71 శాతం పాయింట్లను గెలుచుకుంది. మరోవైపు, విలియమ్స్ తనకు లభించిన ఏకైక బ్రేక్ అవకాశాన్ని కూడా సద్వినియోగం చేసుకోలేక, తన మొదటి సర్వ్ పాయింట్లలో 41 శాతం మాత్రమే గెలుచుకుంది. ఆరంభంలోనే ఆధిక్యం సాధించడం తన ఆందోళనను తగ్గించి, నియంత్రణను కొనసాగించడానికి సహాయపడిందని అరాంగో అన్నారు. రెండో రౌండ్‌లో అరాంగో తదుపరి డిఫెండింగ్ ఛాంపియన్ మరియు టాప్ సీడ్ అయిన ఇగా స్వియాటెక్‌తో తలపడనుంది.

## భారత్ శుభారంభం

### హాకీ వరల్డ్ కప్‌లో వేల్స్‌పై తీన్మార్ విజయం



**నెదర్లాండ్స్:** ఎఫ్ఐహెచ్ పురుషుల హాకీ ప్రపంచకప్ 2026 టోర్నీలో భారత్ శుభారంభం చేసింది. బెల్జియం, నెదర్లాండ్స్ ఆతిథ్యం ఇస్తున్న ఈ మెగా టోర్నీ తొలి మ్యాచ్‌లో భారత్ 31 తేడాతో వేల్స్‌ను చిత్తు చేసింది. గ్రూప్‌డీలో భాగంగా శనివారం నెదర్లాండ్స్, ఆమ్ స్టెల్వీన్‌లోని వాజెనర్ హాకీ స్టేడియం వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో భారత్ పూర్తి ఆధిపత్యం చెలాయించింది. భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్(10వ, 42వ నిమిషం) డబుల్ గోల్స్‌తో సత్తా చాటగా, సుమిత్(7వ నిమిషం) ఏకైక గోల్‌తో భారత విజయంలో కీలక పాత్ర పోషించాడు. వేల్స్ తరఫున వెల్ష్ సామ్(55వ నిమిషం) ఏకైక గోల్ నమోదు చేశాడు. మ్యాచ్ ఆరంభం నుంచే భారత్ ఆధిపత్యం చెలాయించింది. తొలి క్వార్టర్‌లో రెండు గోల్స్ నమోదు చేసింది. ఏడో నిమిషంలో లభించిన పెనాల్టీ కార్నర్‌ను సుమిత్ గోల్‌గా మలిచి 1-0తో శుభారంభం అందించాడు. మరో మూడు నిమిషాల వ్యవధిలోనే రెండో పెనాల్టీ కార్నర్ లభించగా, హర్మన్‌ప్రీత్ సింగ్ గోల్‌గా మలిచి భారత్ ఆధిక్యాన్ని 2-0తో డబుల్ చేశాడు. రెండో క్వార్టర్‌లో ఇరు జట్లు హోరాహోరీగా తలపడటంతో గోల్స్ నమోదు కాలేదు. మూడో క్వార్టర్ చివర్లో భారత్‌కు మరో పెనాల్టీ కార్నర్ లభించగా, హర్మన్‌ప్రీత్ గోల్‌గా మలిచి ఆధిక్యాన్ని 3-0తో మూడింతలు చేశాడు. ఆఖరి క్వార్టర్‌లో వేల్స్ ఆధిపత్యం చెలాయించింది. బంతిని పూర్తిగా తమ ఆధీనంలో ఉంచుకొని భారత్‌పై ఎదురుదాడికి దిగింది. ఈ క్రమంలో ఆ జట్టుకు 55వ నిమిషంలో పెనాల్టీ కార్నర్ లభించింది. వేల్ష్ సామ్ గోల్‌గా మలిచి ఆ జట్టు ఖాతా తెరిచాడు.

## ది హాండ్రెడ్ టోర్నీ.. సన్‌రైజర్స్ ఔట్

### ఫైనల్‌కు సూపర్ జెయింట్స్

**కెన్నింగ్టన్ ఓవల్(లండన్):** ది హండ్రెడ్ 2026 టోర్నీలో సన్‌రైజర్స్ లీడ్స్ పోరాటం ముగిసింది. ఎలిమినేటర్ మ్యాచ్‌లో సమష్టిగా విఫలమైన సన్‌రైజర్స్ లీడ్స్ 20 పరుగుల తేడాతో మాంచెస్టర్ సూపర్ జెయింట్స్ చేతిలో ఓటమిపాలైంది. ఈ పరాజయంతో సన్‌రైజర్స్ టోర్నీ నుంచి నిష్క్రమించగా, అద్భుత విజయం సాధించిన సూపర్ జెయింట్స్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్





చేసిన సూపర్ జెయింట్స్ 100 బంతుల్లో 4 వికెట్లకు 186 పరుగులు చేసింది. పాల్ వాల్టర్(80), హెన్రీచ్ క్లాసెన్(63) హాఫ్ సెంచరీలతో రాణించగా, కెప్టెన్ జోస్ బట్లర్(33) విలువైన పరుగులు చేశాడు. సన్‌రైజర్స్ బౌలర్లలో బ్రైడన్ కార్స్, మాథ్యూ పాట్స్, నాథన్ ఎల్లిస్ తలో వికెట్ తీసారు. అనంతరం సన్‌రైజర్స్ 100 బంతుల్లో 7 వికెట్లకు 166 పరుగులే చేసి ఓటమిపాలైంది. ర్యాన్ రికెల్టన్(54 నాటౌట్), హ్యారీ బ్రూక్(49) రాణించినా ఫలితం లేకపోయింది. సూపర్ జెయింట్స్ బౌలర్లలో జోష్ టంగ్(4/26) నాలుగు వికెట్లు తీయగా, సోనీ బేకర్(2/39) రెండు వికెట్లు పడగొట్టాడు. లియామ్ డాసన్‌కు ఒక వికెట్ దక్కింది. మ్యాచ్‌లో మూడో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చి విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడాడు. కేవలం 26 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్స్‌లతో 63 పరుగులు చేసి మాంచెస్టర్ సూపర్ జెయింట్స్‌కు భారీ స్కోర్ అందించడంతో సన్‌రైజర్స్ ఓటమి చెందాల్సి వచ్చింది.






## విజయం దిశగా బంగ్లా

### తొలి టెస్టులో తేలిపోయిన ఆస్ట్రేలియా

**డార్విన్:** ఆస్ట్రేలియాతో తొలి టెస్ట్‌లో బంగ్లాదేశ్ విజయం దిశగా సాగుతోంది. రెండు టెస్ట్‌ల సిరీస్‌లో భాగంగా డార్విన్ వేదికగా జరుగుతున్న తొలి మ్యాచ్‌లో బంగ్లాదేశ్ సమష్టి ప్రదర్శనతో ఆకట్టుకుంటోంది. శనివారం మూడో రోజు ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్‌లో 4 వికెట్లకు 161 పరుగులు చేసింది. క్రీజులో కామెరూన్ గ్రీన్(43 బ్యాటింగ్)తో పాటు అలెక్స్ క్యారీ(19 నాటౌట్) ఉన్నాడు. మార్నస్ లబుషేన్(31), స్టీవ్ స్మిత్(44) కీలక భాగస్వామ్యాన్ని అందించారు.

బంగ్లాదేశ్ బౌలర్లలో హసన్ మహ్మూద్(2/33) రెండు వికెట్లు తీయగా, తైజుల్ ఇస్లామ్, మెహిది హసన్ మీరాజ్ తలో వికెట్ తీసారు. అంతకుముందు 351/6 ఓవర్‌నైట్ స్కోర్‌తో మూడో రోజు ఆటను ప్రారంభించిన బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 138 ఓవర్లలో 426 పరుగులకు ఆలౌటైంది. ఓవర్‌నైట్ బ్యాటర్ మెహిదీ హసన్(154 బంతుల్లో 5 ఫోర్లు, సిక్స్‌తో 65) హాఫ్ సెంచరీతో రాణించాడు. తంజీద్ హసన్(197 బంతుల్లో 8 ఫోర్లు, సిక్స్‌తో 101) సెంచరీతో, నజ్ముల్ హొస్సేన్ షాంటో(126 బంతుల్లో 7 ఫోర్లు, సిక్స్‌తో 84) హాఫ్ సెంచరీతో చెలరేగిపోయారు. ఆసీస్ బౌలర్లలో జోష్ హేజిల్ వుడ్(6/89) ఆరు వికెట్లు తీయగా, మిచెల్ స్టార్క్(2/79) రెండు వికెట్లు పడగొట్టాడు. ప్యాట్ కమిన్స్, నాథన్ లయన్ తలో వికెట్ తీసారు. దాంతో బంగ్లాదేశ్‌కు 228 పరుగుల భారీ ఆధిక్యం లభించింది. భారీ లోటుతో శనివారం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆసీస్ అదే తడబాటు కొనసాగించింది. ఓపెనర్లు ట్రావిస్ హెడ్(17), జేక్ వెదరాల్డ్(0) తీవ్రంగా నిరాశపర్చారు. ఈ క్రమంలో లబుషేన్, స్మిత్ ఆచితూచి ఆడే ప్రయత్నం చేశారు. లబుషేన్‌ను తైజుల్ ఇస్లామ్ ఔట్ చేయగా, స్మిత్‌ను మెహిదీ హసన్ మిరాజ్ పెవిలియన్ చేర్చి హాఫ్ సెంచరీని అడ్డుకున్నాడు. కామెరూన్ గ్రీన్(43 బ్యాటింగ్), అలెక్స్ క్యారీ(19 బ్యాటింగ్) మరో వికెట్ పడకుండా మూడో రోజు ఆటను ముగించారు. ఈ ఇద్దరి ప్రదర్శనపైనే ఆసీస్ అవకాశాలు ఆధారపడి ఉన్నాయి. ఈ ఇద్దరూ సెంచరీలతో చెలరేగి భారీ లక్ష్యం నమోదు చేస్తే తప్పా ఈ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా గట్టెక్కలేదు.

## శ్రీలంక టెస్ట్ సిరీస్‌లో తొలి రోజు భారత్ 288 పరుగులు

**న్యూఢిల్లీ:** శ్రీలంకతో రెండు టెస్ట్‌ల సిరీస్‌ను టీమిండియా ఘనంగా మొదలెట్టింది. గాలే వేదికగా శనివారం ప్రారంభమైన మ్యాచ్‌లో దేవదత్ పడిక్కల్(178 బంతుల్లో 12 ఫోర్లు, సిక్స్‌తో 131 బ్యాటింగ్) అజేయ శతకంతో తొలి రోజు ఆట ముగిసే సమయానికి భారత్ 73 ఓవర్లలో 2 వికెట్లకు 288 పరుగుల భారీ స్కోర్ చేసింది. వర్షం అంతరాయం కారణంగా తొలి రోజు 77 ఓవర్ల ఆటనే సాధ్యమైంది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన టీమిండియాకు శుభారంభం దక్కలేదు. సాధికారికంగా బ్యాటింగ్ చేసిన ఓపెనర్ యశస్వి జైస్వాల్(32) దురదృష్టకర రీతిలో రనౌటయ్యాడు. శ్రీలంక అరంగేట్ర స్పిన్నర్ కేశర నువంత తప్పిదంతో జైస్వాల్ బలయ్యాడు. క్రీజులోకి వచ్చిన దేవదత్ పడిక్కల్‌తో కెఎల్ రాహుల్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. దీంతో టీమిండియా 27 ఓవర్లలో 101/1 స్కోర్ చేసేటప్పటికి వర్షంతో గంటన్నర తర్వాత రెండో సెషన్ మొదలైంది. రాహుల్, పడిక్కల్ తమ జోరును



కొనసాగించారు. ఈ క్రమంలో పడిక్కల్ 81 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. మరోవైపు కేఎల్ రాహుల్ 127 బంతుల్లో 77 పరుగలతో హాఫ్ సెంచరీ సాధించాడు. దాంతో టీమిండియా 197/1 స్కోర్‌తో టీ బ్రేక్ వెళ్లింది. ఆఖరి సెషన్‌లో రాహుల్ బ్యాటింగ్ కొనసాగించలేక రిటైర్డ్ హర్ట్‌గా మైదానం వీడాడు. క్రీజులోకి కెప్టెన్ శుభ్‌మన్ గిల్ రాగా కేశర నువంత బౌలింగ్‌లో క్విక్ సింగిల్ తీసి పడిక్కల్ 134 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అయితే గిల్(16) నిరాశపర్చాడు. ప్రబాత్ జయసూర్య బౌలింగ్‌లో క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. క్రీజులోకి పంత్ రాగా వర్షం అంతరాయం కలిగించింది. కాసేపటి తర్వాత ఆట తిరిగి ప్రారంభం కాగా పంత్(27 బ్యాటింగ్), పడిక్కల్ దూకుడుగా ఆడారు. అజేయంగా 52 పరుగులు జోడించి తొలి రోజు ఆటను ముగించారు.

# వాణిజ్యం

## పెట్రోల్, డీజిల్, ఏటీఎఫ్ ఎగుమతులపై విండ్‌ఫాల్ ట్యాక్స్ తగ్గింపు

**న్యూఢిల్లీ, ఆగస్టు 15:** పెట్రోల్, డీజిల్, ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ (ఏటీఎఫ్) ఎగుమతులపై విధిస్తున్న విండ్‌ఫాల్ గెయిన్స్ పన్నును ప్రభుత్వం తగ్గించింది. శనివారంనుంచి ప్రారంభమయ్యే పక్షం రోజులకు కొత్త పన్ను రేట్లు అమల్లోకి రానున్నాయి. డీజిల్ ఎగుమతులపై స్పెషల్ అడిషనల్ ఎక్సైజ్ సుంకాన్ని లీటరుకు రూ.25.50 నుంచి రూ.24కు తగ్గించారు. ఏటీఎఫ్ ఎగుమతులపై పన్నును లీటరుకు రూ.22 నుంచి రూ.19.50కు తగ్గించారు. పెట్రోల్ ఎగుమతులపై పన్నును పూర్తిగా ఎత్తివేశారు. ఆగస్టు 3న లీటరుకు



రూ.3.50గా ఉన్న ఈ పన్ను ఆగస్టు 15 నుంచి సున్నాగా అమలవుతుంది. ఈ మేరకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. దేశీయ వినియోగం కోసం విక్రయించే పెట్రోల్, డీజిల్‌పై ప్రస్తుతం ఉన్న పన్ను రేట్లలో ఎలాంటి మార్పు లేదని స్పష్టం చేసింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో, దేశీయంగా ఇంధన లభ్యతను పెంచేందుకు ప్రభుత్వం మార్చి 27న డీజిల్, ఏటీఎఫ్ ఎగుమతులపై ఎగుమతి సుంకాన్ని విధించింది. అనంతరం ప్రతి రెండు వారాలకు ఒకసారి రేట్లను సవరించింది. మే 16 నుంచి పెట్రోల్ ఎగుమతులపైనా ఈ పన్నును విధించడం ప్రారంభించింది. పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితుల కారణంగా అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు పెరగడంతో, ఎగుమతిదారులు ధరల వ్యత్యాసం ద్వారా అనూహ్య లాభాలు పొందకుండా నిరోధించడంతో పాటు దేశీయ మార్కెట్లో పెట్రోలియం ఉత్పత్తుల లభ్యతను నిర్ధారించడమే విండ్‌ఫాల్ ట్యాక్స్ ప్రధాన ఉద్దేశమని ప్రభుత్వం తెలిపింది.



## టాటాసన్స్ ఏజీఎంపై అనిశ్చితి!

### ట్రస్టుల్లో నెలకొన్న వివాదాలే కారణమా?

**ముంబయి, ఆగస్టు 15:** టాటా గ్రూప్ హోల్డింగ్ కంపెనీ అయిన టాటా సన్స్ ఎజీఎంపై అనిశ్చితి నెలకొంది. 18న జరగాల్సిన ఈ సమావేశానికి కీలక వాటాదారు అయిన సర్ రతన్ టాటా ట్రస్ట్ ప్రతినిధిని నామినేట్ చేయలేకపోవడంతో ఏజీఎం నిర్వహణపై సందిగ్ధతనెలకొంది. మహారాష్ట్ర ఛారిటీ కమిషనర్ విధించిన నియంత్రణల కారణంగా ఎస్ఆర్‌టీటీ బోర్డు సమావేశాన్ని నిర్వహించలేని పరిస్థితి ఏర్పడింది. మరో కీలక ట్రస్ట్ అయిన సర్ దొరాబ్జీ టాటా ట్రస్ట్ తో కలిసి ఏజీఎంకు ప్రతినిధిని నామినేట్ చేయడం సాధ్యం కావడం లేదు.

ప్రస్తుత పరిస్థితుల్లో అవసరమైన కోరం లేకపోతే సమావేశాన్ని వాయిదా వేయాల్సి రావచ్చని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. కోరం కోసం ట్రస్టుల ప్రతినిధి తప్పనిసరిటాటా సన్స్ ఆర్టికల్స్ ఆఫ్ అసోసియేషన్‌లోని ఆర్టికల్ 86 ప్రకారం, ఏజీఎంలో కనీసం ఐదుగురు సభ్యులు వ్యక్తిగతంగా హాజరు కావాలి. ప్రస్తుతం ఎస్ఆర్‌టీటీకి టాటా సన్స్‌లో 23.56 శాతం, ఎస్‌డీటీటీకి 27.98 శాతం వాటా ఉంది. ఈ రెండు ట్రస్టులు కలిపి దాదాపు 66 శాతం వాటాను కలిగి ఉండటంతో ఆ నిబంధన వర్తిస్తుంది. షాపూర్జీ పల్లోంజీ కుటుంబానికి టాటా సన్స్‌లో సుమారు 18.37 శాతం వాటా ఉంది. ఎస్ఆర్‌టీటీ బోర్డు సమావేశం నిర్వహించలేకపోవడానికి మేలో మహారాష్ట్ర ఛారిటీ కమిషనర్ జారీ చేసిన ఆదేశాలే కారణమని తెలుస్తోంది. ట్రస్ట్ బోర్డు కూర్పుపై విచారణ పూర్తయ్యే వరకు ప్రతిపాదిత ట్రస్టీల సమావేశాన్ని వాయిదా వేయాలని కమిషనర్ ఆదేశించారు.

ఎస్ఆర్‌టీటీలో మొత్తం ఆరుగురు ట్రస్టీలు ఉండగా, వారిలో జిమ్మీ నావల్ టాటా, జహంగీర్ హెచ్.సి. జహంగీర్, నోయెల్ నావల్ టాటా ముగ్గురు జీవితకాల ట్రస్టీలుగా ఉన్నారని పేర్కొంటూ ఫిర్యాదు దాఖలైంది. అంటే మొత్తం బోర్డులో 50 శాతం మంది జీవితకాల ట్రస్టీలుగా ఉన్నారని, ఇది చట్టపరంగా అనుమతించిన 25 శాతం పరిమితిని మించింది. ఈ చట్ట సవరణ భవిష్యత్తులో జరిగే నియామకాలకు మాత్రమే వర్తిస్తుందని టాటా ట్రస్ట్స్ వాదిస్తోంది. ఎస్ఆర్‌టీటీ బోర్డు సమావేశం నిర్వహించేందుకు ఛారిటీ కమిషనర్ నుంచి అనుమతి లేకపోవడంతో, ఎస్‌డీటీటీతో కలిసి ఏజీఎంకు ప్రతినిధిని నామినేట్ చేయలేకపోతోందని తెలుస్తోంది. ఈనెల 18న జరగాల్సిన ఏజీఎంలో కోరంలేక వాయిదా పడితే, చట్టబద్ధమయిన ఏజీఎం జరిగే వరకు చంద్రశేఖరన్ డైరెక్టర్‌గా కొనసాగుతారని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి.

## సెటిల్‌మెంట్ విధానంలో సమగ్ర మార్పులకు సెబీ..!




**న్యూఢిల్లీ, ఆగస్టు 15:** మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ తన సెటిల్మెంట్ విధానంలో మారులు చేస్తోంది. సెటిల్మెంట్ మొత్తాన్ని లెక్కించే విధానాన్ని సరళీకరించడం, రూ.10 లక్షల వరకు సెటిల్మెంట్ మొత్తమున్న కేసులకు ఫాస్ట్రాక్ విధానం, షోకాజ్ నోటీసు జారీకి ముందే సెటిల్మెంట్ నోటీసు ఇవ్వడం, సెటిల్మెంటుకు దరఖాస్తు చేసుకునే గడువును 90 రోజులకు పెంచడం వంటివి ఉన్నాయి. గతంలో సెటిల్మెంట్ దరఖాస్తు తిరస్కరణకు గురైన వారికి, పరిస్థితులు మారితే తదుపరి దశలో మరోసారి సెటిల్మెంట్కు అవకాశం కల్పించడాన్ని కూడా ప్రతిపాదించింది. గత రెండేళ్లలో దాఖలైన, తిరస్కరణకు గురైన లేదా ఉపసంహరించుకున్న సెటిల్మెంట్ దరఖాస్తులను సెబీ పరిశీలించింది. కొత్త విధానం అమల్లోకి వస్తే ఈ వ్యత్యాసం సుమారు నాలుగు రెట్లకు తగ్గే అవకాశం ఉందని సెబీ అంచనా వేస్తోంది. రూ.10 లక్షల వరకు సెటిల్మెంట్ మొత్తం ఉండే కేసులకు ఫాస్ట్రాక్ విధానాన్ని తీసుకురావాలని సెబీ ప్రతిపాదించింది. షోకాజ్ నోటీసు జారీ అయిన తర్వాత సెటిల్మెంటుకు దరఖాస్తు చేసుకునే గడువును ప్రస్తుత 60 రోజుల నుంచి 90 రోజులకు పెంచాలని ప్రతిపాదించింది. గతంలో సెటిల్మెంట్ దరఖాస్తు తిరస్కరణకు గురైన వారికి కూడా తదుపరి దశలో మరోసారి అవకాశం ఇవ్వాలని సెబీ ప్రతిపాదించింది. అదనంగా 20 శాతం సెటిల్మెంట్ మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుంది. బహుళ విచారణలకు సంబంధించిన అదనపు 20 శాతం ఛార్జీని తొలగించడంతో పాటు, అనుచిత లబ్ది తిరిగి చెల్లింపుపై వడ్డీని కూడా ప్రామాణీకరించాలని సూచించింది.

## ఐదు ఐపిఒలు..రూ. 5499 కోట్ల సేకరణ లక్ష్యం

**ముంబయి, ఆగస్టు 15:** భారత స్టాక్ మార్కెట్లో ఐపీఓల సందడి కొనసాగుతోంది. ఇప్పటికే ఈ ఏడాది మెయిన్‌బోర్డు నుంచి ఏకంగా 42 కంపెనీలు ఐపీఓల ద్వారా రూ. 54,378 కోట్లు సమీకరించగా వచ్చే వారం 5 కంపెనీలు బిడ్డింగ్ ప్రారంభిస్తున్నాయి. ఈనెల 17 నుంచి 21 మధ్య ఈ 5 కంపెనీలు కలిపి సుమారు రూ. 5499.32 కోట్లను సమీకరించనున్నాయి. ఈ 5 ఐపీఓల్లో హారిజన్ ఇండస్ట్రియల్ పార్క్స్ అతిపెద్దది. 5 కంపెనీలు సమీకరించే నిధుల్లో ఈ కంపెనీ వాటానే 47 శాతంగా ఉంది. తర్వాతి స్థానం లలితా జువెల్లరీ మార్ట్‌ది. 17న రెండు కంపెనీల ఐపీఓలు ప్రారంభం కానున్నాయి. హారిజన్ ఇండస్ట్రియల్ పార్క్స్ రూ. 2600 కోట్లు సమీకరించేందుకు ఐపీఓకు వస్తోంది. ఇష్యూధర రూ. 5760 మధ్య ఉంది. సుమారు రూ. 2600 కోట్ల మేర నిధుల్ని సమీకరించనుంది. గడువుతేదీ 19 గా ఉంది. లలితా జువెల్లరీ




మార్ట్ ఐపీఓ కూడా 17న ప్రారంభం కానుండగా, ఇష్యూ ప్రైస్ రూ. 190-201 గా ఉంది. రూ. 1700 కోట్ల వరకు నిధుల్ని సమీకరించనుంది. 19వ తేదీనే తుదిగడువు. ఇతర చిన్న ఐపీఓలు చూస్తే ఆగస్ట 18న శంకేష్ జువెల్లర్స్, సన్‌షైన్ పిక్చర్స్ ఐపీఓలు ప్రారంభం కాబోతున్నాయి. శంకేష్ జువెల్లర్స్ రూ. 367.18 కోట్లు సమీకరించాలని లక్ష్యంకాగా ఇష్యూధర రూ. 88 93 గా ఉంది. 20 లాస్ట్ డేట్. సన్‌షైన్ పిక్చర్స్ షేర్ ప్రైస్ బ్యాండ్ రూ. 342 360 మధ్య ఉంది. ఇది రూ. 282.14 కోట్లు సమీకరించనుంది. ఆగస్ట్ 19న గాజా ఆల్టర్నేటివ్ అసెట్ మేనేజ్మెంట్ రానుంది. దీని లాస్ట్ డేట్ ఆగస్ట్ 21 గా ఉంది. కంపెనీ పబ్లిక్ ఇష్యూ ద్వారా రూ. 550 కోట్లు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇష్యూ ప్రైస్ బ్యాండ్ రూ. 152-160 గా ఉంది. ఇదే సమయంలో గత వారం సబ్‌స్క్రిప్షన్ జరిగిన 5 కంపెనీలు వచ్చే వారం స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్టింగ్ కానున్నాయి. ఈ 5 కంపెనీలు సుమారు రూ. 7478.69 కోట్ల మేర నిధుల్ని సమీకరించాయి.

## పన్ను చెల్లింపుదారుల విదేశీ ఆస్తుల వెల్లడికి 'ఫాస్ట్-డి' పథకం

**న్యూఢిల్లీ, ఆగస్టు 15:** చిన్న పన్ను చెల్లింపుదారుల విదేశీ ఆస్తుల వెల్లడికి సంబంధించిన ఫారిన్ అసెట్స్ ఆఫ్ స్మాల్ ట్యాక్స్ పేయర్స్-డిస్క్లోజర్ స్కీమ్ రూల్స్, 2026ను కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు నోటిఫై చేసింది. ఈ పథకంపై పన్ను చెల్లింపుదారులకు అవగాహన కల్పించేందుకు వివరణాత్మక ఎఫ్ఎక్యూలను కూడా విడుదల చేసింది. పథకం పరిధి2026 ఆర్థిక చట్టంలోని నాలుగో అధ్యాయం కింద ఫాస్ట్ డిఎస్‌ను స్వచ్ఛంద వెల్లడింపు విధానంగా తీసుకొచ్చారు. అర్హత కలిగిన పన్ను చెల్లింపుదారులు గతంలో వెల్లడించని విదేశీ ఆస్తులు, విదేశీ ఆదాయం లేదా ఆదాయపు పన్ను రిటర్నులో సరిగ్గా చూపించని విదేశీ ఆస్తులను నిర్దేశిత పన్ను లేదా రుసుము చెల్లించి వెల్లడించవచ్చు. ఈ పథకం 2026 ఆగస్టు 16 నుంచి అమల్లోకి రానుంది. డిక్లరేషన్లను 2026 డిసెంబర్ 31 వరకు దాఖలు చేయవచ్చు. ఆస్తుల విలువను 2026 మార్చి 31 నాటి విలువ ఆధారంగా లెక్కిస్తారు. ఆర్ఎన్ఓఆర్ నిర్దిష్ట నివాస నిబంధనలను పాటించే రెసిడెంట్ పన్ను చెల్లింపుదారులతో




పాటు కొంతమంది నాన్‌రెసిడెంట్, రెసిడెంట్ బట్ నాట్ ఆర్డినరీ రెసిడెంట్ పన్ను చెల్లింపుదారులు కూడా ఈ పథకం కింద డిక్లరేషన్ దాఖలు చేయవచ్చు. గతంలో వెల్లడించని విదేశీ ఆస్తులు లేదా విదేశీ ఆదాయం మొత్తం విలువ రూ.1 కోటి వరకు ఉండాలి. పన్ను రికార్డుల్లో ఇప్పటికే ప్రతిబింబించినప్పటికీ, రిటర్నులోని సంబంధిత షెడ్యూళ్లలో సరిగ్గా ప్రకటించని విదేశీ ఆస్తులకు రూ.5 కోట్ల వరకు పరిమితి ఉంటుంది. రూ.5 కోట్లకు మించిన విలువ కలిగిన ఆస్తులు ఈ పథకం పరిధిలోకి రావు. రూ.1 కోటి వరకు విలువైన వెల్లడించని విదేశీ ఆస్తులు లేదా ఆదాయానికి 30 శాతం పన్నుతో పాటు అదే మొత్తానికి సమానమైన అదనపు మొత్తం చెల్లించాలి. అంటే మొత్తం భారం 60 శాతంగా ఉంటుంది. రెండో కేటగిరీలోకి వచ్చే, రిటర్నులో సరిగ్గా వెల్లడించని విదేశీ ఆస్తులకు రూ.1 లక్ష ఫ్లాట్ ఫీజు విధిస్తారు. డిక్లరేషన్లను ఎలక్ట్రానిక్ విధానంలో ఫారం1 ద్వారా దాఖలు చేయాలి. అనంతరం పన్ను శాఖ చెల్లించాల్సిన మొత్తాన్ని ఫారం2 ద్వారా తెలియజేస్తుంది. ఆ మొత్తాన్ని రెండు నెలల్లోగా చెల్లించాలి. అవసరమైతే వడ్డీతో మరో రెండు నెలల వరకు గడువు పొడిగించే అవకాశం ఉంటుంది.

# పావ్‌బాజీ రుచులు

పావ్ అంటే బన్ను, భాజీ అంటే కూరగాయలు. వీటితో తయారయ్యే పావ్‌బాజీ.. మనందరికీ మహా ఇష్టం. చిన్న చిన్నగా ఆకలి వేసినప్పుడు.. వేడి వేడిగా పావ్‌భాజీ తింటుంటే ఆహా.. ఎంత బాగుంటుందో.. వీధుల్లో దొరికే పావ్‌భాజీ రకాలు ఇంట్లోనే చేసుకుందామా !

## జైన్ పావ్‌బాజీ



**కావలసినవి:** కాశ్మీరీ మిర్చి-12, నూనె-టేబుల్ స్పూన్, వెన్న-మూడు చెంచాలు, జీలకర్ర-చెంచా, క్యాప్సికం ముక్కలు- అర కప్పు, టొమాటో ముక్కలు-రెండు కప్పులు, కారం-2 చెంచాలు, పావ్‌భాజీ మసాలా-ఒకటిన్నర చెంచా, ఉప్పు-తగినంత, సన్నగా తరిగిన క్యాలీఫ్లవర్, పచ్చి బఠాణీలు-ఒక కప్పు చొప్పున, కొత్తిమీర తరుగు-అర కప్పు, బన్నులు-8, వేయించిన అప్పడాలు-8, నిమ్మరసం-చెంచా, **తయారీ:** కాశ్మీరీ మిర్చిని కొన్ని నీళ్లతో గ్రైండ్ చేసుకోవాలి. కడాయిలో నూనె, కొద్దిగా వెన్న వేసి వేడయ్యాక జీలకర్రను వేయించాలి.



అందులో మిర్చి పేస్టు, క్యాప్సికం, టొమాటో ముక్కలు, అర కప్పు నీళ్లు,కారం, పావ్‌భాజీ మసాలా, ఉప్పు వేసి 5 నిమిషాలు ఉడికించాలి. తర్వాత క్యాలీఫ్లవర్ ఉడికించిన బఠాణీల గుజ్జు, కొత్తిమీర తరుగు వేసి మరో 5 నిమిషాలు ఉడికించాలి. మధ్య మధ్యలో కలియతిప్పుతూ, మెదుపుతూ ఉండాలి.



కడాయిలోరెండు చెంచాల వెన్న, పావు చెంచా పావ్‌భాజీ మసాలా వేసి రెండు వైపులా వేయించుకోవాలి. ఉల్లి, టొమాటో ముక్కలు, నిమ్మ చెక్క, పాపడ్‌లతో ఈ జైన్ పావ్ భాజీ సూపర్‌గా ఉంటుంది.

## చీజ్ పావ్‌బాజీ

**కావలసినవి :** నూనె-3 చెంచాలు, బంగాళదుంపలు-3, టొమాటోలు-5, క్యారెట్-1, బీన్స్-6, ఉల్లిపాయలు-2, పచ్చిమిర్చి-3, క్యాప్సికం-1, కాశ్మీరీ చిల్లీ పౌడర్-2 చెంచాలు, జీలకర్ర పొడి, ఆమ్‌చూర్-చెంచా చొప్పున, ఉప్పు- తగినంత, పసుపు-అర చెంచా, ధనియాల పొడి, గరం మసాలా-రెండు చెంచాల చొప్పున, పావ్‌భాజీ మసాలా, బన్‌లు-8, చీజ్-కప్పు, నెయ్యి-2 చెంచాలు,కొత్తిమీర తరుగు-అరకప్పు

**తయారీ :** బంగాళదుంపలు, టొమాటోలు,క్యారెట్ బీన్స్‌లను కడిగి ముక్కలు కోసి ఉడికించాలి. చల్లారాక మెత్తగా మెదపాలి. కడాయిలో నూనె వేడయ్యాక ఉల్లి, పచ్చిమిర్చి, క్యాప్సికం వేసి వేయించాలి. ఉడికించిన కూరగాయల మిశ్రమం, ఉప్పు, పసుపు, కారం, జీలకర్ర పొడి, ఆమ్‌చూర్, ధనియాల పొడి, గరం మసాలా, పావ్‌భాజీ మసాలా,కొన్ని నీళ్లు వేసి కలియతిప్పి మగ్గనివ్వాలి. కొత్తిమీర, చీజ్ తరుగు వేసి దించేయాలి. పావ్‌ను నేతిలో వేయించాలి. వేడివేడిగా ప్లేటులో వడ్డించుకుని తినడమే తరువాయి.

## ముంబై పావ్‌బాజీ..

**కావలసినవి :** బన్నులు-8, వెల్లుల్లి ముక్కలు-2 చెంచాలు, ఉల్లి, క్యారెట్, టొమాటో,క్యాబేజ్, పచ్చి బఠాణీలు- అర కప్పు చొప్పున, క్యాప్సికం-అర కప్పు, కట్ చేసిన క్యాలీఫ్లవర్-2 కప్పులు, బంగాళదుంపలు-4, పావ్‌భాజీ మసాలా-3 చెంచాలు, అల్లం మిర్చి ముద్ద-చెంచా, నిమ్మరసం-చెంచా, వెన్న-2 చెంచాలు, కొత్తిమీర తరుగు-పావు కప్పు, ఉప్పు-తగినంత నూనె- అరకప్పు.

**తయారీ :** ముందుగా బన్నులను నేతిలో వేయించి పెట్టుకోవాలి. కడాయిలో నూనె కాగాక వెల్లుల్లి, అల్లం మిర్చి ముద్ద వేసి కొన్ని క్షణాలు వేయించాలి. తర్వాత ఉల్లి, టొమాటో, క్యారెట్ ముక్కలు, క్యాలీఫవర్ , క్యాబేజ్, పచ్చి బఠాణీలు, బంగాళదుంప ముక్కలు వేయించాలి. చివర్లో పావ్‌భాజీ మసాలా, ఉప్పు, నిమ్మరసం వేసికలియబెట్టి దించేయాలి. ఉల్లి, మిర్చి ముక్కలు, కొత్తిమీర తరుగుతో గార్నిష్ చేస్తే సరి ఘుమఘుమలాడే పావ్‌భాజీ సిద్ధం. ఎక్కువ మంది ఇష్టంగా తినే ముంబై రకం ఇది.

## పనీర్ పావ్‌బాజీ

**కావలసినవి :** బన్నులు-8, బంగాళదుంపలు-3, టొమాటోలు-4, ఉల్లిపాయలు-2, పనీర్- కప్పు, ఉప్పు-కొద్దిగా,అల్లం వెల్లుల్లి ముద్ద-చెంచా, కారం-చెంచా, పసుపు-అరచెంచా, నెయ్యి, కసూరిమేతి మెంతి., పావ్‌భాజీ మసాలా-2 చెంచాలు



చొప్పున, కొత్తిమీర తరుగు-అర కప్పు, నిమ్మరసం-చెంచా.

**తయారీ :** అడుగు భాగం మందంగా ఉన్న పాత్రలో కొద్దిగా నెయ్యి వేసి అందులో టొమాటో ముక్కలు, పచ్చి బఠాణీలు, క్యాప్సికం, ఉడికించి చిదిమిన బంగాళదుంప, అల్లం వెల్లుల్లి ముద్ద, ఉప్పు వేసి రెండు నిమిషాలు వేయించాలి. అరకప్పు నీళ్లు పోసి మూత పెట్టాలి. మగ్గిన తర్వాత మెత్తగా మెదపాలి. కారం, పసుపు, పావ్‌భాజీ మసాలా, కసూరి మెంతి వేసి కలియతిప్పాలి. చివరలో పనీర్ నెయ్యి, ఉల్లి, కొత్తిమీర తరుగు, నిమ్మరసం వేసి ఒక నిమిషం ఉంచి దించేయాలి. అంతే నేతిలో వేయించిన బన్నుతో భాజీ అమోఘంగా ఉంటుంది.

## గ్రీన్ పావ్‌బాజీ



**కావలసినవి :** బన్నులు-6, క్యాలీఫ్లవర్, క్యాప్సికం, బూడిద గుమ్మడి ముక్కలు, సొరకాయ ముక్కలు, బచ్చలి కూర, కొత్తిమీర, ఉల్లి కాడల తరుగు, పచ్చి బఠాణీలు-అన్నీ ఒక కప్పు చొప్పున, వెల్లుల్లి ముక్కలు- 2 చెంచాలు, బంగాళ దుంపలు-3, పచ్చిమిర్చి ముద్ద-చెంచా, ఉప్పు, పసుపు-చెంచా చొప్పున, వెన్న, నూనె-పావు కప్పు చొప్పున, పావ్‌భాజీ మసాలా-3 చెంచాలు,ఉల్లి ముక్కలు-కొద్దిగా, నిమ్మకాయ-ఒకటి. **తయారీ :** బన్నులను నేతిలో వేయించాలి. బూడిద గుమ్మడి, సొరకాయ, బంగాళదుంపల ముక్కలు, పచ్చి బఠాణీలనుకుక్కర్లో ఉడికించుకోవాలి. బచ్చలి, ఉల్లికాడల ముక్కలను రెండు నిమిషాలు ఒక పాత్రలో ఉడికించి చల్లారాక గ్రైండ్ చేయాలి. వెల్లుల్లి, మిర్చి ముద్దను నేతిలో వేయించాలి. అందులో సన్నగా తరిగిన కాయలీఫ్లవర్, క్యాప్సికం ముక్కలు వేసి అడుగంటకుండా కలియతిప్పుతూ మగ్గనివ్వాలి. ఇందులో కుక్కర్లో ఉడికించిన ముక్కలు,కొన్ని నీళ్లు, పసుపు వేయాలి. దగ్గర పడ్డాక బచ్చలి పేస్టు, పావ్‌భాదజి మసాలా వేసి నిమిషం పాటే సన్న సెగ మీద ఉంచి దించేస్తే సరిపోతుంది. ఉల్లి,(నిమ్మ రసాలతో వహ్వా అనిపిస్తుంది. ☐

# వాదన దేనికి?



అక్కాచెల్లెళ్లు, అన్నాతమ్ముళ్లు... తోబుట్టువులు ఎవరైనా చిన్న తనంలో పోట్లాడుకోవడం, ఆడుకోవడం సహజమే కదా! అయితే, ఇలా వాదించు కోవడం వల్ల పిల్లల్లో సామాజిక నైపుణ్యాలు, పద ఉచ్చరణ సమస్యను పరిష్కరించే టెక్నిక్‌లు, కాంపిటీటివ్ స్పిరిట్ నేషనల్ డెవలప్‌మెంట్ డిగ్రీ కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ చేసిన పరిశోధనలు చెబుతున్నాయి. ☐

# మౌనగీతం మనసు తాకిన వేళ !



జనగణమన గీతం వింటేనే వళ్లు పులకరిస్తుంది. ఒక్కసారిగా దేశభక్తి భావం ఉప్పొంగుపోతుంది. జాతీయ గీతం విననంతనే మనసు ఉల్లాసంగా పరుగెడ్కుతుంది. ఏదో తెలియని భావం మనసంతా నిండిపోతుంది. అద జనగణమన స్వరం లయ బద్ధంగా విన్నపుడు. కానీ 500 మంది మూగ విద్యార్థులైతే ఎలాగైనా తమ కొచ్చిన భాషలో మౌనంగానే సంకేత భాషతో 'జనగణమన' పాడి జనాన్ని ఆకట్టుకున్నారంటే వారిలోని హృదయ స్పందనను అర్థం చేసుకోవచ్చు. వారి హావభావాలే మనిషిని కట్టిపడే సాయి. అంటే సంకేత భాషలో 'జనగణమన'కు మౌనగీతాలపన చేసి జనులందరినీ ఆకట్టుకున్నారంటే మాటలా! వారు అలా సంకేత గీతం పాడుతుంటే దేశభక్తికి అసలు సిసలు రూపం స్వరం కాదు, గళం కాదు, హృదయస్పందనేనని అర్థమౌతుంది. 'వందేమాతరం' అన్నా చెవి కోసుకునే వారు సైతం ఈసారి ఆ చిన్నారుల మౌనగీతాలను ఆలకించారు. 14 ఏళ్ల క్రితమే తొలిసారిగా ముంబయి బాల బాలికలు 'ఈ మౌనగీతా'నిక సంకేత భాషను జత కలిపి రక్తి కట్టించారు. వారిలో కొంత మంది వినికిడి లోపం ఉన్నవారు కూడా ఉండటం విశేషం. కేవలం వారి హృదయ స్పందన ద్వారానే మనసులోని భావాలకు దృశ్యరూపం ఇచ్చారు. వారి ప్రతి సంకేతమూ వారిలోని 'భారతీయత'ను తట్టి లేపింది. ముంబయి లోని ప్రత్యేక అవసరాలున్న 8 పాఠశాల ల్లోని కనీసం 500 మంది. సృజించిన దేశభక్తి గీతాలలో ఆనాటి థియేటర్‌లోని ప్రేక్షకులను కదలకుండా కూర్చోబెట్టింది. ప్రతి చిన్నారి చేతి కదలికల్లో దేశభక్తి భావ ధ్వనించింది. ప్రతి ఒక్కరిలోనూ భారతీయులుగా పుట్టా మన్న గర్వం తొణికిసలాడింది. ముద్రా గ్రూప్..బిగ్ సినిమాస్ కోసం 2011లో రూపొందించినది సైలెంట్ నేషనల్ ఆంథమ్ ప్రచారం వెనుక ఈ అద్భుతమైన ఆలోచన ఉంది. అంటూ బాబీ పవార్ ఆలోచన నుంచి ఈ ప్రయోగం పుట్టింది. సాధారణంగా జాతీయ గీతాన్ని వింటాం. కానీ ఈ సారి దాన్ని వినకుండా చూడాల్సి వచ్చింది. వినికిడి, మాటల లోపం ఉన్న చిన్నారులు సంకేత భాషలో 'జనగణమన'ను ప్రదర్శించారు. దేశభక్తిని వినిపించకుండా అనుభూతి చెందేలా చేసిన ఈ ఆలోచన ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంది. కాన్స్ లయన్స్‌లో ఒక సిల్వర్, రెండు బ్రాంజ్ అవార్డులను సొంతం చేసుకుంది. ☐

# సూర్యభగవానుడు

సూర్యభగవానుడిని ప్రత్యక్ష దైవంగా భావిస్తూ ఆరాధించడమనేది వేదం కాలం నుంచీ వుంది. అవతార మూర్తులు .. ఇంద్రాది దేవతలు .. మహర్షులు .. సూర్య భగవానుడిని ఆరాధించిన వారే. సూర్యోదయంతోనే సమస్త జీవులలో చైతన్యం మొదలవుతుంది. ఆ జీవరాశికి అవసరమైన ఆహారాన్ని ప్రకృతి ద్వారా సూర్యుడే అందజేస్తూ ఉంటాడు. అందువల్లనే సమస్త జీవుల జీవనానికి ఆధారభూతుడు సూర్యుడని చెబుతుంటారు. సూర్య కిరణాల వలన అనేక రకాల రోగకారక క్రిములు నశిస్తాయి. అందువలన అనారోగ్యం బారిన పడకుండా ఉండటం జరుగుతుంది. ఈ



కారణంగానే తమ నివాస ద్వారం తూర్పు ముఖంగా ఉండేలా చూసుకుంటూ వుంటారు. సూర్య నమస్కారం వలన శారీరక పరమైన ఆరోగ్యం కలుగుతుంది. అలాంటిసూర్యభగవానుడి పూజకి, జాజి .. తామర .. పొగడ .. పున్నాగ .. మోదుగ .. గన్నేరు .. సంపెంగ .. గులాబి .. మందారాలు శ్రేష్ఠమైనవిగా ఆధ్యాత్మిక గ్రంథాలు చెబుతున్నాయి. సూర్య నమస్కారాల వలన .. ఆయన పూజలో ఈ పూలను ఉపయోగించడం వలన ఆయురారోగ్యాలు కలుగుతాయని స్పష్టం చేస్తున్నాయి. ☐

# తెర

## 'VISA వింటారా సరదాగా' రెండో టీజర్ విడుదల



అక్టోబర్ 17న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదలజు:ఖీతి వింటారా సరదాగ్గా చిత్రానికి సంబంధించిన రెండో టీజర్ తాజాగా విడుదలై సోషల్ మీడియాలో మంచి స్పందనను సొంతం చేసుకుంటోంది.ఉద్భవ్ రఘు ఈ చిత్రం ద్వారా దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఆయన తెరకెక్కిస్తున్న ఈ క్విర్కీ క్యాంపస్ టు యుఎస్ఎ రొమాంటిక్ కామెడీ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై నిర్మాతలు సూర్యదేవర నాగవంశీ ఎస్. మరియు సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. అశోక్ గల్లా, శ్రీ గౌరీ ప్రియ జంటగా నటిస్తుండగా.. రాహుల్ విజయ్, శివాత్మిక రాజశేఖర్, హర్ష చెముడు తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.ఈ రెండో టీజర్‌ను పూర్తిగా కథానాయకుడి కోణంలో రూపొందించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రేమ, అమ్మాయిల వల్ల అబ్బాయిల జీవితంలో ఎదురయ్యే ట్రబుల్స్ గురించి అశోక్ గల్లా పాత్ర తనదైన శైలిలో చెప్పే మాటలు యూత్‌ను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. సహజమైన సంభాషణలు, చురుకైన హాస్యం, మనసును హత్తుకునే ఎమోషన్స్‌తో సాగిన ఈ మోనోలాగ్ టీజర్‌కు మరింత క్రేజ్ తీసుకొచ్చింది.అయితే ఈ టీజర్‌లో అందరి దృష్టిని ఆకర్షించిన మరో ఆసక్తికరమైన అంశంఖలేజ్జా చిత్రంలోని ఐకానిక్ డైలాగ్‌కు సంబంధించిన రిఫరెన్స్. ఊహించని విధంగా వచ్చిన ఈ రిఫరెన్స్ అభిమానుల్లో ఉత్సాహాన్ని మరింత పెంచింది.విజయ్ బుల్గానిన్ అందించిన సంగీతం టీజర్‌లోని ఎనర్జీకి మరింత బలాన్ని చేకూర్చింది. వినోదం, ప్రేమ, యూత్‌ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో రూపొందినజు:ఖీతి వింటారా సరదాగ్గా రెండో టీజర్ సినిమాపై అంచనాలను మరింత పెంచుతోంది. VISA వింటారా సరదాగా చిత్రం అక్టోబర్ 17న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కానుంది.

## 'ది ఇండియన్ బార్డర్' సాంగ్ లాంచ్



ఆర్ట్ ఇన్ హార్ట్ క్రియేషన్స్ బ్యానర్ మీద నివేద్య రెడ్డి నిర్మాణంలో డి.ఎస్. బాషా దర్శకత్వం వహించిన చిత్రంది ఇండియన్ బార్డర్ ఈ సినిమాలో కిరణ్ యార్లగడ్డ, ఆదర్ష్, మురళీ మోహన్, మేఘా శ్రీ, సింధు తులాని ముఖ్య పాత్రలను పోషించారు. ఇండిపెండెన్స్ డే సందర్భంగా ఈ మూవీ నుంచి ఓ దేశ భక్తి గీతాన్ని విడుదల చేశారు.జిందా రహేన్ తో డ్యూటీ అంటూ సాగే ఈ పాట అడ్రినల్ రష్‌లా ఉంది. గూస్ బంప్స్ ఇచ్చేలా, నరనరాల్లో దేశభక్తిని రగిల్చేలా ఈ పాట సాగింది. ఇక ఈ పాటకు ఆనంద్ మంత్ర బాణీ, డి.ఎస్. బాషా సాహిత్యం, శరవణ గాత్రం దేశ భక్తి గీతంగా మార్చే సింది .మేజర్ ఎస్‌పీఎస్ ఒబేరాయ్ మాట్లా డుతూ.. దేశం గురించి, సైన్యం గురించి సినిమా తీయడం ఆనందంగా ఉంది. అందరూ ఆరోగ్యాన్ని కాపాడు కోవాలి. బయటి ఆహారాన్ని తినొద్దు. ఈ మూవీ మంచి విజయం సాధించాల్సి అని అన్నారు. హీరో, రైటర్ కిరణ్ యార్లగడ్డ మాట్లాడుతూ.. .. ది ఇండియన్ బార్డర్ ఈవెంట్ కోసం వచ్చిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. పాలస్తీనా వార్ టైంలో ఈ కథ నాలో పుట్టింది. డి.ఎస్.బాషా గారు ఈ కథకు ఓ స్వరూపాన్ని తీసుకు వచ్చారు. ఎక్స్ ఆర్మీ పర్సన్స్, మీడియా మాకు ఎంతగానో సపోర్ట్ చేసింది. సైనికుడు చేసే త్యాగం, సైనికుడి భార్య చేసే త్యాగాల్ని ఇందులో చూపించాం. దర్శకుడు డి.ఎస్. బాషా మాట్లాడుతూ.. .. ది ఇండియన్ బార్డర్త్ ఈవెంట్‌కి వచ్చిన ఆర్మీ అధికారులు, మీడియా వారికి థాంక్స్.

## 'పొలిమేర 3'లో 'విరావి'గా కింగ్ అర్జున్



వంశీ నందిపాటి ఎంటర్‌టైన్‌మెంట్స్, శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్‌పీ సంయుక్తంగా నిర్మిస్తున్న మిస్టిక్ థ్రిల్లర్ పోలిమేర3 ఈ చిత్రంలో యాక్షన్ కింగ్ అర్జున్ సర్జా విరావిగా ఓ పవర్‌ఫుల్ పాత్రలో కనిపించ బోతున్నారు. ఆగస్టు 15న అర్జున్ పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఓ పోస్టర్‌ను విడుదల చేశారు. ఓటీటీలోమా ఊరి పొలిమేర్థతో సంచలనం సృష్టించి, 'పొలిమేర 2'తో థియేట్రికల్ బ్లాక్‌బస్టర్ విజయాన్ని అందుకున్న ఈ మిస్టిక్ థ్రిల్లర్ ఫ్రాంచైజ్ ఇప్పుడు తదుపరి అధ్యాయంలోకి అడుగు పెట్టింది. ఈ ఇద్దరు అభిరుచి గల నిర్మాతల అసోసియేషన్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రం మరింత భారీ స్థాయిలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇటీవల 'పొలిమేర 3' చిత్రాన్ని చిత్రబృందం ఘనంగా ప్రారంభించిన సంగతి తెలిసిందే. అయితే ఈ అనౌన్స్‌మెంట్‌లో అతిపెద్ద సర్‌ప్రైజ్, ప్రధాన ఆకర్షణ యాక్షన్ కింగ్ అర్జున్ సర్జాపొలిమేర్థ యూనివర్స్‌లోకి ఎంట్రీ ఇవ్వడం.బ్లాస్ట్ జోన్త్‌తో భారీ విజయాన్ని అందుకున్న అర్జున్.. ఈ ఫ్రాంచైజ్‌లో పవర్‌ఫుల్ పాత్రలో కనిపించను న్నారు.అర్జున్ సర్జా పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ ఆయన పాత్ర పేరును వెల్లడిస్తూ ఓ ఇంట్రెస్టింగ్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ చిత్రంలో అర్జున్ 'విరావి' పాత్రలో నటిస్తున్నారు. పోస్టర్‌లో ఆయన కండలు తిరిగిన చేతిపై ఉన్న పరమశివుని త్రిశూలం, శ్రీమహావిష్ణువు సుదర్శన చక్రం టాటూలు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. త్వరలోనే ఫస్ట్ లుక్‌ను విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటిం చారు. పొలిమేర, పొలిమేర2తో తన నటనతో ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్న ఐకానిక్ కొమురయ్య పాత్రలో సత్యం రాజేష్ మరోసారి అలరించనున్నారు. ఈ చిత్రంలో కామాక్షి భాస్కర్ల పాత్ర కూడా కీలకంగా ఉండనుంది., గెటప్ శ్రీను, బాలాదిత్య, రాకేందు మౌళి తదితర ప్రతిభావంతులైన నటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. దీంతో ఇప్పటివరకు వచ్చినపొలిమేర్థ చిత్రాల్లోనే అతిపెద్ద తారాగణంతో పొలిమేర 3 తెరకెక్కుతోంది.ఆసక్తికరమైన తారాగణం, ప్రతిభావంతమైన సాంకేతిక బృందం, భారీ స్థాయి కథాంశంతో ఇప్పటికే నిర్మాణంలో ఉన్న అత్యంత ఆసక్తికరమైన చిత్రాల్లోపొలిమేర 3 ఒకటిగా నిలిచింది.

## 'అమీర్ లోగ్' ట్రైలర్ లాంచ్ ఈవెంట్



'అవ్వల్ నంబర్ ప్రొడక్షన్స్' బ్యానర్‌పై మాధవి రెడ్డి సోమ నిర్మించిన అమీర్ లోగ్ మూవీకి రమణా రెడ్డి సోమ దర్శకత్వం వహించారు. ఈ సినిమాకి మనోహర్ రెడ్డి మంచురి సహ నిర్మాతగా వ్యవహరించారు. ఈ చిత్రంలో హరి, మనోజ్, శశిధర్ ప్రధాన పాత్రల్లో నటించగా.. వేధా జలంధర్, రావణ్ నిట్టూరు, విశ్వేందర్ రెడ్డి, సాయియోగి కీలక పాత్రలు పోషించారు. రానా దగ్గుబాటి సంస్థ ఖిస్పిరిట్ మీడియాఖి ఈ మూవీని తెలుగులో ఆగస్ట్ 21న గ్రాండ్‌గా రిలీజ్ చేయబోతోంది. 'లిటిల్ హార్ట్స్' డైరెక్టర్ సాయి మార్తాండ్ మాట్లాడుతూ.. .. అమీర్ లోగ్ సాంగ్స్ బాగున్నాయి. టీజర్, ట్రైలర్ నాకు నచ్చింది. సాయి స్మరణ్ మ్యూజిక్ అంటే నాకు చాలా ఇష్టం. హరి నాకు మంచి మిత్రుడు. అని అన్నారు..' లిటిల్ హార్ట్స్' మ్యూజిక్ డైరెక్టర్ సింజిత్ మాట్లాడుతూ.. ..'అమీర్ లోగ్'లోని ఆర్టిస్టులందరూ సహజంగా అనిపిస్తున్నారు. నా మెంటర్ సాయి స్మరణ్. అతని మ్యూజిక్‌కి నేను చాలా పెద్ద ఫ్యాన్. హరి మంచి ఆర్టిస్ట్, సింగర్. ట్రైలర్ బాగుంది.దర్శకుడు రమణ రెడ్డి మాట్లాడుతూ.. .అమీర్ లోగ్ చిత్రం హైదరాబాద్ ప్రజలకు ప్రతీకగా ఉంటుంది. ఈ చిత్రంలో అన్ని రకాల ఎమోషన్స్ ఉంటాయి. అందరినీ ఏడ్పిస్తాం, నవ్విస్తాం. కంటెంట్ మీదున్న నమ్మకంతోనే అందరం ఎంతో కాన్ఫిడెంట్‌గా, సంతోషంగా ఉన్నాం. ..నిర్మాత మాధవి రెడ్డి సోమ మాట్లాడుతూ.. అమీర్ లోగ్ సినిమా విడుదల చేస్తున్న స్పిరిట్ మీడియాకి థాంక్స్. ఆగస్ట్ 21న మా సినిమాని చూసి ప్రేక్షకదేవుళ్లు మమ్మల్ని సపోర్ట్ చేస్తారని ఆశిస్తున్నాన్థ అని అన్నారు..లైన్ ప్రొడ్యూసర్ శశి మాట్లాడుతూ.. ..అమీర్ లోగ్థ్‌కి ఈవెంట్లు చేయొద్దని ఒకప్పుడు అనుకున్నాం. కానీ ప్రతీ ఈవెంట్‌కి మాకు ఓ పండుగలా అనిపిస్తోంది. రమణ ఈ మూవీ కోసం అద్భుతమైన స్టోరీ సెట్ చేసుకున్నారు.అమీర్ లోగ్థ్‌ని అద్భుతంగా తెరకెక్కించారు. నటుడు విశ్వేందర్ రెడ్డి మాట్లాడుతూ...'అమీర్ లోగ్' సినిమా హైదరాబాద్ సోల్‌ను చూపిస్తుంది. మ్యూజిక్ డైరెక్టర్ సాయి స్మరణ్ మాట్లాడుతూ.. ..'అమీర్ లోగ్' చిత్రంలో నాకు సపోర్ట్ చేసిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. ఈ మూవీకి ఎస్వీకే కెమెరావర్క్, రోహిత్ పెనుమత్స ఎడిటింగ్, స్మరణ్ సాయి మ్యూజిక్ ప్రధాన ఆకర్షణ కానున్నాయి.

## 'శనార్తి' సినిమా గ్రాండ్‌గా లాంచ్



బ్లాక్‌బస్టర్ దర్శకుడు సంపత్ నంది విజయవంతమైన నిర్మాణ సంస్థ సంపత్ నంది టీమ్‌వర్క్స్, శ్రీ ధనలక్ష్మి ప్రొడక్షన్స్ అధినేత, అభిరుచి గల నిర్మాత కె.వి. శ్రీధర్ రెడ్డితో కలిసి తన రెండవ చిత్రాన్ని నిర్మించడానికి సిద్ధమవుతోంది. 'రాజు వెడ్స్ రాంబాయి' చిత్రంతో ప్రేక్షకులను ఆకట్టుకున్న అఖిల్ రాజ్, యంగ్ ట్యాలెంటెడ్ నాగ దుర్గ ఇందులో ప్రధాన పాత్రలు పోషిస్తు న్నారు. ఈ చిత్రానికి 'శనార్తి' అనే పవర్ ఫుల్ టైటిల్ పెట్టారు. ఇది తెలంగాణలో సాంప్రదాయకంగా పలకరించడానికి ఉపయోగించే పదం. టైటిల్ పోస్టర్‌లో ఒక చేయి పసుపు పచ్చ రంగులో, మరొక చేయి ఎరుపు రంగులో ఒకదాని కొకటి పట్టుకున్న రెండు చేతులు.. రెండు చేతుల మణి కట్టు చుట్టూ పవిత్రమైన జంధ్యాలు కట్టి ఉండగా, ఎరుపు రంగు వేసిన చేతికి సాంప్రదాయ ఎర్ర గాజుల దండ అలంకరించబడి ఉంది. రచయితగా, కథకుడిగా, షోరన్నర్‌గా తనకున్న ప్రతిభతో పేరుగాంచిన దర్శకుడు సంపత్ నంది 'ఓదెల' ఫ్రాంచైజీతో సహా విజయవంత మైన కథలు, ఫ్రాంచైజీలను రూపొం దించడంలో కీలక పాత్ర పోషించారు. శనార్తితో ఆయన అనుబంధం ఈ ప్రాజెక్ట్‌పై అంచనాలను పెంచుతోంది. తన విలక్షణమైన సంగీతంతో శంసలు పొందిన సురేష్ బొబ్బిలి ఈ చిత్రానికి సంగీతపరంగా మరింత బలాన్ని చేకూరుస్తున్నారు. ఆయన అందించే సంగీతం సినిమాలోని గ్రామీణ నేపథ్యా నికి సరిగ్గా సరిపోవడమే కాకుండా చిత్రంలోని భావోద్వేగాలను పెంచు తోంది. హైదరాబాద్‌లోని రామా నాయుడు స్టూడియోలో ప్రముఖ సినీ ప్రముఖులు, చిత్ర బృందం సమక్షంలో ఈ సినిమా ప్రారంభోత్సవం జరిగింది. మూవీ లాంచింగ్ ఈవెంట్‌లో సంపత్ నంది మాట్లాడుతూ.. ఈ వేడుకకు విచ్చేసిన అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు.

## 'తొలిసారి మిమ్మల్ని చూసింది మొదలు'. పూజా కార్యక్రమం



పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమైన కన్నడ 'సుప్రీమ్ స్టార్ భార్గవ్ 'తొలిసారి మిమ్మల్ని చూసింది మొదలు' మూవీ.. కన్నడ చిత్ర పరిశ్రమలో 'సుప్రీమ్ స్టార్'గా పేరు తెచ్చుకున్న భార్గవ్ హీరోగా నటిస్తూ దర్శకత్వం వహిస్తున్న సినిమా 'తొలిసారి మిమ్మల్ని చూసింది మొదలు'. ఈ చిత్రంలో మీనాక్షి జైస్వాల్, ఆరియా మీనన్ హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని తెలుగు కన్నడ భాషల్లో కొసల క్రియేటివ్ వర్క్స్ ప్రైవేట్ లిమిటెడ్ పతాకంపై ప్రొడ్యూసర్ బండి నాగరాజు నిర్మిస్తున్నారు. మద్దినేని రమేష్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. భార్గవ్ బి.వి. దర్శకత్వం వహిస్తున్నారు. విలేజ్ బ్యాక్ డ్రాప్‌లో సాగే ఎమోషనల్ థ్రిల్లర్‌గా ఈ సినిమా రూపొందనుంది. పూజా కార్యక్రమాలతో ఈ చిత్ర ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. ముహూర్తపు సన్నివేశానికి ప్రముఖ నిర్మాత చదలవాడ శ్రీనివాసరావు క్లాప్ ఇవ్వగా, ఫిలించాంబర్ సెక్రటరీ కె. అశోక్ కుమార్ కెమెరా స్విచ్ఛాన్ చేశారు. దర్శకుడు దశరథ్ తొలి షాట్‌కు గౌరవ దర్శకత్వం వహించారు. డైరెక్టర్ వీరశంకర్ స్క్రిప్ట్ అందజేశారు. అనంతరం జరిగిన ప్రెస్ మీట్‌లో ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ మద్దినేని రమేష్ మాట్లాడుతూ ఈ రోజు మా మూవీ పూజా కార్యక్రమాలకు అతిథులుగా వచ్చిన చదలవాడ శ్రీనివాసరావుకి, అశోక్ కుమార్‌కి, దశరథ్‌కి, ఇతర పెద్దలందరికీ కృతజ్ఞతలు. ప్రొడ్యూసర్ బండి నాగరాజు మాట్లాడుతూ ఒక మంచి కథతో మా సినిమాను నిర్మిస్తున్నాం. భార్గవ్ కన్నడలో ఎంతో కష్టపడి పేరు తెచ్చుకున్నారు.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.